మీ రాజకీయ అవగాహన కోసం...

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
**ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| (1) | దిద్దుబాటు ఉద్యమం - సన్నాహక ప్రతాలు | వెల : రు.5/- |
| (2) | 2009 లోక్‌సభ , అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్ష<br>కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీల నివేదికలు (పార్టీ సభ్యులకు) | వెల : రు.5/- |
| (3) | ముస్లిం మైనారిటీల రక్షణలో సిపిఐ (ఎం) | వెల : రు. 2/- |
| (4) | కేంద్ర - రాష్ట్ర సంబంధాల పునర్వ్యవస్థీకరణ మార్గనిర్దేశకపత్రం<br>2008, అక్టోబర్ కేంద్రకమిటీ సమావేశంలో ఆమోదించినది | వెల : రు. 4/- |
| (5) | 19వ మహాసభ రాజకీయ తీర్మానం | వెల : రు. 8/- |
| (6) | స్వయం సహాయక బృందాలు : పార్టీ వైఖరి | వెల : రు. 4/- |
| (7) | కేంద్ర ప్రభుత్వంలో చేరే అంశంపై పార్టీ 16వ మహాసభ | వెల : రు.3/- |
| (8) | వామపక్ష ప్రభుత్వాలు<br>అనుభవాలు, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి పాత్ర<br>భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 19వ మహాసభ<br>రాజకీయ నిర్మాణ నివేదిక నుండి | వెల : రు.3/- |
| (9) | ఐక్య సంఘటన ఎత్తుగడలు - సమీక్ష<br>పార్టీ 17వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదిక నుండి | వెల : రు. 3/- |
| (10) | విద్యార్థి రంగం : విధానం - కర్తవ్యాలు<br>(2007 మార్చి 31- ఏప్రిల్ 2 కేంద్ర కమిటీ సమావేశాల్లో ఆమోదించినది) | వెల : రు. 5/- |
| (11) | నిరంతర పోరాట స్ఫూర్తి మేడే | వెల : రు. 7/- |



ప్రచురణ

**నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్**

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర , హైదరాబాద్-20, 27660013

బ్రాంచీలు : హైదరాబాద్, - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్. నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్


## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# కార్యక్రమం నిబంధనావళి


నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# కార్యక్రమం

# నిబంధనావళి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# కార్యక్రమం
# నిబంధనావళి


నవ తెలంగాణ పబ్లిషింగ్‌హౌస్

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 -27660013*

120097

ప్రచురణ సంఖ్య : 1100

ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2009
రెండవ ముద్రణ : డిసెంబర్, 2011
మూడవ ముద్రణ : ఏప్రిల్, 2016

వెల : ₹ 30/-

ప్రతులకు : నవ తెలంగాణ పబ్లిషింగ్‌హౌస్
ఎమ్.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్.టి.సి. కల్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20.
ఫోన్ : 040-27660013

బ్రాంచీలు : నవ తెలంగాణ పబ్లిషింగ్‌హౌస్
హైదరాబాద్, - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.
నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్

ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలు
విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు

ముద్రణ : నవ తెలంగాణ ప్రింటర్స్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్

# విషయసూచిక


**I. కార్యక్రమం ........................................ 7**

1. ఉపోద్ఘాతం ........................................ 8
2. వర్తమాన ప్రపంచంలో సోషలిజం ........................ 13
3. స్వాతంత్ర్యం – ఆ తర్వాత ............................ 19
4. విదేశాంగ విధానం ................................... 33
5. రాజ్యాంగ యంత్రం – ప్రజాస్వామ్యం ..................... 36
6. జనతా ప్రజాస్వామ్యం – దాని కార్యక్రమం ................ 45
7. జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మాణం .................. 56
8. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం .......................... 63

**II. నిబంధనావళి ........................................ 67**

# కార్యక్రమం

**(1964లో పార్టీ 7వ మహాసభలో ఆమోదించబడి,**

**2000 సంవత్సరం ప్రత్యేక మహాసభలో తాజాపర్చబడింది)**

# 1

# ఉపోద్ఘాతం

1.1 భారత ప్రజల ప్రగతిశీల, సామ్రాజ్యవాద వ్యతిరేక, విప్లవ సాంప్రదాయాలను వారసత్వంగా స్వీకరించింది కమ్యూనిస్టు పార్టీ. రష్యాలో అక్టోబర్ సోషలిస్టు విప్లవంతో ఉత్తేజితులైన దీక్షాయుత సామ్రాజ్యవాద వ్యతిరేక యోధుల చిన్నబృందంచే 1920లో ఏర్పర్చబడిన నాటి నుండి పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం మౌలికమైన సామాజిక పరివర్తన కోసం పోరాడటం తన లక్ష్యంగా నిర్దేశించుకున్నది. వర్గదోపిడి, సామాజిక అణచివేత లేని సోషలిస్టు సమాజాన్ని భారతదేశంలో స్థాపించటానికై కృషి చేయటానికి పార్టీ ప్రతినబూనింది.

1.2 ప్రపంచమంతటా సామ్రాజ్యవాద వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ విమోచన వుద్యమాలు, ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం పోరాటాలు ఇరవయ్యో శతాబ్దపు ప్రధాన లక్షణాలు. కార్మికవర్గ అంతర్జాతీయతకు అనుగుణంగా పార్టీ వాటిని సర్వదా బలపరచింది. జాతీయ స్వాతంత్ర్య సాధనకు, సోషలిజం లక్ష్యసాధనకు, అంతిమ లక్ష్యమైన కమ్యూనిజం దిశగా పురోగమించటానికిగాను కార్యాచరణకు కరదీపికగా మార్క్సిజం–లెనినిజం సూత్రాలను పార్టీ చేపట్టింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న డిమాండ్‌ను దేశంలోకెల్లా మున్ముందుగా లేవనెత్తిందీ, 1921లో అహమ్మదాబాద్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో ఇందుకోసం తీర్మానం తెచ్చిందీ కమ్యూనిస్టులే.

1.3 సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కోరటంతోనే కమ్యూనిస్టులు సరిపుచ్చు కోలేదు. భూస్వామ్య విధానం రద్దు, ఫ్యూడల్ ఆధిపత్యానికి స్వస్తి, కులపీడన

నిర్మూలించడం వంటి కీలక సమస్యలకు చోటు కల్పించుతూ, సామాజిక ఆర్థిక మార్పుకు నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించడం ద్వారా స్వరాజ్య నినాదానికి ప్రగతిశీల సారాన్ని నింపవలసిన ఆవశ్యకతను కూడా నొక్కి చెప్పారు.

1.4 కమ్యూనిస్టులు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొంటూనే, ఆది నుంచీ కూడా, కార్మికులను ట్రేడ్ యూనియన్లలోనూ, రైతులను కిసాన్ సభలోనూ, విద్యార్థులను వారి సంఘాలలోనూ, అలాగే ఇతర సెక్షన్లను వారి వారి ప్రజా సంఘాలలోనూ సమీకరించి సంఘటిత పరచటానికి తమ శక్తినంతా ధారపోశారు. ఈ ప్రయత్నాల వల్లనే **అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్** వంటి జాతీయ సంస్థల స్థాపన, **అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్**ను పటిష్టపరచడం జరిగాయి. అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ వంటి ప్రగతిశీల సాంస్కృతిక, సాహిత్య సంఘాల స్థాపనకు కమ్యూనిస్టులు చొరవ తీసుకున్నారు.

1.5 భారతదేశంలో కమ్యూనిజాన్ని కాలరాయాలని బ్రిటిష్ పాలకులు గట్టిగా భావించారు. అప్పుడప్పుడే అంకురించుతున్న కమ్యూనిస్టు బృందాలపై పాశవికమైన నిర్బంధకాండను ప్రయోగించారు. విప్లవ భావాల వ్యాప్తిని నిరోధించడం కోసం కమ్యూనిస్టు సాహిత్యాన్ని నిషేధించారు. కమ్యూనిస్టు ఉద్యమ యువ నాయకత్వంపై వరుసగా పెషావర్ (1922), కాన్పూరు (1924), మీరట్ (1929) కుట్ర కేసులు నడిపారు. 1920వ దశకంలో పార్టీ ఏర్పడిన వెంటనే చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించారు. రెండు దశాబ్దాలకు పైగా నిషేధ పరిస్థితులలోనే పార్టీ పని చేయవలసి వచ్చింది. తీవ్రమైన నిర్బంధం ప్రయోగించబడినప్పటికీ, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం, మౌలికమైన సామాజిక మార్పు కోసం ప్రజలను సమీకరించటంలో పార్టీ నికరంగా పురోగమించింది.

1.6 సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన నికరమైన సమరశీల వైఖరి వివిధ విప్లవ స్రవంతులను, పోరాటయోధులను ఆకర్షించి పార్టీలో చేరేలా చేసింది. పంజాబ్ గదర్ వీరులు, భగత్‌సింగ్ సహచరులు, బెంగాల్ విప్లవకారులు, బొంబాయి, మద్రాసు రాష్ట్రాల్లో సమరశీల కార్మికవర్గ యోధులు, కేరళ, ఆంధ్రప్రదేశ్, దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన సామ్రాజ్యవాద వ్యతిరేకులైన కాంగ్రెస్ అతివాదులూ అలాంటి వారిలో వున్నారు. ఈ విధంగా

దేశమంతటి నుంచీ అత్యుత్తమ పోరాట యోధుల చేరికతో పార్టీ సుసంపన్నమైంది. భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలోనూ ఆ తర్వాత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకత్వంలోనూ జరిగిన స్వాతంత్ర్యోద్యమంతో సన్నిహితంగా సహకరించి పని చేస్తూనే కమ్యూనిస్టు పార్టీ తనను తాను స్వతంత్రమైన కార్మికవర్గ పార్టీగా నిర్మించుకోటానికి, పటిష్టపరచుకోటానికీ నిరంతరం కృషి సాగించింది.

1.7 రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో భారతదేశంలో శక్తివంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ప్రజావెల్లువ పెల్లుబికింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ వెల్లువకు నాయకత్వం వహించడంలో కమ్యూనిస్టు పార్టీ ముందుపీఠిన నిలిచింది. తెభాగా, పున్నప్ర వాయలార్, ఉత్తర మలబారు, వర్లీ ఆదివాసుల పోరాటాలు, త్రిపుర గిరిజనుల పోరాటం, వాటన్నింటికీ మించి చారిత్రాత్మక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం చెప్పుకోదగినవి. అనేక స్వదేశీ సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వాల ఏర్పాటుకై సాగిన ప్రజా ఉద్యమాలలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ పాత్ర నిర్వహించింది. ఫ్రెంచి, పోర్చుగీసు వలస పాలనలో మిగిలిపోయిన పాండిచ్చేరి, గోవాలో విమోచనా పోరాటాలు నిర్మించడంలోనూ, నడిపించడంలోనూ పార్టీ చురుకైన పాత్ర వహించింది. కార్మికులు, కర్షకులు, విద్యార్థుల పోరాట ప్రభంజనాలు, ఐ.ఎస్.ఐ. ఖైదీల విడుదలకై డిమాండూ 1946 నౌకాదళ తిరుగుబాటుతో తారాస్థాయికి చేరాయి. ఫాసిజం ఓడిపోయి, జాతీయ విమోచనోద్యమాలు వెల్లువెత్తుతున్న అంతర్జాతీయ నేపథ్యంలో దేశంలో ఈ ప్రజావెల్లువ తాకిడిని ఎదుర్కోవలసి వచ్చిన బ్రిటిష్ సామ్రాజ్యవాదం, ప్రధాన బూర్జువా పార్టీలైన కాంగ్రెస్, ముస్లింలీగు నాయకులూ రాజీకి వచ్చారు. తత్ఫలితంగా దేశ విభజన జరిగింది. బూర్జువా – భూస్వామ్య వర్గాల నాయకత్వాన రెండు స్వతంత్ర దేశాలుగా భారత్, పాకిస్తాన్ ఉనికిలోకి వచ్చాయి. జాతీయోద్యమం ప్రధానంగా బూర్జువా వర్గ నాయకత్వాన సాగటం ఈ రాజీకి సహాయపడింది. దాంతో ప్రధానంగా విదేశీ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా ఉద్దేశించిన సాధారణ జాతీయ ఐక్యసంఘటన దశ ముగిసింది.

1.8 దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత కూడా కమ్యూనిస్టు పార్టీ నిర్బంధానికి గురికావలసి వచ్చింది. 1948–1952 సంవత్సరాల మధ్య కాలంలో కాంగ్రెస్

పాలకుల క్రూర దాడులు, ప్రత్యేకించి తెలంగాణాలో, ఆ తర్వాత పరంపరగా, ప్రత్యేకించి పశ్చిమ బెంగాల్‌లో నిర్బంధకాండ, ఆ తర్వాత త్రిపురలో అర్ధ-ఫాసిస్టు బీభత్సకాండ, కేరళలోనూ, దేశంలోని విభిన్న ప్రాంతాలలోనూ పార్టీ కార్యకర్తలపై హంతక దాడులు సాగినా విప్లవోద్యమాన్ని ముందుకు గొనిపోకుండా పార్టీని నిలువరించలేకపోయాయి. విచ్ఛిన్నకర వేర్పాటు ఉద్యమాల రూపంలో జాతీయ సమైక్యతకు ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రజల సమైక్యతను పరిరక్షించే పోరాటంలో పార్టీ ముందు పీఠిన నిలిచింది. పంజాబ్, త్రిపుర, అస్సాం, పశ్చిమబెంగాల్, కాశ్మీర్‌లలో వేర్పాటువాద, విచ్ఛిన్నకర శక్తులపై పోరాటంలో ధైర్యశాలులైన వందల కొద్దీ పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలకే త్యాగం చేశారు.

1.9 కమ్యూనిస్టు ఉద్యమం ఆవిర్భావం నుంచీ భారతదేశ రాజకీయాలలో ఈ విధంగా పురోగామి పాత్రను నిర్వహించింది. తన ప్రజాపునాది, ప్రజాదరణ, బూర్జువా - భూస్వామ్య పాలనకు భిన్నమైన తన ప్రత్యామ్నాయ విధానాల కారణంగా, కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయ, సామాజిక జీవనంలో గుర్తింపు కలిగిన శక్తిగా రూపొందింది. 1957లో కేరళలో ఏర్పడిన మొట్టమొదటి కమ్యూనిస్టు మంత్రివర్గం ఆ తర్వాత పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపురలలో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వామపక్షాల నాయకత్వాన వరుసగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజానుకూల విధానాలను అమలు పరచటానికి కృషి చేయడం ద్వారా మార్గం చూపాయి. ఈ ప్రభుత్వాలు ప్రస్తుత వ్యవస్థ పరిధిలోనే భూసంస్కరణలు అమలు జరిపాయి. అధికారాలు వికేంద్రీకరించాయి. పంచాయతీరాజ్ వ్యవస్థకు తిరిగి జవసత్వాలు చేకూర్చాయి. శ్రామిక ప్రజల ప్రజాతంత్ర హక్కులకు హామీనిచ్చాయి. దేశంలో ప్రత్యామ్నాయ విధానాలకై పోరాడుతున్న ప్రజాతంత్ర శక్తులకు బలం చేకూర్చాయి. కఠినమైన పోరాట క్రమంలో పార్టీ గణనీయమైన విజయాలను సాధించింది. తన విజయాలను, వైఫల్యాలను ఆత్మవిమర్శనా పూర్వకంగా విశ్లేషించటానికి అంకితమైన పార్టీగా, తన తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవటానికీ, మార్క్సిజం లెనినిజాన్ని మన సమాజపు నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించే సామర్థ్యాన్ని పెంపొందించు కోవడానికీ పార్టీ నిరంతరం కృషి సాగిస్తుంది.

1.10 రివిజనిజానికి వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటం తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భవించింది. అది 1964లో పార్టీ కార్యక్రమాన్ని

రూపొందించుకుంది. ఈ అవగాహన ప్రాతిపదికపై ఏర్పడిన వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ రివిజనిజం బారి నుంచి, పిడివాదం బారి నుంచి కాపాడుకొంటూ వచ్చింది. ఇరవయ్యో శతాబ్దపు చివరి దశకంలో సోవియట్ యూనియన్‌కూ ఇతర సోషలిస్టు దేశాలకూ, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికీ పెద్ద ఎదురుదెబ్బలు తగిలాయి. దీనివల్ల అంతర్జాతీయ పరిస్థితిని, ఉద్యమ అనుభవాలను పునరంచనా వేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. స్వాతంత్ర్యానంతర అర్ధశతాబ్దికాలంలో భారతదేశంలో ప్రధానమైన మార్పులు, పరిణామాలు సంభవించాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తన కార్యక్రమాన్ని తాజా పరచటం కోసం 1964 తర్వాతసంభవించిన ఈ పరిణామాలనూ, అనుభవాలనూ సమీక్షించింది.

1.11 విప్లవోద్యమ ప్రస్తుత దశలో విప్లవ శక్తులు సాధించవలసిన వ్యూహాత్మక లక్ష్యాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రజల ముందుంచుతోంది. సోషలిస్టు సమాజ గమ్యాన్ని చేరే మార్గంలో ఒక మెట్టుగా జనతా ప్రజాస్వామ్యాన్ని సాధించటం కోసం పాలకవర్గాలకూ వ్యతిరేకంగా, తమ పోరాటంలో కార్మికులకు, కర్షకులకు, కష్టజీవులలోని అన్ని తరగతులకూ ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులకూ మార్గం చూపే కార్యక్రమాన్ని పార్టీ రూపొందించింది.

# 2

# వర్తమాన ప్రపంచంలో సోషలిజం

2.1 ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచంలో అనేక ముఖ్యమైన మార్పులు జరిగాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట శతాబ్దం ఇది. 1917లో అక్టోబర్ సోషలిస్టు విప్లవంతో మొదలుపెట్టి మహత్తర విప్లవ సంఘటనలనేకం ఈ శతాబ్దం చూసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజంపై విజయం ప్రధానమైన ఒక ఘటన. సోవియట్ యూనియన్ అందులో నిర్ణయాత్మక పాత్ర వహించింది. చరిత్రాత్మకమైన చైనా విప్లవం, వియత్నాం, కొరియా, క్యూబాలలో విప్లవ శక్తుల విజయాలు, తూర్పు యూరప్‌లో సోషలిస్టు రాజ్యాలు ఏర్పడటం, సామ్రాజ్యవాదానికి – సోషలిజానికీ మధ్య సాగిన మహాపోరాట పర్యవసానాలే. ఇది వలస దేశాలు రాజకీయ స్వాతంత్ర్యం పొందటానికి దారి తీసిన జాతీయ విమోచనోద్యమాల శతాబ్దం కూడా. మార్క్సిజం– లెనినిజం సిద్ధాంతం అంచనా వేసినట్లుగానే ఈ విజయాలు, ప్రపంచ చరిత్రలో ఒక నూతన శకానికి నాంది పలికాయి. ఈ శతాబ్దపు విప్లవ సంఘటనలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రధాన పరిణామాలు ముందెన్నడూ వూహించని స్థాయిలో మానవాళి పురోగమనానికి బృహత్తరమైన అవకాశాలను ఏర్పరిచాయి.

2.2 సోషలిస్టు వ్యవస్థను చేపట్టిన దేశాలు ఒక నూతన వెలుగుబాటను చూపాయి. సోవియట్ యూనియన్ ఆవిర్భవించటంతో, మానవ చరిత్రలో మొట్టమొదటిసారిగా, కష్టజీవులు వర్గ దోపిడీలేని సమాజంలో జీవించగలిగారు. సత్వర పారిశ్రామికీకరణ, ఫ్యూడల్ అవశేషాల నిర్మూలన, ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో సర్వతో ముఖాభివృద్ధి అశేష జనబాహుళ్యానికి నవజీవనాన్ని

అందించాయి. కష్టజీవులకు అధికారాన్ని సమకూర్చాయి. పేదరికాన్ని, నిరక్షరాస్యతను నిర్మూలించటం; నిరుద్యోగ నిర్మూలన; ఆరోగ్యం, విద్య, గృహవసతి రంగాలలో సామాజిక భద్రతకై విస్తారమైన ఏర్పాట్లు, శాస్త్ర సాంకేతిక రంగాలలో పెద్ద ముందడుగు – ఇవీ సోషలిస్టు దేశాలు సాధించిన అసాధారణ విజయాలు. సాపేక్షంగా వెనుకబడే వున్న, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందని సమాజాలలో ఈ అద్భుత పురోగతి సాధించబడింది. సామాజిక – ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధిగమించుతూ సామ్రాజ్యవాద దురాక్రమణ, విద్రోహ చర్యలు, బెదిరింపులను ఎదుర్కొంటూ క్లిష్టమైన పరిస్థితులలో సోషలిజాన్ని నిర్మించవలసి వచ్చింది. సోవియట్ యూనియన్‌లో సాధించబడిన విజయాల ప్రభావం పెట్టుబడిదారీ దేశాలపైన కూడా పడింది. సంక్షేమ రాజ్యం అనే పేరుతో తమ తమ దేశాల పౌరులకు సామాజిక భద్రతా చర్యలు ప్రవేశపెట్టి విస్తరింప చేయడం పాలకవర్గాలకు తప్పని సరైంది.

2.3 అయితే అదివరకు అనుభవంలేని మార్గంలో సోషలిజాన్ని నిర్మించడంలో సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లోని ఇతర సోషలిస్టు దేశాలూ తీవ్రమైన తప్పిదాలు చేశాయి. సోషలిజం నిర్మాణ దీర్ఘకాలిక స్వభావాన్ని గూర్చి సవ్యమైన అవగాహన లేకపోవడం; పార్టీ పాత్ర రాజ్యాంగ యంత్రం పాత్రను గూర్చి తప్పుడు భావనలు వుండటం; ఆర్థిక వ్యవస్థలోనూ, రాజ్యంలోనూ, సమాజంలోనూ సకాలంలో తగు మార్పులు తీసుకురాలేకపోవటం; పార్టీలోనూ, రాజ్యంలోనూ, సమాజంలోనూ సోషలిస్టు ప్రజాస్వామ్యాన్నిలోతుగా ప్రవేశపెట్టడంలో వైఫల్యం; నిరంకుశాధికార యంత్రాంగం పెరుగుదల; సైద్ధాంతిక చైతన్యం క్షీణించడం వంటి కారణాలవల్ల అలాంటి తప్పిదాలు దొర్లాయి. సోషలిజాన్ని కూలదోయడానికి నిరంతరం ప్రయత్నిస్తున్న సామ్రాజ్యవాదానికి ఇవి దోహదకారులయ్యాయి. విప్లవ సిద్ధాంతం నుంచి, ఆచరణ నుంచి అపమార్గం పట్టిన ఉదాహరణలుగా మాత్రమే అవి వుంటాయి తప్ప ఈ వక్రీకరణలవల్ల మార్క్సిజం–లెనినిజం విలువ కోల్పోదు. సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి, తూర్పు ఐరోపాలో తగిలిన ఎదురు దెబ్బలు ఒక నూతన పరిస్థితిని తెచ్చిపెట్టాయి. ఇరవయ్యో శతాబ్దం చివరిలో ధైర్యం పుంజుకున్న సామ్రాజ్యవాదం నుంచి సోషలిస్టు శక్తులు మరోమారు సవాలును ఎదుర్కొనవలసి వచ్చింది. ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ, కమ్యూనిస్టు ఉద్యమం, విప్లవ శక్తులు తమ తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోగలవని, పునస్సమీకృతం

కాగలవని, సామ్రాజ్యవాదం నుంచి, అభివృద్ధి నిరోధక శక్తుల నుంచీ వచ్చే ఎదురు దాడిని తిప్పికొట్టగలవని కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విశ్వసిస్తోంది.

2.4 ఈ మెలికలు మలుపులు, జయాపజయాలు ఎదురైనప్పటికీ ఇరవయ్యో శతాబ్దంలో ప్రత్యేకించి 1917 నుంచి సంభవించిన పరిణామాలు, మానవ పురోగమన పరిణామ క్రమంపై, సోషలిజం, ప్రజాపోరాటాలూ కలుగజేసిన బలీయమైన ప్రభావాన్నే ప్రతిబింబించుతాయి. విప్లవ పరివర్తనలు చరిత్రలో గుణాత్మకమైన ముందంజలకు దారి తీశాయి. ఆధునిక నాగరికతపై చెరగని ముద్ర వేశాయి. సామాజిక విమోచన, సోషలిస్టు పరివర్తనా క్రమం సుదీర్ఘమైనదిగానూ, సంక్లిష్టమైనదిగానూ వుంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి – సోషలిజానికి పరివర్తన ఒక్క దెబ్బతో జరిగేదికాదని, రాజ్యాధికారం లభించిన తరువాత కూడా దీర్ఘకాలికమైన తీవ్రమైన వర్గపోరాటం జరుగుతుందని చరిత్ర నిరూపించింది.

2.5 మానవాళిని పట్టిపీడించుతున్న మౌలిక సమస్యలను పరిష్కరించడం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ చేతగానిపని, శాస్త్ర, సాంకేతిక విజయాల తోడ్పాటుతో ఉత్పాదక శక్తులు బ్రహ్మాండంగా పెంపొందిన ఫలితంగా పెట్టుబడిదారీ దేశాలలో అభివృద్ధి జరుగుతున్నా ఉపాధి అవకాశాలు పెరగని పరిస్థితి ఏర్పడింది. ఆదాయంలో అంతరాలు తీవ్రతరమవుతున్నాయి. పెరిగిన అదనపు విలువను స్వాహా చేయుటం ద్వారా కార్మికులను దోపిడీ చేయుటం మరింత ఉధృతమవటానికిది దారి తీసింది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంలో సాధించబడిన విజయాలు, సంపద, ఆస్తులూ కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోనూ, బహుళజాతి కంపెనీల వద్దనూ నిరంతరం కేంద్రీకృత మవటానికే ఉపయోగపడుతున్నాయి. సామ్రాజ్యవాదం అంటే భక్షక, విధ్వంసక వ్యవస్థగా నిరూపితమయింది. ఇరవయ్యో శతాబ్దంలో అది మానవాళిని కోట్లాది ప్రాణాలను హరించిన, రెండు అమానుషమైన ప్రపంచ యుద్ధాలలోకి లాగింది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో ఆయుధాల పరిశ్రమ అంతర్భాగంగా తయారైంది. మొత్తం గిరాకీని నిలబెట్టి వుంచటానికది ఉపయోగపడుతుంది. ప్రభుత్వ పాత్ర తగ్గించాలనే నయా ఉదారవాద విధానాలవల్ల కార్మిక వర్గానికీ, సాధారణ పౌరులకూ వుద్దేశించిన సామాజిక భద్రతలోనూ సంక్షేమ చర్యలలోనూ అనాగరికమైన కోత విధించటం జరుగుతోంది. ఉపాధి రహిత అభివృద్ధి, క్యాజువల్ కార్మికుల పెరుగుదల, ఆదాయాలలోనూ, సంపదలోనూ అంతరాలు పెరగటం దాని విస్పష్ట

లక్షణాలు. ద్రవ్య వ్యవస్థలో ఒడిదుడుకులూ; అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మాంద్యం, అభివృద్ధి రేటు తగ్గడం; వనరుల వినియోగం రానురాను మరింత హేతువిరుద్ధంగా మారడం, వృధా ఎక్కువ కావడం – ఇవన్నీ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గతంగా నెలకొన్న సంక్షోభ లక్షణాలే. అధిక లాభాల కోసం బహుళజాతి కంపెనీల వెంపర్లాట, సంపన్న దేశాలలో మితిమీరిన వినియోగం వాతావరణాన్ని ధ్వంసం చేశాయి. మొత్తం ప్రపంచ పర్యావరణానికి ముఖ్యంగా వర్ధమాన దేశాల పర్యావరణానికి తీవ్ర ప్రమాదం తెచ్చిపెట్టాయి. పెట్టుబడిదారీ విధానంలో – అంతకంతకూ సామాజికమవుతున్న ఉత్పత్తికీ, అంతకంతకూ ప్రయివేటు పరమవుతున్న మిగులుకూ మధ్యనున్న – మౌలికమైన అంతర్గత వైరుధ్యం తీవ్ర రూపం దాల్చింది.

2.6 పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ప్రస్తుత దశలో, ఫైనాన్సు పెట్టుబడి కేంద్రీకరణ, అంతర్జాతీయీకరణ ముందెన్నడూ ఎరుగని ఉచ్ఛస్థాయికి చేరుకున్నాయి. ప్రపంచమంతా సంచరించుతుంటే ఫైనాన్సు పెట్టుబడి, అసాధారణ లాభాల వేటలో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలలో నిరాఘాటమైన ప్రవేశం పొందగోరుతోంది. దానికోసం ఆ దేశాల సార్వభౌమాధికారం పైనే దాడి చేస్తున్నది. ఈ స్పెక్యులేటివ్ ఫైనాన్స్ పెట్టుబడి సేవలో సామ్రాజ్యవాద వ్యవస్థ – దాని స్వేచ్ఛా ప్రయాణానికి ఉన్న ఆటంకాలన్నింటినీ తొలగిస్తోంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోనూ అటువంటి పెట్టుబడికి అనుకూలమైన షరతులు విధిస్తోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థ – ఇవన్నీ కూడా ఈ అన్యాయమైన వలసానంతర ప్రపంచ వ్యవస్థను స్థిరీకరించటానికి ఉద్దేశించబడిన సాధనాలే. స్పెక్యులేటివ్ ఫైనాన్స్ పెట్టుబడి కొత్తగా సంతరించుకున్న ఆధిక్యత కారణంగా, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో అభివృద్ధి మందగించుతోంది. ఇందువల్ల తృతీయ ప్రపంచ దేశాలు తీవ్ర దోపిడీకి, అప్పుల విషవలయానికి గురవుతాయి. అంతగా అభివృద్ధి చెందని పెట్టుబడిదారీ దేశాలలో వాణిజ్య షరతులు, పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పాదన, సాంకేతిక విజ్ఞాన ప్రవేశం, సేవారంగం – అన్నీ కూడా సామ్రాజ్యవాద పెట్టుబడికి అనుకూలంగా వుండే విధంగా ఆయా దేశాలపై వత్తిడి సాగుతోంది. సామ్రాజ్యవాద వ్యవస్థ ప్రపంచాన్ని రెండుగా విభజించింది. సంపన్నమైన, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఒక వైపున, అశేష జనావళి జీవించే వర్ధమాన దేశాలు ఇంకోవైపున; ధనిక

దేశాలకు – పేద దేశాలకు మధ్య అంతరం ఇరవయ్యో శతాబ్దపు చివరి రెండు దశకాలలో బాగా పెరిగింది. సామ్రాజ్య వాద చోదిత ప్రపంచీకరణ మొదలవటంతో ఆ అంతరం మరింత తీవ్రమైంది.

2.7 పాత తరహా వలసాధిపత్యం అంతమైనప్పటి నుంచి నయావలస వ్యూహాన్ని అనుసరించుతూ వస్తున్న సామ్రాజ్యవాదం, సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి అనంతరం ప్రపంచంపై ఆధిపత్యానికై తన ప్రయత్నాలను ఉధృతం చేసింది. అమెరికా సామ్రాజ్యవాదం ఆధిపత్యాన్ని ఏర్పరచుకొనేందుకుగాను తన ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తిని దూకుడుగా ప్రయోగించుతోంది. నాటోకూటమిని విస్తరించటం, ప్రపంచమంతటా సైనిక జోక్యం చేసుకోవడం ద్వారా సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని బలవంతంగా రుద్ధి, తద్వారా సామ్రాజ్యవాద చోదిత ప్రపంచీకరణ వూతమిచ్చే ప్రయత్నం జరుగుతోంది. సోషలిస్టు దేశాలైన చైనా, వియత్నాం, క్యూబా, కొరియా, లావోస్‌లు ప్రపంచ శక్తుల బలాబలాల్లో వచ్చిన మార్పువల్ల ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటూనే సోషలిజం ఆశయానికి దృఢంగా కట్టుబడి వున్నాయి. ఇప్పటికీ నిలిచివున్న సోషలిస్టు దేశాలను కూలదోయటానికి సామ్రాజ్యవాదం చురుకుగా ప్రయత్నిస్తోంది. సైద్ధాంతిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వాటిపై నిరంతర యుద్ధం సాగిస్తోంది. ప్రపంచ కమ్యూనికేషన్ వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మక మార్పును ఉపయోగపెట్టుకుని, అంతర్జాతీయ మీడియాపై తనకు గల పట్టుతో పెట్టుబడిదారీ వ్యతిరేక భావాలనూ, సోషలిజాన్నీ అపఖ్యాతిపాలు చేయటానికీ, అణచివేయటానికీ సామ్రాజ్యవాదం దూకుడుగా ప్రయత్నాలు సాగించుతోంది.

2.8 ఇరవయ్యో శతాబ్దం చివరి నాటికి అంతర్జాతీయ శక్తుల బలాబలాల పొందిక సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారింది. పెట్టుబడిదారీ వ్యవస్థ నూతన శాస్త్ర, సాంకేతిక విజయాలను వుపయోగపెట్టుకుంటూ, ఉత్పాదక శక్తులను పెంపొందించటం కొనసాగుతూనే వుంది. అయినప్పటికీ అది పీడనతో, దోపిడీతో కూడిన అన్యాయమైన వ్యవస్థగానే కాకుండా సంక్షోభ భరితమైన వ్యవస్థగా వుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయమైన ఏకైక వ్యవస్థ సోషలిజమే. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థకు – సోషలిజానికి మధ్యనగల వైరుధ్యమే ఈ యుగపు కేంద్ర సామాజిక వైరుధ్యంగా వుంది. ప్రపంచం మీద నయా – సరళీకరణ దాడి కారణంగా, సామ్రాజ్యవాద దేశాలకు – తృతీయ ప్రపంచ దేశాలకు మధ్యన

వైరుధ్యం శీఘ్రగతిన తీవ్రతరమవుతోంది. అది ముందుకు వస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలో అసమానతలున్నందువల్ల, సామ్రాజ్యవాద దేశాల మధ్య, వైరుధ్యాలు కొనసాగుతాయి. పైన పేర్కొన్న విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న లక్షణాలను బట్టి, శ్రమకు – పెట్టుబడికి మధ్య వైరుధ్యం తీవ్రం అవుతోంది. ఈ వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతూ ప్రపంచ పరిణామాలను ప్రభావితం చేస్తున్నాయి.

2.9 సామ్రాజ్యవాదానికి దాని దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్విరామ పోరాటం సాగించటం కోసం, కార్మిక వర్గం, కార్మికవర్గ పార్టీలు సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ విషయాలలో సమాయత్తం కావలసి వుంది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికీ, అన్యాయమైన ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను పెంచి పోషించుతూ, స్థిరంగా నిలబెట్టగోరుతున్న పాలకవర్గాలను ఓడించటానికీ, ప్రపంచమంతటాగల వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తుల ఐక్యతను సాధించి తీరాలి. శ్రామికవర్గ అంతర్జాతీయత ప్రాతిపదికగాగల పార్టీగా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడటానికి అంకితమై వుంది. సామ్రాజ్యవాద చోదిత ప్రపంచీకరణ వ్యవస్థకు వ్యతిరేకంగానూ, శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసమూ పోరాడుతున్న శక్తులు ప్రపంచంలో ఎక్కడెక్కడ వున్నా వారందరితోనూ సంఘీభావం ప్రకటించుతుంది.

# 3

# స్వాతంత్ర్యం - ఆ తర్వాత

3.1 భారత ప్రజలలో విస్తార జనసామాన్యం స్వాతంత్ర్యపోరాటంలో ఉత్సాహంగా పాల్గొని దాన్ని విజయవంతం చేశారు. వారు దేశభక్తి ప్రేరితులైనవారు. స్వతంత్ర భారతావనినీ, ప్రజలకు నవజీవనాన్నీ కాంక్షించారు. పేదరికం, దోపిడీతో కూడిన దుర్భర పరిస్థితులు తొలగిపోతాయని వారు ఆశించారు. వారి దృష్టిలో స్వాతంత్ర్యం అంటే భూమి, తిండి, న్యాయమైన వేతనాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి లభించడమే. స్వాతంత్ర్యం అంటే కులతత్వం, మతవిద్వేషం వంటి సామాజిక రుగ్మతల నుంచి విమోచన, ప్రజాతంత్ర పద్ధతిలో ప్రజల సాంస్కృతిక అవసరాలు నెరవేరటమే.

3.2 కార్మికవర్గం, రైతాంగం, మధ్యతరగతి వర్గాలు, మేధావులు,మహిళలు, విద్యార్థులు యువజనులు పెద్దఎత్తున పాల్గొనబట్టే, స్వాతంత్ర్యం కోసం సాగిన జాతీయోద్యమం విజయవంతమైంది. అయితే నాయకత్వం మాత్రం బూర్జువా వర్గం చేతుల్లోనే వుండిపోయింది. నూతన రాజ్యానికి ఆధిపత్యం వహించిన బడా బూర్జువా వర్గం. ప్రజాతంత్ర విప్లవ మౌలిక కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి నిరాకరించింది. ఉత్పాదక శక్తులపైగల బంధనాలను బద్దలు కొట్టటమే భారతీయ సమాజ పునరుజ్జీవానికి మార్గం. పరాన్నభుక్తమైన భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలి. వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకూ భూమి పంపిణీ చేయాలి. మన పారిశ్రామిక రంగం విదేశీ పెట్టుబడి ఆధిపత్యానికి గురికాకుండా స్వతంత్రంగా అభివృద్ధి చెందివుంటే - మన దేశం స్వావలంబనతో కూడిన, అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశంగా

ఎదగడానికి ప్రాతిపదిక ఏర్పడి వుండేది. ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను సమగ్రంగా అమలు జరిపేట్లయితే సంభవించగల పర్యవసానాలపట్ల భయంతోనే, బడా బూర్జువా వర్గం భూస్వాములతో మైత్రి ఏర్పరచుకొని, సామ్రాజ్యవాదంతో రాజీ పడింది. కాంగ్రెస్ పాలకుల విధానాలు ఈ బూర్జువా – భూస్వామ్య సంఘటననే ప్రతిబింబించాయి. పాలకవర్గాల ఈ స్వభావాన్ని బట్టే తర్వాతి దశాబ్దాలలో పెట్టుబడిదారీ పంథా స్వభావమూ నిర్ధారితమయింది.

3.3 దేశ సమగ్ర అభివృద్ధికి ఆవశ్యకమైన సహజ వనరులు భారతదేశంలో పుష్కలంగా వున్నాయి. సాగుకు లాయకయిన భూమి, నీటి పారుదల అవకాశాలకు కొదువ లేదు. దేశంలోని వివిధ ప్రాంతాలలో బహువిధాలైన పంటలకు అనువయిన పరిస్థితులున్నాయి. ఖనిజ సంపద పుష్కలం. విద్యుచ్ఛక్తి ఉత్పాదన అవకాశాలు అపారంగా వున్నాయి. భారత దేశానికి గల అశేషమైన మానవశక్తిబలం, భారత ప్రజల సాంకేతిక, యాజమాన్య, మేధోపరమైన నైపుణ్యం – అన్నీ కలిసి మహాశక్తి సామర్థ్యాల నిలయం అవుతాయి. ఈ శక్తి సామర్థ్యాలను అభివృద్ధి పరచటానికి బదులు రాజ్యాధికారాన్ని చేపట్టిన బడా బూర్జువా వర్గం, తన సంకుచిత ప్రయోజనాలు నెరవేరటానికి అనువైన పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని చేపట్టింది.

3.4 స్వాతంత్ర్యానంతరం బూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతో ఒక వైపున ఘర్షణ పడుతూ, మరోవైపున మిలాఖత్ అవుతూ తన ద్వంద్వ స్వభావాన్ని ప్రదర్శించుకుంది. రాజ్యాధిపత్యం చేపట్టిన బడా బూర్జువా వర్గం ఒక ప్రత్యేక తరహా పెట్టుబడిదారీ అభివృద్ధిని చేపట్టింది. అది సామ్రాజ్యవాదంతో రాజీపడి భూస్వామ్య విధానంతో తన మైత్రిని కొనసాగించుతోంది. అది – ఒక వైపున ప్రజలపై దాడి చేయడం ద్వారా, మరోవైపున సామ్రాజ్యవాదంతోనూ, భూస్వామ్య విధానంతోనూ తనకుగల ఘర్షణలనూ, వైరుధ్యాలనూ ఒత్తిళ్ళు, బేరసారాలు, రాజీలతో పరిష్కరించుకోవడం ద్వారా – తన స్థితిని పటిష్టపరుచుకోవడానికి రాజ్యాంగ యంత్రంపై తనకున్న పట్టును ఉపయోగించుకుంది. ఈ క్రమంలో అది, విదేశీ గుత్త పెట్టుబడిదారులతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకుంది. భూస్వాములతో కలిసి అధికారంలో పాలుపంచుకుంటోంది. సరళీకరణ విధానాలతో, విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి మన ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరవాలనీ, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడులతో బలీయమైన లింకులు ఏర్పరచుకోవాలనీ గట్టిగా కోరుకుంటున్నది. బడా బూర్జువా వర్గమే.

ప్రభుత్వరంగాన్నీ, మొత్తంగా ఆర్థిక వ్యవస్థనంతటినీ ప్రైవేటీకరించాలన్న డిమాండు వెనుకగల ప్రధాన శక్తి కూడా ఈ వర్గమే.

3.5 స్వాతంత్ర్యం వచ్చిన తొలి సంవత్సరాలలో, పాశ్చాత్య దేశాల నుంచి తగిన సహకారం పొందలేకపోయిన పరిస్థితులలో, భారతదేశ బూర్జువా వర్గం సహాయం కోసం సోవియట్ యూనియన్ వైపుకు తిరిగింది. వారు, ప్రభుత్వ ప్రాయోజిత పెట్టుబడిదారీ వ్యవస్థ అనే ఒక రకమైన పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించే పంథాను చేపట్టారు. సామ్రాజ్యవాద కూటమి, సోషలిస్టు శిబిరమూ రెండూ వుండటాన్ని, తమ స్థానాన్ని పటిష్ట మొనరించుకోవటానికి దోహదపడే బేరసారాల కోసం ఉపయోగ పెట్టుకోనారంభించారు. పెట్టుబడిదారీ పంథాలో భాగంగానే ఆర్థిక ప్రణాళికా విధానాన్ని చేపట్టారు. బడ్జెట్ సంబంధమైన, సాధారణ ఆర్థిక సంబంధమైన విధానాలను ప్రధానంగా బహుకొద్దిమందిగా వుండే దోపిడీ వర్గాలకు మేలు చేసేవిగానే రూపొందించారు. భారీ పరిశ్రమల రంగంలోనూ, మౌలిక సదుపాయాల రంగంలోనూ ప్రభుత్వరంగాన్ని అభివృద్ధి పరచారు. అంతటి భారీ ప్రాజెక్టులకు అవసరమైన వనరులను సమకూర్చగల స్థితిలో ప్రైవేట్ రంగం లేకపోవటమే అందుకు కారణం. ఆర్థిక వ్యవస్థను కొంతమేరకు పారిశ్రామికీకరించటానికీ, సామ్రాజ్యవాద గుత్తసంస్థలపైనే పూర్తిగా ఆధారపడి వుండే పరిస్థితిని అధిగమించటానికీ – ఈ ప్రభుత్వరంగ సంస్థల నిర్మాణం కొంత వరకు దోహదపడింది.

3.6 భారతదేశంలాంటి అభివృద్ధి చెందని దేశంలో బూర్జువా వర్గం చేతుల్లో వున్న రాజ్యాధికారం అండతో సాగే ఆర్థిక ప్రణాళికా విధానం, దేశంలోగల వనరులన్నింటినీ మరింత ప్రయోజనకరంగా వినియోగించుకోవటానికి వీలు కల్పించడం ద్వారా, ప్రభుత్వ విధానపరిమితులలోనే పెట్టుబడిదారీ ఆర్థికాభివృద్ధికి నిశ్చితమైన ఊపునూ, దిశనూ కల్పించింది. ఈ ప్రణాళికల ఫలితంగానే ప్రభుత్వ/ ప్రభుత్వరంగంలో పారిశ్రామిక విస్తరణనూ, ముఖ్యంగా కొన్ని భారీ పరిశ్రమలనూ, యంత్రనిర్మాణ పరిశ్రమల ఏర్పాటును మనం చూస్తాం. సోషలిస్టు దేశాల నుంచి, ప్రధానంగా సోవియట్ యూనియన్ నుంచి నికరమైన అండదండలు లభించటంవల్లనే ఈ విజయాలు సాధ్యమైనాయి. బ్యాంకులు, బీమా వంటి ఆర్థిక సంస్థలనూ, చమురు, బొగ్గు పరిశ్రమలనూ జాతీయం చేయటం ద్వారా ప్రభుత్వ రంగ విస్తరణ జరిగింది.

3.7 పారిశ్రామికీకరణ కోసం, అర్థమనస్కంగానే అయినా విధానపరమైన మరికొన్ని చర్యలు కూడా చేపట్టబడినాయి. పరిశోధన – అభివృద్ధికి ప్రాధాన్యత, కొత్త పేటెంట్స్ చట్టం తీసుకురావటం, మన మార్కెట్‌లోకి విదేశీ ఉత్పత్తుల, విదేశీ పెట్టుబడుల ప్రవేశాన్ని క్రమబద్ధం చేయడం, చిన్న తరహా పరిశ్రమలకు రక్షణ కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వటం జరిగింది. భారతదేశంలో నెలకొని వున్న పరిస్థితులలో ఈ చర్యలన్నీ కూడా, ఆర్థిక వెనుకబాటుతనాన్నీ, సామ్రాజ్యవాద రాజ్యాలపైనే పూర్తిగా ఆధారపడటాన్నీ కొంత మేరకయినా అధిగమించటానికీ, పారిశ్రామికీకరణకు అవసరమైన సాంకేతిక పునాదిని ఏర్పరచటానికీ దోహదపడ్డాయి.

3.8 వరుసగా అధికారం చేపట్టిన ప్రభుత్వాలు అనుసరించిన విధానాల పర్యవసానంగా ఒకవైపు ప్రభుత్వరంగం అభివృద్ధికావడం, ప్రణాళికా విధానం ద్వారా ప్రభుత్వ జోక్యం పెరగడంతోబాటు మరోవైపు సంపద కేంద్రీకరణ పెరిగింది. గుత్త సంస్థలు శీఘ్రగతిన పెరిగాయి. బడా బూర్జువా నాయకత్వంలో ప్రభుత్వరంగమే పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించే సాధనమైంది. ప్రభుత్వ ఆర్థిక సంస్థల నుంచి లభించే రుణసదుపాయంలో అత్యధిక భాగం బడా బూర్జువా వర్గానికే దక్కింది. అధికారంలో వున్న ప్రభుత్వాల బడ్జెట్ సంబంధ విధానాలూ, పన్ను విధింపు విధానాలూ ప్రజల నుంచి వనరులను అతి తక్కువ సంఖ్యలోగల బూర్జువా – భూస్వామ్య వర్గాలకు బదలాయించే విధంగా రూపొందించబడినాయి. పెద్ద ఎత్తున పన్నుల ఎగవేతవల్ల భారీ స్థాయిలో నల్లడబ్బు గుట్టలు పడింది. ప్రైవేట్ పెట్టుబడులు కూడటానికి అదొక మార్గమయింది. పెట్టుబడిదారీ అభివృద్ధి సాధనకై ప్రణాళికలకు ఆర్థిక వనరులు సమకూర్చడం పేరుతో సామాన్య ప్రజలను, కార్మికులను, కర్షకులను, మధ్యతరగతులను నిర్దాక్షిణ్యంగా దోపిడీకి గురి చేశారు. మౌలికమైన భూసంస్కరణలు చేపట్టకపోవడంతో, దేశీయ మార్కెట్ పరిమితంగా ఉండిపోయింది. విదేశీ పెట్టుబడిపై ఆధారపడకుండా దేశీయ పరిశ్రమలు పెరగటంగాని, విస్తరించడంగాని సాధ్యపడలేదు. స్వదేశంలో, విదేశాల నుంచీ భారీగా అప్పులు చేసి, ఈ తరహా ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆర్థిక వనరులు సమకూర్చబడ్డాయి. గుత్త పెట్టుబడిదారీ సంస్థలు పెంపొందటం, విదేశీ ఫైనాన్స్ పెట్టుబడి అంతకంతకూ ఎక్కువగా చొచ్చుకురావడం ఈ పంథా ప్రధాన లక్షణంగా తయారయింది.

3.9 యాభయ్యవ దశకం నుంచీ పాలకవర్గాలు అనుసరించిన ఈ తరహా పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా సంక్షోభంలో పడటం తప్పనిసరి. అది ప్రతిష్టంభనకు గురయింది. బడా బూర్జువా వర్గం భూస్వామ్య విధానంతో రాజీపడటంవల్ల రైతాంగం యొక్క కొనుగోలు శక్తి తగినంతగా పెరగలేదు. అందువల్ల దేశంలో మార్కెట్ విస్తరించలేదు. పారిశ్రామికీకరణకు అవసరమైన నిధుల కోసం, ప్రభుత్వ ఖర్చుల కోసం, విదేశాల నుంచీ, దేశంలోపలా అప్పులు చేయడంపైనే ఆధారపడటం ఎక్కువయింది. ఫలితంగా విదేశీ చెల్లింపులలోనూ, ద్రవ్యలోటు విషయంలోనూ తీవ్రమైన సంక్షోభం ఏర్పడింది. ఈ ఆర్థిక సంక్షోభం తుదకు, కాంగ్రెస్ ప్రభుత్వం ఐ.ఎం.ఎఫ్ – ప్రపంచ బ్యాంక్ షరతులను ఆమోదించేందుకు దారి తీసింది. విదేశీ ఫైనాన్స్ పెట్టుబడితో మరింత అధికంగా మిలాఖత్ అవడం, మన ఆర్థిక వ్యవస్థ ద్వారాలు బార్లా తెరవడం ద్వారా ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలని భారత బడా బూర్జువా వర్గం ప్రయత్నిస్తోంది.

3.10 బడా బూర్జువా వర్గం, గతంలో తన పెట్టుబడి పునాది బలహీనంగా వున్న పరిస్థితులలో, పెట్టుబడిదారీ అభివృద్ధి నిమిత్తం మౌలిక ప్రాతిపదికను ఏర్పరచడానికి ప్రభుత్వ జోక్యాన్ని కోరుకున్నది. అయితే ఆ తర్వాత దశాబ్దాలలో ప్రభుత్వ సహాయంతో పొందిన అభివృద్ధి ద్వారానూ, సబ్సిడీల ద్వారానూ తగినంత పెట్టుబడిని ప్రోది చేసుకొని బలపడింది. ఎనభయ్యో దశకం చివరికొచ్చేసరికల్లా అంతకుముందంతా ప్రభుత్వరంగానికే రిజర్వు చేయబడిన కీలకరంగంలోనికి ప్రవేశించడానికీ, ప్రభుత్వరంగాన్ని హస్తగతం చేసుకోవటానికీ, విదేశీ పెట్టుబడితో మిలాఖత్తయి కొత్త పరిధిలోకి విస్తరించటానికీ సిద్ధమయింది. దీనికి ప్రభుత్వం చేపట్టిన పెట్టుబడిదారీ విధానంలో ఏర్పడిన సంక్షోభం తోడై దేశంలోపల సరళీకరణకు ప్రాతిపదిక అయింది. దేశం వెలుపల సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి, ఇక్కడి విధానాలలో మార్పునూ, ఐ.ఎం.ఎఫ్. ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకు తలొగ్గే స్థితినీ వేగిరపరిచింది.

3.11 ఆర్థిక వ్యవస్థ ద్వారాలు బార్లా తెరవాలనీ, సరళీకరించాలనీ ఒత్తిడి పెరిగిన మీదట, 80వ దశకం మధ్యలో, రాజీవ్‌గాంధీ హయాంలో ఆర్థిక విధానాలలో మార్పు వచ్చింది. దిగుమతుల సరళీకరణ, స్వల్పకాలిక అప్పులు అధికమవటం ద్రవ్యలోటు భారీగా పెరగటానికి దారితీశాయి. అంతర్జాతీయ రంగంలో వచ్చిన మార్పు దీనికి తోడయింది. వ్యవస్థాగత సర్దుబాటు రుణం పొందటం కోసం

1991లో కాంగ్రెస్ ప్రభుత్వం ఐ.ఎం.ఎఫ్. ప్రపంచ బ్యాంక్ షరతులను ఆమోదించే పరిస్థితికి దారి తీసింది. బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ సరళీకరణ విధానాలను మరింత ముందుకు నెట్టింది. ఒక ప్రభుత్వం తర్వాత మరొకటి 1991 నుంచీ అనుసరించుతున్న సరళీకరణ, వ్యవస్థాగత సర్దుబాటు విధానాలు విదేశీ పెట్టుబడి ప్రవేశానికై ఆర్థిక వ్యవస్థ ద్వారాలు బార్లా తెరవటానికీ, ప్రభుత్వరంగాన్ని రద్దు చేసే క్రమానికీ, దిగుమతుల సరళీకరణకూ దారితీశాయి. ఇంత కాలంగా ప్రభుత్వ రంగానికి రిజర్వు చేయబడి వున్న కార్యకలాపాలలోకి కూడా, విదేశీ పెట్టుబడి, భారతీయ గుత్త పెట్టుబడులూ ప్రవేశించబడానికి ద్వారాలు తెరవబడినాయి. ప్రభుత్వరంగాన్ని రద్దు చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించడం, ప్రైవేటు గుత్త పెట్టుబడిదారీ సంస్థలను చౌకగా అమ్మడం జరుగుతున్నది. దిగుమతి సుంకాల తగ్గింపువల్ల విదేశీ వస్తువులు వచ్చి పడి, దేశీయ ఉత్పత్తుల స్థానమాక్రమించాయి. దానితో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు మూతబడ్డాయి. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధుల్లోపడ్డారు. ఆర్థికరంగంలో ప్రవేశానికి ద్వారాలు తెరవవలసిందిగా అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి నుంచి అదేపనిగా ఒత్తిడి వచ్చింది. బ్యాంకింగ్ పరిశ్రమలో ప్రయివేటీకరణ క్రమానికి, భీమారంగం ద్వారాలు తెరవటానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. 1994 గాట్ ఒప్పందంపై సంతకం చేయడంవల్ల భారతదేశం డబ్ల్యు.టి.ఓ. నియమాలను ఆమోదించవలసి వచ్చింది. పేటెంట్ల చట్టంలో మార్పులు, సేవారంగపు ద్వారాలు తెరవడం సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రయోజనాలకు సేవచేస్తాయి. ఈ పరిణామాలన్నీ ఆర్థిక సార్వభౌమత్వం దెబ్బతినడానికి దారితీశాయి.

3.12 సరళీకరణ, ప్రైవేటీకరణ పంథావల్ల బడా బూర్జువా వర్గం అపారంగా లాభపడింది. కొత్త వాణిజ్య సంస్థల ప్రవేశంతో ఆ వర్గపు శ్రేణులు విస్తరించాయి. 1957లో రు.312.63 కోట్ల మేరకు ఆస్తులు కలిగిన 22 గుత్త కంపెనీలు 1997 నాటికి తమ ఆస్తులను రు.1,58,004.72 కోట్లకు పెంచుకోగలిగాయి. అంటే అయిదు వందల రెట్లు పెరిగాయన్నమాట. సరళీకరణ కింద, బడా వాణిజ్య సంస్థలకు, సంపన్న వర్గాలకు ఆదాయపు పన్ను తగ్గింపు, సంపద పన్నువంటి ఇతర పన్నుల రద్దు ద్వారా పెద్దఎత్తున రాయితీలు ఇవ్వబడినాయి. ఇలాంటి విధానాలు సంపన్న వర్గాలను మరెంతో సంపన్నులయ్యేట్లు చేశాయి. వారి వినియోగానికి కావలసిన విలాస వస్తువుల మార్కెట్ విస్తరించింది.

ఈ డిమాండ్‌ను అందుకునేందుకై విదేశీ పెట్టుబడితో మిలాఖత్ ఒప్పందాలు కుదుర్చుకుని దేశంలోనే ఆయా వస్తువులను ఉత్పత్తి చేయడమో, దిగుమతి చేసుకోవటమో జరుగుతోంది. విచక్షణా రహితంగా విదేశీ పెట్టుబడి ప్రవేశంవల్ల, దేశీయ పరిశ్రమలలోకి కీలక రంగాలకు దెబ్బ తగులుతోంది. బహుళజాతి కంపెనీలు, భారతీయ కంపెనీలను కొనివేస్తున్నాయి. బడాయేతర బూర్జువా వర్గానికి చెందిన కొన్ని సెక్షన్లు విదేశీ పెట్టుబడితో మిలాఖత్ ఒప్పందాలకు సుముఖంగా వున్నట్లు కనిపించుతున్నప్పటికీ, మధ్యతరహా, చిన్నతరహా పెట్టుబడిదారులలో పెద్ద సెక్షన్లు సరళీకరణవల్ల దారుణంగా దెబ్బతిన్నాయి.

3.13 సరళీకరణ కాలంలో, విదేశీ అప్పులూ, దేశీయ అప్పులూ పెరిగాయి. రెవెన్యూ వ్యయంలో ప్రధాన భాగం, వడ్డీల చెల్లింపునకే ఖర్చవుతోంది. ప్రభుత్వ పెట్టుబడులు, వ్యయమూ తగ్గిపోతున్నాయి. దానితో అభివృద్ధి కార్యక్రమాలు, పేదరిక నిర్మూలన పథకాలూ దెబ్బతింటున్నాయి. సరళీకరణ వల్ల, సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలు బాగా పెరిగాయి. అధికార లెక్కల ప్రకారమే చూసినా, దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారి సంఖ్య, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థలో కోత విధింపు నేపథ్యంలో నిత్యజీవితావసర వస్తువుల ధరలు, ప్రత్యేకించి ఆహార పదార్థాల ధరలు అదే పనిగా పెరుగు తుండటంవల్ల పేద ప్రజలకు గట్టి దెబ్బ తగిలింది. సామాజిక రంగాలైన విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల వ్యయంలో కోత కష్టజీవులను దారుణంగా దెబ్బతీస్తున్నది.

3.14 పెట్టుబడిదారులూ, ప్రభుత్వమూ విధించిన అధిక భారాలు కార్మికవర్గాన్ని దెబ్బగొడుతున్నాయి. ధరలు అదే పనిగా పెరుగుతుండటంవల్ల కార్మికుల నిజవేతనాలు పెరగడంలేదు. పారిశ్రామిక రంగంలో సంక్షోభం విడవకుండా కొనసాగుతోంది. దానితో కార్మికులు పరిశ్రమల మూసివేతలనూ, రిట్రెంచిమెంట్లనూ ఎదుర్కోవలసి వస్తున్నది. కార్మికుల హక్కులకు రక్షణ కల్పించుతాయన్న కార్మిక శాసనాలు లోపభూయిష్టంగా వున్నాయి. అవైనా అమలు జరగడంలేదు. యజమానులు వాటిని ఉల్లంఘించడం సర్వసాధారణం. రహస్య బ్యాలెట్ ద్వారా కార్మిక సంఘాల గుర్తింపు, సమష్టిగా బేరసారాల హక్కు నిరాకరించబడుతున్నాయి. సరళీకరణ, ప్రైవేటీకరణల తాకిడితో లక్షలాది కార్మికులు నిరుద్యోగులవుతున్నారు. వారిని ఆదుకోవడానికి ఎలాంటి సామాజిక భద్రతాలేదు. సరళీకరణ విధానంలో భాగంగా లేబర్ మార్కెట్‌లో ఎలాంటి

నియమనిబంధనలూ లేకుండా చేయాలని డిమాండ్ చేయడం జరుగుతోంది. దీర్ఘకాల ఉద్యమాల ద్వారా కార్మికులు సాధించుకున్న ప్రయోజనాలు, హక్కులను కాలరాయడానికి ప్రయత్నం జరుగుతోంది. పర్మినెంట్ ఉద్యోగులను, కాంట్రాక్టు ఉద్యోగులుగానో, తాత్కాలిక ఉద్యోగులుగానో మార్చడం జరుగుతోంది. శ్రామిక మహిళలకు తక్కువ వేతనాలు చెల్లించబడుతున్నాయి. రిట్రెంచిమెంటులో ముందుగా వేటుపడేది వారిపైనే. బాల కార్మికులు పెరిగిపోతున్నారు. వారు దారుణమైన రూపాలలో దోపిడీకి గురవుతున్నారు. సంఘటితరంగానికి వెలుపలగల లక్షలాది కార్మికులకు ఎలాంటి కార్మిక శాసనాలవల్లనూ రక్షణ లభించడంలేదు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలు సయితం వారికి వర్తించవు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న అసంఖ్యాక స్త్రీ, పురుష కార్మికుల పరిస్థితి దుర్భరం. నామమాత్రపు వేతనాలతో, ఎక్కువ పనిగంటలతో, తరచూ హానికరమైన పరిస్థితులలో, ఏ విధమైన సామాజిక భద్రతా లేకుండా మగ్గుతున్నారు. డబ్బు చెల్లించకుండా ఉపయోగపెట్టుకునే మానవ శ్రమ, కార్మికవర్గాన్ని దోపిడీ చేయడం కారణంగానే బూర్జువా వర్గానికీ, బడా కాంట్రాక్టర్లకూ, బహుళజాతి కంపెనీలకు లాభాలు దక్కుతున్నాయి.

3.15 వ్యవసాయ సమస్యయే భారత ప్రజల ముందు అత్యంత ప్రధానమైన జాతీయ సమస్యగా కొనసాగుతోంది. భూస్వామ్య విధానాన్ని, వడ్డీ వ్యాపారులు, వర్తకుల దోపిడీని, గ్రామీణ ప్రాంతాలలో కులపీడననూ, లైంగిక వివక్షను నిర్మూలించడం లక్ష్యంగా వుండే సమూలమైన, సమగ్రమైన భూసంస్కరణలతో కూడిన విప్లవాత్మకమైన మార్పే ఈ సమస్యకు పరిష్కారం. ప్రగతిశీలమైన, ప్రజాతంత్ర పద్ధతిలో వ్యవసాయక సమస్యను పరిష్కరించడం మాటెలా వున్నా, కనీసం ఆ సమస్యను పట్టించుకోవడంలో వైఫల్యమే భారతదేశంలో, బూర్జువా - భూస్వామ్యపాలన దివాళాకోరుతనాన్ని అన్నిటికంటే విస్పష్టంగా చూపుతోంది.

3.16 స్వాతంత్ర్యం అనంతరం, కాంగ్రెస్ పాలకులు భూస్వామ్య విధానాన్ని రద్దు చేయడానికి మారుగా, అర్థ-ఫ్యూడల్ భూస్వాములను, పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్చటానికీ, ధనిక రైతు వర్గాన్నొకదాన్ని పెంపొందించటానికీ తగిన వ్యవసాయ విధానాలను అనుసరించారు. పాతకాలపు చట్టబద్ధ భూస్వామ్య విధానాన్ని రద్దు చేస్తూ తెచ్చిన శాసనాలు పెద్ద మొత్తాలలో భూములు కలిగి వుండటానికీ, పెద్ద మొత్తాలలో పరిహారం పొందటానికీ అవకాశం కల్పించాయి. స్వంతంగా సాగు చేసుకోవడమనే సాకుతో భూమిని స్వాధీనపరచుకునే హక్కును

కల్పించే కౌలుదారీ చట్టాలను అమలు జరిపినందువల్ల, లక్షలాది కౌలుదార్లు బేదఖలు చేయబడ్డారు. పెద్దపెద్ద కమతాలు యథాతథంగా వుంచుకోవటానికి కావలసినన్ని లొసుగులు భూగరిష్టపరిమితి చట్టాలలో వున్నాయి. లక్షలాది ఎకరాల మిగులు భూమిని స్వాధీన పరచుకోవడంగాని, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకూ పంచడంగాని జరగనేలేదు. గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చి వేయడానికి లభించిన చారిత్రక అవకాశాన్ని వినియోగించుకోకుండా ద్రోహం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. వున్న చట్టాల ప్రకారం భూసంస్కరణల అమలు జరిపింది పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో సిపిఐ(ఎం) నాయకత్వానగల వామపక్ష ప్రభుత్వాలు మాత్రమే.

3.17 కాంగ్రెస్ ప్రభుత్వాలూ, వాటి వారసులుగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలూ అనుసరించిన వ్యవసాయక విధానాలు – పెట్టుబడుల కోసం నిధుల కేటాయింపులోగాని, ప్రభుత్వ రుణాల కేటాయింపులోగాని భూస్వాములకు, ధనిక రైతులకు ప్రయోజనం కలిగే విధంగా రూపొందినవే. బ్యాంకులు, సహకార సంస్థలు ఇచ్చే రుణాలు ఈ తరగతులే దక్కించుకుంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వుపయోగపెట్టుకోవడం, అధిక దిగుబడులనిచ్చే గోధుమ, వరి వంగడాలను కొత్తగా ప్రవేశపెట్టడం, రసాయనాల వాడకం కారణంగా అరవయ్యో దశకం చివరి సంవత్సరాల నుంచి ఆహార ధాన్యాల ఉత్పాదకతా, ఆహారేతర పంటల ఉత్పాదకతా పెరిగింది. వ్యవసాయంలో ఈ అభివృద్ధితోపాటు, అంతరాలూ పెరిగాయి. భారతదేశం ఆహార ధాన్యాలను ఎక్కువగా వుత్పత్తి చేసింది. ఆహారం విషయంలో స్వయం సమృద్ధిని సాధించే సత్తా కలిగి వుంది. అయినా కోట్లాది ప్రజలు తగినంత ఆహారానికి నోచుకోవడంలేదు. ఆకలి బాధతో, పోషకాహారలోపంతో అలమటిస్తున్నారు.

3.18 గ్రామీణ ప్రాంతంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెంపొందటం వ్యవసాయ సంబంధాలలో కనిపించే ప్రధానమైన ధోరణి. దాన్ని సూచించే లక్షణాలేమిటంటే : గ్రామీణ కష్టజీవులలో విస్తారమైన సెక్షన్లు రెక్కల కష్టం తప్ప వేరే ఆధారంలేని వారుగా తయారవటం, మొత్తం గ్రామీణ జనాభాలో వ్యవసాయ కార్మికుల దామాషా బాగా పెరగడం; రైతాంగంలో వర్గీకరణ వేగం పుంజుకోవడం; మార్కెట్ కోసం ఉత్పత్తి చేయడం; సాంప్రదాయకంగా కౌలుదారులుగా వుంటున్న వారిని పెద్దఎత్తున బేదఖల్ చేయడం; గ్రామీణ సంపన్నులు ప్రత్యేకించి భూస్వాములు తమ ఆదాయాలను వ్యవసాయంలోను, వ్యవసాయ సంబంధమైన

కార్యకలాపాలలోనూ తిరిగి పెట్టుబడి పెట్టడం, ఫలితంగా ఇంతకుముందు దాకా లేని స్థాయిలో పెట్టుబడిని పునరుత్పత్తి చేయటానికి ప్రాతిపదిక ఏర్పరచడం.

3.19 వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెంపొందటం అనేది అఖిల భారత స్థాయిలో స్పష్టంగా కనిపించుతున్న ప్రధానమైన ధోరణి. అయితే అదే సమయంలో వ్యవసాయ సంబంధాలలో ప్రాంతీయ స్థాయిలోనూ, అంతకంటే దిగువ స్థాయిలోనూ వైవిధ్యముంది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి, పంపిణీ సంబంధాల అభివృద్ధిలో కూడా అసమానతలున్నాయి. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలూ వున్నాయి. అలాంటి చోట్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్య సరళి వ్యవసాయం, నగదు లావాదేవీలు హెచ్చుగా వున్నాయి. పాత రూపాలలో భూస్వామ్య విధానం, కౌలుదారీ పద్ధతి, పాత పద్ధతులలో కూలి పనులు చేయించుకోవడం, నౌకర్లు, కట్టుబానిసత్వం, వ్యవసాయ సంబంధాలలో ఇప్పటికీ ప్రముఖ పాత్ర వహించుతున్న ప్రాంతాలూ వున్నాయి. దేశమంతటా కుల విభజనలు, కులపీడన, మహిళలపై దారుణమైన రూపాలలో పీడన, వడ్డీ వ్యాపారస్తులూ, వాణిజ్య పెట్టుబడి పేదలను దోపిడీకి గురి చేయడం –నిరాఘాటంగా సాగిపోతున్నాయి. భారతదేశ వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధి, పాత రూపాలను నిర్ణయాత్మకంగా రూపుమాపటం ప్రాతిపదిక పైన జరగలేదు. పెట్టుబడిదారీ విధానపు పూర్వ ఉత్పత్తి సంబంధాలు, సామాజిక నిర్మాణం ఊబిలా అడుగున వుండగానే, దానిపైనే పెట్టుబడిదారీ అభివృద్ధి రుద్దబడింది. 'ఆధునికత' పెంపొందుతున్నదంటే పాత పద్ధతులు ఇంకా కొనసాగే పరిస్థితి లేకుండా పోయిందనడానికి లేదు. వ్యవసాయంలోకి, గ్రామీణ సమాజంలోకి పెట్టుబడిదారీ విధానం బహు విధాలుగా చొచ్చుకుపోతుందనే సూత్రానికి సజీవమైన, సువిశాలమైన ఉదాహరణ భారతదేశం.

3.20 బూర్జువా – భూస్వామ్య వ్యవసాయ విధానాల పుణ్యమా అంటూ, స్వాతంత్ర్యానంతరం ఐదు దశాబ్దాల తర్వాత రైతాంగంలో 70 శాతం పేద రైతులుగాను, వ్యవసాయ కార్మికులుగానూ వున్నారు. వారికి ఉత్పాదక ఆస్తులు కొరవడటం, వారి ఆదాయాలు తక్కువగా వుండటం, దుర్భర జీవితాలు గడుపుతుండటంవల్లనే పేదరికం ఇంత విస్తారంగా వుంది. భారతదేశంలో అసాధారణ స్థాయిలోగల గ్రామీణ పేదరికానికి సాటి కాగలది ప్రపంచ దేశాలలో

మరెక్కడా లేదు. ప్రభుత్వ లెక్కలను బట్టి చూచినప్పటికీ, స్వాతంత్ర్యం అనంతరం యాభయ్యేళ్ళకు భారతదేశ గ్రామీణ ప్రాంతాలలో 28 కోట్ల 50 లక్షల మందికి పైగా దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. పేదరికానికీ అనేక కోణాలున్నాయి. ఆదాయాల లేమి ఒక్కటే పేదరికం కాదు. సామాన్య ప్రజలు బహురూపాలలో దీన్ని అనుభవిస్తున్నారు. గ్రామీణ పేదల చేతుల్లో భూమి, తదితర ఉత్పత్తి సాధనాలు అసలే లేకపోవడమో, స్వల్పంగా మాత్రమే వుండటమో సర్వసాధారణం. భూకేంద్రీకరణ, స్వంత భూమి కలిగి వుండటంలో అసమానతలు పెద్దగా మార్పు లేకుండా కొనసాగుతున్నాయి. దానికితోడు, సాగునీటి వనరులు గ్రామీణ సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమై వున్నాయి. రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకూ సరసమైన రేట్లతో అప్పులు దొరికే అవకాశాలు అందుబాటులో లేవు. పీల్చి పిప్పి చేసే వడ్డీ రేట్లతో కూడిన అప్పుల ఊబిలో వారున్నారు. తక్కువ కూలి, స్త్రీలకు మరింత తక్కువ కూలి ప్రధాన లక్షణంగా వుంది. వ్యవసాయ కార్మికులకు ఏడాదిలో సగటున 180 రోజులకు లోపుగా మాత్రమే పని దొరుకుతుంది. గ్రామీణ జనాభాలో యాభై శాతానికిపైగా పౌష్టికాహారలోపం ఉంది. గ్రామీణ అక్షరాస్యత స్థాయి బహు స్వల్పంగా వుంది. గ్రామీణ పేదలు తాగడానికి నీరు, ఆరోగ్య సదుపాయాలు, తగిన గృహవసతి లేకుండా అపరిశుభ్ర పరిస్థితులలో జీవించుతున్నారు.

3.21 గ్రామీణ ప్రాంతాలలో, భూస్వాములు – ధనిక రైతులు – కాంట్రాక్టర్లు –పెద్ద వ్యాపారస్తులు శక్తివంతమైన కలయికగా రూపొందారు. వారే గ్రామీణ సంపన్న వర్గంగా వున్నారు. పంచాయతీరాజ్ సంస్థలు, సహకార సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, పరపతి సంఘాలలో ఆధిపత్యం వారిదే. వామపక్ష ఆధిక్యతగల రాష్ట్రాలు మాత్రమే ఇందుకు మినహాయింపు. బూర్జువా – భూస్వామ్య పార్టీలలో గ్రామీణ నాయకత్వం వారి అదుపులోనే వుంటుంది. ఈ సెక్షన్ల వారు సంపాదించిన అదనపు ఆదాయాన్ని వడ్డీ వ్యాపారంలోనూ, స్పెక్యులేషన్ కార్యకలాపాలలోనూ, స్థిరాస్తులను పెంపొందించుకోవడంలోనూ, వ్యవసాయధార పరిశ్రమల స్థాపనలోనూ ఉపయోగించుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆధిక్యతలో గల వర్గం తమకు మద్దతు సమీకరించుకోవడానికి కుల సంబంధాలను ఉపయోగ పెట్టుకుంటున్నది. గ్రామీణ పేదలను భయకంపితులను గావించి లొంగదీసుకోవడానికి హింసాకాండకు పాల్పడుతున్నది. రాజ్యాంగం అమలులోకి వచ్చి యాభయ్యేళ్ళు గడిచిన తర్వాత

కూడా వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలకు హామీ కల్పించడానికీ, వారి జీవన పరిస్థితులు మెరుగుపరచడానికీ, సామాజిక భద్రత కల్పించడానికీ ఏ ప్రభుత్వమూ కూడా కేంద్ర శాసనం చేయలేకపోయింది. భూస్వాముల వ్యతిరేకతే అందుకు కారణం.

3.22 గ్రామీణ ఆర్థిక వ్యవస్థ శీఘ్రగతిన వాణిజ్యీకరించబడుతోంది. ఆహార ధాన్యాలకు, వ్యవసాయ సరకులకూ, మార్కెట్ అపరిమితంగా పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులపై గుత్త వ్యాపార సంస్థల పట్టు బలపడింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం తమ చేతుల్లో పెట్టుకొని, అంతర్జాతీయ మార్కెట్లలో లావాదేవీలు నిర్వహించుతుండే బహుళజాతి కంపెనీలు, సరళీకరణ అనంతరం వ్యవసాయ సరుకుల ధరలపైన కూడా మరింత హెచ్చుగా, ప్రత్యక్ష అజమాయిషీని కలిగి వుంటున్నాయి. మారకంలో అసమానతలు, ధరలలో దారుణమైన హెచ్చుతగ్గుల కారణంగా రైతులపై దోపిడీ ఉధృతమవడం శాశ్వత లక్షణంగా తయారైంది. తత్ఫలితంగా, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకందారుగానూ, పారిశ్రామిక ఉత్పత్తుల కొనుగోలుదారుగానూ కూడా రైతు దోపిడీకి గురవుతున్నాడు.

3.23 ప్రభుత్వ ప్రాయోజిత పెట్టుబడిదారీ అభివృద్ధి అవకాశాలు హరించుకు పోయిన అనంతరం సరళీకరణ విధానాల పర్యవసానంగా, ఇరవయ్యో శతాబ్దం చివరి దశకంలో, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి విధానాలు ప్రమాదకరమైన, ప్రగతి నిరోధకమైన మలుపుతిరిగాయి. వ్యవసాయ, నీటిపారుదల తదితర ప్రాథమిక సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ పెట్టుబడి తగ్గిపోయింది. వ్యవస్థీకృత రంగం నుండి పరపతి సౌకర్యాలు తగ్గిపోయాయి. దీనివల్ల గ్రామీణ పేద కుటుంబాలకు ఎంతగానో నష్టం జరిగింది. గ్రామీణ ఉపాధి కల్పనకు, పేదరిక నిర్మూలనకు ఉద్దేశించబడిన పథకాలలో కోత పెట్టడం జరిగింది. ఎగుమతుల దృష్టితో వ్యవసాయం అనే విధానపరమైన ప్రాధాన్యత కారణంగా, సామ్రాజ్యవాద దేశాల అవసరాలకు అనుగుణంగా భూ వినియోగాన్ని పంటల సరళిని మార్చుకోవడం జరిగింది. ఆహార ఉత్పత్తుల ప్రాధాన్యతను తగ్గించడం, ఆహార ఉత్పత్తి విషయంలో భారతదేశ స్వయం సమృద్ధిని దెబ్బకొట్టడంవల్ల మన సార్వభౌమాధికారానికే ప్రత్యక్ష ప్రమాదం ఏర్పడుతోంది. డబ్ల్యు.టి.ఓ. నిబంధనల ప్రకారం వ్యవసాయోత్పత్తుల దిగుమతి పరిమాణంపై అన్ని రకాల ఆంక్షలు తొలగిపోవడంతో రైతుల జీవనోపాధికి తీవ్రమైన ముప్పు వాటిల్లింది. రాష్ట్రాలు భూగరిష్ట పరిమితి చట్టాలను సడలించాలని, భూములను భారతీయ

బడా వాణిజ్య సంస్థలకు, విదేశీ వ్యవసాయ – వాణిజ్య సంస్థలకూ లీజుకివ్వాలని ఒత్తిడి అంతకంతకూ పెరుగుతోంది. బహుళజాతి కంపెనీలు విత్తనాలు, డైరీ తదితర రంగాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తిలో ప్రవేశిస్తున్నాయి. డబ్ల్యు.టి.ఓ. నుండి బహుళజాతి కంపెనీల నుండి వస్తున్న ఒత్తిడికి తలొగ్గి, జీవ సంబంధమైన వనరుల విషయంలో భారతదేశానికి గల స్వాతంత్ర్యాన్ని వదులుకోవడం, రైతులకు సిసలయిన విత్తన ఉత్పత్తిదారులకు గల హక్కులను ధారాదత్తంచేసే విధానాలను అనుసరించడం జరుగుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యాన జరిగే వ్యవసాయ పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు బలహీనపరచబడినాయి.

3.24 ప్రభుత్వ ప్రోత్సాహంతో, వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడంవల్ల, గ్రామీణ ప్రాంతాలలో నిశితమైన విభజన ఏర్పడింది. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు, ధనిక రైతులు, వారి మిత్రులతో కూడిన గ్రామీణ సంపన్న వర్గం ఒకవైపున – ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, చేతివృత్తుల వారితో కూడిన మొత్తం సాధారణ రైతుజన బాహుళ్యం ఇంకొక వైపున నిలిచివున్నారు. వ్యవసాయరంగంలో ఆ తర్వాత వచ్చిన సరళీకరణ విధానాలు, గ్రామీణ పేదలపై భారాన్ని మరింత పెంచాయి. ఈ దోపిడీ వ్యవస్థే విస్తారమైన పేదరికానికి కారణం. భూమిపై గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టకుండా, పేద రైతుల, వ్యవసాయ కార్మికుల రుణభారాన్ని తొలగించకుండా, దేశం ఆర్థికంగా, సామాజికంగా పరివర్తన చెందడానికి ప్రాతిపదిక ఏర్పడటం సాధ్యంకాదు.

3.25 సామ్రాజ్యవాద చోదిత ప్రపంచీకరణ, భారతదేశ పాలకవర్గాలు చేపట్టిన సరళీకరణ విధానాలూ, మన దేశంలో అన్ని రంగాలలోనూ సామ్రాజ్యవాద చొరబాటును అధికం చేశాయి. మన ఆర్థిక వ్యవస్థ ద్వారాలను బార్లా తెరిచినందువల్ల బహుళజాతి కంపెనీల, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ప్రవేశించడానికి భారతీయ సమాజంలోని అన్ని రంగాలలోకీ చొచ్చుకుపోవడానికీ, ప్రభావితం చేయడానికీ ప్రాతిపదిక ఏర్పడింది. ఉన్నతాధికారవర్గం, విద్యా వ్యవస్థ, మీడియా, సాంస్కృతిక రంగాలలో సామ్రాజ్యవాద చొరబాటు జరుగుతున్నది.

3.26 సోషలిజానికి ఎదురుదెబ్బ తగిలిన ఫలితంగా ప్రపంచ శక్తుల బలాబలాలలో వచ్చిన మార్పువల్ల ప్రపంచంలో ఛాందసత్వం, అభివృద్ధి నిరోధక, జాతి

దురభిమానాలు పెరిగాయి. దీని ప్రభావం భారతదేశం మీద కూడా పడింది. సామ్రాజ్యవాదం తన పట్టును, ప్రభావాన్నీ పటిష్టపరచుకొనేందుకై, దేశ సమైక్యతను బలహీనపరచడం కోసం, అలాంటి శక్తుల పెరుగుదలను ఉపయోగపెట్టుకో గోరుతోంది. బహుళజాతి కార్పొరేషన్ల అధీనంలోగల శక్తివంతమైన అంతర్జాతీయ మీడియా పెరుగుదల వల్ల సామాజిక, సాంస్కృతిక జీవనంలో ప్రత్యక్షంగా కలుగజేసుకోవడానికి, ప్రభావితం చేయడానికీ సామ్రాజ్యవాదానికి ఆస్కారం కలుగుతోంది. బహు దేశీయ మీడియా ద్వారా వినిమయవస్తు వ్యామోహం, స్వాతిశయం, క్షీణ విలువలు ఏర్చికూర్చి అందించడం మన సమాజం మీద ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. భారతదేశంలో బడా బూర్జువా వర్గం తదితర వాణిజ్య శక్తుల అధీనంలోగల మీడియా ఒక పద్ధతి ప్రకారం అవే విలువలను వ్యాప్తి చేస్తున్నది. ఆరోగ్యప్రదమైన ప్రజాతంత్ర, లౌకిక విలువలను పెంపొందించడానికి, అలాంటి ప్రతీప ధోరణులను నిరోధించడం అవసరం.

3.27 1950లో ఆమోదించబడిన భారత రిపబ్లిక్ రాజ్యాంగం ప్రభుత్వం అనుసరించవలసిన ఆదేశిక సూత్రాలను నిర్దేశించింది. ప్రతి పౌరునికీ తగిన జీవనోపాధి, పని చేసే హక్కు, సంపద కేంద్రీకరణకు దారి తీయని ఆర్థిక వ్యవస్థ, విద్యను పొందే హక్కు, పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య, కార్మికులకు జీవితావసరాలకు సరిపడే వేతనం, స్త్రీ – పురుషులకు సమాన పనికి సమాన వేతనం అందులో వున్నాయి. ఈ సూత్రాలలో ఏదీ ఆచరణలో నెరవేరలేదు. రాజ్యాంగ ఆదేశాలకు – బూర్జువా పాలకుల ఆచరణకూ మధ్య కొట్టవచ్చినట్లు కనిపించే అంతరం స్వాతంత్ర్యానంతరం స్థాపితమైన బూర్జువా, భూస్వామ్య వ్యవస్థపై తీవ్రమైన అభిశంసనే.

# 4

# విదేశాంగ విధానం

4.1 ఏ రాజ్యం, దాని ప్రభుత్వం యొక్క విదేశాంగ విధానమైనా, అంతిమ విశ్లేషణలో దాని అంతరంగిక విధానపు వ్యక్తీకరణగానే వుంటుంది. ఆ ప్రభుత్వానికి, ఆ రాజ్యానికి ఆధిపత్యం వహించుతున్న వర్గం లేదా వర్గాల ప్రయోజనాలనే అది ప్రధానంగా ప్రతిబింబిస్తూ వుంటుంది. భారత ప్రభుత్వ విదేశాంగ విధానం సహజంగానే మన బూర్జువా వర్గ ద్వంద్వ స్వభావాన్నే అంటే – సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకతతో పాటే, దానితో రాజీపడే, మిలాఖత్తయ్యే ద్వంద్వ స్వభావాన్నే – ప్రతిబింబిస్తూ వుంటుంది. గత ఐదు దశాబ్దాల విదేశాంగ విధాన పరిణామ క్రమాన్ని పరిశీలించి చూస్తే ఈ ద్వంద్వ స్వభావం కనిపించుతుంది. యాభయ్యో దశకం మధ్యభాగం వరకూగల తొలి దశలో భారత ప్రభుత్వం బ్రిటన్ తదితర రాజ్యాలను సంతృప్తి పరచే పిరికి విధానాన్ని అనుసరించింది. అయితే యాభయ్యవ దశకం మధ్య నుండి కొత్త వరవడి మొదలైంది. సామ్రాజ్యవాద, సోషలిస్టు శిబిరాల మధ్య నిశితంగా చీలి వున్న ప్రపంచంలో, సామ్రాజ్యవాద కూటమితో నిమిత్తం లేకుండా సాగిపోయే అవకాశాలు ఏర్పడినాయి. సైనిక కూటములకు వ్యతిరేకంగా, శాంతికి అనుకూలంగా, వలస దేశాల ప్రజల జాతీయ విమోచన పోరాటాలకు మద్దతు తెలుపుతూ అలీనతకు అనుకూలంగా వుండే విదేశాంగ విధానంగా మారింది.

4.2 ఈ విధానం పర్యవసానంగా సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాలతో స్నేహ సంబంధాలేర్పడ్డాయి. అయితే 1962లో చైనాతో సరిహద్దు సంఘర్షణ అనంతరం అమెరికాతో, పాశ్చాత్య రాజ్యాలతో చేతులు కలిపే దశ వచ్చింది.

భారతదేశం వారి నుంచి సైనిక సహాయం కోరింది. ఈ దశ అనంతరం విదేశాంగ విధానం మరలా సామ్రాజ్యవాద వ్యతిరేక దృష్టిని సంతరించుకుంది. 1971లో బంగ్లాదేశ్ విమోచన పోరాటానికి మద్దతివ్వడం, సోవియట్ యూనియన్‌తో మైత్రీ ఒప్పందం నూతన దశకు రూపమిచ్చాయి. జాతీయ విమోచన ఉద్యమాలకు అండగానూ, ప్రపంచ శాంతి కోసమూ 70వ దశకంలో భారతదేశంలో అంతర్జాతీయ రంగంలో చురుకైన పాత్ర నిర్వహించింది.

4.3 విదేశాంగ విధానానికి సంబంధించి, భారత బూర్జువా వర్గానికీ - సామ్రాజ్యవాదానికీ మధ్య వైరుధ్యం కాశ్మీర్ సమస్య విషయంలోనూ, తన సైనిక కార్యకలాపాలకు పాకిస్తాన్‌ను స్థావరంగా ఉపయోగించుకోవాలన్న అమెరికా వ్యూహాత్మక పథకం విషయంలోనూ వ్యక్తమయింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలలో ప్రముఖ దేశంగా ఉన్న భారత్‌లో బూర్జువా వర్గం అలీన విధానాన్ని ముందుండి నడిపించింది. మొత్తం మీద ఆ విధానం దేశ ప్రయోజనాలకు ఉపకరించింది. అయితే పాలకవర్గాల వర్గ స్వభావాన్ని బట్టి ఈ విధానంలో ఊగిసలాటలూ చోటు చేసుకున్నాయి. విదేశీ పెట్టుబడులకు అనుకూలమైన దేశీయ విధానాలకు - స్వతంత్ర విదేశాంగ విధానానికీ మధ్య వైరుధ్యాలు ఎప్పుడూ వుంటూనే వచ్చాయి.

4.4 సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి, దేశంలోపల సరళీకృత ఆర్థిక విధానాలను చేపట్టడం పర్యవసానంగా ఇరవయ్యో శతాబ్దపు చివరి దశకంలో విదేశాంగ విధానం నూతన దశలో ప్రవేశించింది. చిరకాలంగా అనుసరించబడుతూ వచ్చిన అలీన, సామ్రాజ్యవాద వ్యతిరేక విదేశాంగ విధానాన్ని వెనక్కు కొట్టే క్రమం నరసింహారావు ప్రభుత్వ హయాంలో మొదలైంది. స్వావలంబన పథం నుండి వైదొలగి విదేశీ పెట్టుబడులను ఆశ్రయించడం, సరళీకరణా భారతదేశంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు సామ్రాజ్యవాదానికి తోడ్పడ్డాయి. విదేశాంగ విధానానికి సంబంధించిన అనేక వైఖరులలో ఈ విషయం వ్యక్తమయింది. సైనిక శిక్షణకు, సంయుక్త విన్యాసాలకుగాను, భారత ప్రభుత్వం అమెరికాతో సైనిక సహకార ఒప్పందంపై తొంభయ్యవ దశకంలో సంతకం చేసింది. 1998లో కేంద్రంలో బిజెపి నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడ్డాక సామ్రాజ్యవాద అనుకూల వైఖరి మరింత బలపడింది. అమెరికాకు జూనియర్ భాగస్వామిగా చేరాలని ప్రతిపాదించడం ద్వారా బిజెపి ప్రభుత్వం విదేశాంగ విధానంలో ప్రధానమైన మార్పు తెచ్చింది.

అమెరికా ప్రపంచ వ్యూహానికి అనుకూలంగా వుండేందుకు అది దీర్ఘకాలంగా అనుసరిస్తున్న అనేక అలీన వైఖరులకు తిలోదకాలిచ్చింది. చైనా, రష్యాలకు వ్యతిరేకంగా వ్యూహాత్మక కూటమిలోకి భారతదేశాన్ని రాబట్టాలన్న దీర్ఘకాలిక పథకాలు అమెరికాకు వున్నందున, విదేశాంగ విధానానికి నిజంగానే ప్రమాదం ఏర్పడుతోంది. బడా బూర్జువా వర్గం రాజ్యాధిపత్యం వహిస్తూ, సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలను అనుసరిస్తున్నంత కాలం అలీనత, సామ్రాజ్యవాద వ్యతిరేకత ప్రాతిపదికగా కలిగి, భారత ప్రజల నిజమైన ప్రయోజనాలకు దోహదకరమైన, నికరమైన విదేశాంగ విధానం వుంటుందన్న గ్యారంటీ లేదు.

4.5 1998 మే నెలలో పోఖ్రాన్ పరీక్షల అనంతరం, అణ్వాయుధాలు సమకూర్చుకోవాలని బిజెపి నాయకత్వానగల ప్రభుత్వం నిర్ణయించడంవల్ల భారత విదేశాంగ, అణువిధానాలలో ప్రమాదకరమైన నూతన దశ మొదలైంది. భారత అణుపరీక్షలకు ప్రతిస్పందించి పాకిస్తాన్ కూడా అణుపరీక్షలు జరపడంతో ఉపఖండంలో అణ్వాయుధ పోటీ వచ్చిపడింది. యుద్ధోన్మాదంతో కూడిన అణువిధానం, దీర్ఘకాలంగా సాగుతున్న అలీన, శాంతి విధానాన్ని దెబ్బతీసింది. భారతదేశం మరింత ఎక్కువగా, సామ్రాజ్యవాద ఒత్తిడులకు లోనయ్యేటట్లు చేసింది.

4.6 విదేశాంగ విధానంలో సామ్రాజ్యవాద అనుకూల మొగ్గను తిప్పికొట్టడానికీ, విదేశాంగ విధానం, సామ్రాజ్యవాద ఒత్తిళ్ళను వెనక్కి కొట్టే విధంగా తిరిగి తన అలీన ప్రాతిపదికనూ, దిశనూ పొందేట్లు చేయడానికీ – వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు మున్ముందు పెద్ద పోరాటం సాగించవలసి వుంది. భారత దేశం ప్రపంచ వ్యవహారాలలో తన స్వతంత్ర పాత్రను నిలబెట్టుకుని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం అలాంటి విధానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

# 5

# రాజ్యాంగ యంత్రం - ప్రజాస్వామ్యం

5.1 ప్రస్తుత రాజ్యాంగ యంత్రం బడాబూర్జువా నాయకత్వానగల బూర్జువా - భూస్వామ్య వర్గాల పరిపాలనా సాధనం. ఈ బడా బూర్జువా వర్గం పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని అనుసరించే లక్ష్యంతో విదేశీ ఫైనాన్సు పెట్టుబడితో అంతకంతకు మిలాఖత్ అవుతున్నది. ఈ వర్గ స్వభావమే మన దేశ జీవితంలో రాజ్యాంగ యంత్రం యొక్క పాత్రనూ, విధులనూ ప్రధానంగా నిర్ణయిస్తుంది.

5.2 రాజ్యాంగ వ్యవస్థ పేరుకు ఫెడరల్ అయినప్పటికీ అత్యధిక అధికారాలు, వనరులు కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే కేంద్రీకృతమై వున్నాయి. ఉమ్మడి భాష ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పరచాలనే డిమాండ్‌ను బడా బూర్జువా వర్గం మొదట్లో ప్రతిఘటించినా ప్రజా ఉద్యమాలు, ఆందోళనల ఒత్తిడితో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అంగీకరించక తప్పలేదు. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం భాషా రాష్ట్రాల సూత్రంపై మరోసారి దాడి చేస్తోంది. పాలనా సౌలభ్యం పేరుతో చిన్న రాష్ట్రాల ఏర్పాటును ప్రతిపాదిస్తోంది. దీనివల్ల ఫెడరల్ వ్యవస్థ మరింత బలహీనమవుతుంది. స్వతహాగానే ప్రజాస్వామ్య వ్యతిరేకమైనదిగా రాజ్యాంగంలో గల 356వ అధికరణాన్ని కేంద్రం పదేపదే ఉపయోగించి ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను, ఎన్నికైన రాష్ట్ర శాసనసభలను రద్దు చేసింది. ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీయడానికి, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిపై దాడికి అది ప్రధాన సాధనమైంది. భాగస్వామ్య రాష్ట్రాలకు చాలా స్వల్ప అధికారాలే వున్నాయి. అందుకే అవి కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోంది. వాటి అభివృద్ధి కుంటు పడుతుంది.

5.3 ఇలాటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య వైరుధ్యాలు పెరగడం సహజం. ఇలాంటి వైరుధ్యాల వెనుక తరచూ ఒక వైపున బడా బూర్జువాలకు,

మరో వైపున ఆయా రాష్ట్రాల బూర్జువా, భూస్వాములతో సహా మొత్తం ప్రజానీకానికి మధ్య మరింత లోతైన వైరుధ్యం ఉంటుంది. పెట్టుబడిదారీ ఆర్థికాభివృద్ధిలో అసమానతలు అధికం కావడంతో ఈ వైరుధ్యం మరింత తీవ్రమౌతుంది. దీనికి ఒక రాజకీయ వ్యక్తీకరణ ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం. ఈ పార్టీలు ఆ రాష్ట్రాల భాష , జాతికి సంబంధించిన మనోభావాలను ప్రతిబింబిస్తూ, సాధారణంగా ఆ ప్రాంత బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

5.4 స్వాతంత్ర్యానంతరం అనుసరించిన బూర్జువా భూస్వామ్య విధానాల వల్ల జాతీయ సమైక్యతా సమస్యలు తీవ్రతరమయ్యాయి. అనేక మైనారిటీ జాతులకు ఉపజాతి బృందాలకు నిలయంగా వున్న ఈశాన్య ప్రాంతం పెట్టుబడిదారీ విధానం రుద్దిన అసమానాభివృద్ధి వల్ల, ప్రాంతీయ అసమానత వల్ల అత్యధికంగా దెబ్బతినింది. వేర్పాటువాదాన్ని ప్రబోధిస్తూ, సామ్రాజ్యవాద ఏజెన్సీలకు ఉపయోగపడేలా తీవ్రవాద వర్గాల పెరుగుదలకు ఇది సారవంతమైన భూమిక సృష్టించింది. తీవ్రవాదుల హింసాచర్యలు, జాతి ఘర్షణలు అభివృద్ధి కృషికి, ప్రజాతంత్ర కార్యకలాపాలకు ఆటంకమవుతున్నాయి.

5.5 రాజ్యాంగం 370వ అధికరణం జమ్మూ - కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా, స్వయంప్రతిపత్తి కల్పించింది. గడిచిన దశాబ్దాల్లో స్వయం ప్రతిపత్తి నిబంధనలు తీవ్రంగా కుదించబడి, రాష్ట్రంలోని ప్రజలలో వైముఖ్యత పెరిగింది. పాకిస్తాన్ వత్తాసుగల వేర్పాటువాద శక్తులు దీన్ని ఉపయోగించుకున్నాయి. అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు, ఈ ప్రాంతంలో తన జోక్యాన్ని పెంచేందుకు ఈ వివాదాన్ని ఉపయోగించుకుంటోంది. కీలకమైన జాతీయ సమైక్యతా సమస్యలకు ప్రజాతంత్రయుత పరిష్కారాలు కనుగొనడంలో బూర్జువా, భూస్వామ్య వర్గాల వైఫల్యానికి ఈశాన్య రాష్ట్రాలు, అలాగే కాశ్మీర్ సమస్య ఉదాహరణలు.

5.6 జనాభాలో 7 కోట్లుగా ఉన్న ఆదివాసులు, గిరిజన ప్రజానీకం క్రూరమైన పెట్టుబడిదారీ, అర్థఫ్యూడల్ దోపిడీకి బలవుతున్నారు. వారి భూములు వారి నుండి వేరవుతున్నాయి. అడవులపై హక్కు నిరాకరించబడుతున్నది. కాంట్రాక్టర్లు, భూస్వామ్య కంట్రాక్టర్లలకు చౌకగానూ వెట్టికీ శ్రామికులను సమకూర్చే వనరుగా వారు వున్నారు. కొన్ని రాష్ట్రాలలో స్వంత భాషలు, సంస్కృతిగల గిరిజన ప్రజానీకం

సమీప ప్రాంతాలలో నివసిస్తున్నారు. తమ గుర్తింపునూ, సంస్కృతినీ కాపాడుకుంటూనే అభివృద్ధి చెందేందుకు తమకుగల హక్కులు రక్షించుకోవాలన్న నూతన చైతన్యం గిరిజనులలో పెంపొందింది. తమ గుర్తింపుకూ, అసలు ఉనికికే ముప్పు కలగడం వల్ల, బూర్జువా భూస్వామ్య పాలకుల నిర్లక్ష్యపూరిత విధానాల వల్ల గిరిజన ప్రజానీకంలోని కొన్ని తరగతులలో వేర్పాటువాద భావనలు పెరిగాయి. కలసికట్టు ప్రాంతంగా వుంటూ, జనాభాలో వారు మెజారిటీగా వున్న ప్రాంతాలలో వారి హక్కుల పరిరక్షణకు ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి కావాలన్న డిమాండ్ ప్రజాతంత్రయుతమైంది, న్యాయమైంది. వారి నాయకులకు కొన్ని రాయితీలు ఇస్తూ, వారిలో గల సాంప్రదాయక సంఘీభావాన్ని విచ్ఛిన్నం చేయడానికి బూర్జువా భూస్వామ్య కాంట్రాక్టర్ల కూటమి ఎప్పుడూ ప్రయత్నిస్తూ వుంటుంది. వారి న్యాయమైన హక్కులు నిరాకరించి, అమానుష బలప్రయోగంతో వారిని అణచివేస్తుంది.

5.7 లౌకిక సూత్రం రాజ్యాంగంలో పొందుపరచబడింది. రాజ్యాంగానికి నాయకత్వం వహిస్తున్న బూర్జువా భూస్వామ్య వర్గమే లౌకిక ప్రజాస్వామ్య విలువలను ప్రకటించింది. అయితే బూర్జువా నాయకత్వం లౌకికతత్వాన్ని ఆచరణలో అమలు జరపడం మాత్రం లోపభూయిష్టంగా వుంది. లౌకికతత్వమనే మొత్తం భావననే వక్రీకరించడానికి వారు ప్రయత్నిస్తున్నారు. మతాన్ని, రాజకీయాలను పూర్తిగా వేరు చేయడానికి బదులు లౌకికతత్వమంటే అన్ని మత విధానాలకు రాజ్య వ్యవహారాల్లో, రాజకీయాలలో సమానంగా జోక్యం చేసుకొనే స్వాతంత్ర్యం ఇవ్వడమేనని వారు ప్రజలను నమ్మింపచూస్తారు. లౌకిక వ్యతిరేక ధోరణులను కఠినంగా ఎదిరించడానికి బదులు బూర్జువా వర్గం తరచూ రాయితీలిచ్చి, వాటికి బలం చేకూర్చుతున్నది. మతోన్మాద, ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని కూటమి పెరుగుదలవల్ల, కేంద్రంలో అది అధికారం చేపట్టడంవల్ల లౌకిక పునాదులకు ముప్పు భయానకంగా పెరిగింది. రాజ్యాంగ యంత్రం, పాలనాయంత్రం, విద్యా వ్యవస్థ, మీడియా సంస్థలన్నింటినీ మతతత్వపూరితం చేసేందుకు పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మెజారిటీ మతోన్మాదం పెరుగుదల మైనారిటీ మతోన్మాద శక్తుల పెరుగుదలకు దారి తీసి జాతీయ సమైక్యతకు ప్రమాదం తెస్తుంది. బిజెపికి, దాని మతతత్వ కార్యక్రమానికి బడా బూర్జువా వర్గంలో కొన్ని సెక్షన్లు మద్దతునివ్వడం దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వంపై తీవ్ర పర్యసానాలకు దారి తీస్తుంది.

5.8 అందువల్ల మన పార్టీ లౌకికతత్వ సూత్రాలను నికరంగా అమలు జరిపేందుకు రాజీలేని పోరాటం జరుపుతుంది. ఈ సూత్రాల నుండి ఏ కాస్త వైదొలిగినా ఎండగట్టి ఎదుర్కోవాలి. మెజారిటీ, మైనారిటీ మతవర్గాలు, అలాగే ఏ మతంలో విశ్వాసం లేనివారు ఏ మతాన్నయినా అనుసరించడానికి లేదా దేన్నీ అనుసరించకుండా వుండటానికి గల హక్కును పరిరక్షించేందుకు పార్టీ పోరాడుతుంది. అదే సమయంలో జాతి ఆర్థిక, రాజకీయ, పాలనా జీవితంలో మతం చొరబాటు ఏ రూపంలో వున్నా అందుకు వ్యతిరేకంగా పోరాడుతుంది. సంస్కృతి, విద్యారంగాలలో సమాజంలో లౌకిక ప్రజాస్వామ్య సూత్రాలను నిలబెడుతుంది. మతతత్వం ప్రాతిపదికన ఫాసిస్టు ధోరణులు బలం పుంజుకునే ప్రమాదాన్ని అన్ని స్థాయిలలో తీవ్రంగా ఎదుర్కోవాలి.

5.9 పెట్టుబడిదారీ దోపిడీ పరిస్థితులలో రాజ్యాంగంలో మైనారిటీలకు గ్యారంటీ చేయబడిన హక్కులు కూడా అమలు జరగడంలేదు. ఆర్థిక, సామాజిక రంగాలు రెండింటా ముస్లిం మైనారిటీలకు సమాన హక్కులు లేకపోవడం, వివక్ష ప్రదర్శించడం జరుగుతున్నది. ముస్లింలకు వ్యతిరేకంగా మత ఘర్షణలు, హింసాత్మక దాడులు శాశ్వత లక్షణాలుగా తయారయ్యాయి. మైనారిటీలకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు నిరంతరం ద్వేషం రగుల్చుతున్నాయి. ఇప్పుడు అవి క్రైస్తవ మైనారిటీలను కూడా లక్ష్యంగా చేసుకున్నాయి. ఇది మైనారిటీలలో వైముఖ్యాన్ని, అభద్రతను పెంపొందించి లౌకిక పునాదులను, ప్రజాతంత్ర విలువలను బలహీనపరుస్తుంది. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని బలోపేతం చేసే పోరాటంలో మైనారిటీల హక్కుల రక్షణ ఒక కీలకమైన అంశం.

5.10 కులపరమైన అణచివేతను అంతమొందించడంలో కూడా బూర్జువా భూస్వామ్య వ్యవస్థ విఫలమైంది. షెడ్యూల్డు కులాలకు చెందిన వారు అందరికన్నా దారుణంగా కష్టాల నెదుర్కొంటున్నారు. అస్పృశ్యత, తదితర వివక్షతా రూపాలు చట్ట వ్యతిరేకమని ప్రకటించబడినా దళితులు అణచివేతకు గురి చేయబడుతున్నారు. విముక్తి కోసం దళితుల్లో పెరుగుతున్న చైతన్యాన్ని క్రూరమైన అణచివేత, అత్యాచారాలతో వెనక్కి కొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. దళితులు నిలదొక్కుకోవడంలో ప్రజాతంత్ర సారాంశం వుంది. సమాజంలో అత్యంత ఎక్కువగా అణచివేయబడిన వారి ఆకాంక్షలను అది ప్రతిబింబిస్తోంది. కులాలతో నిండిన సమాజంలో వెనుకబడిన కులాలు కూడా తమ హక్కులు వక్కాణిస్తున్నాయి.

5.11 అదే సమయంలో ఓటు బ్యాంకులను పదిలం చేసుకొనే సంకుచిత లక్ష్యంతో కేవలం కులపరమైన పిలుపులతో కుల విభజనలను కొనసాగించేందుకు, దళిత వర్గాలను ఉమ్మడి ప్రజాతంత్ర ఉద్యమాల నుండి విడగొట్టేందుకు ప్రయత్నించే శక్తులు కూడా పని చేస్తున్నాయి. అనేక మంది కుల నాయకులు, కొన్ని బూర్జువా రాజకీయ పార్టీల నాయకుల కుల ప్రాతిపదికన సమీకరణను సంకుచిత ఎన్నికల లబ్దికోసం ఉపయోగించుకుంటున్నారు. అన్ని కులాల్లోని పీడిత ప్రజలతో ఉమ్మడి ఉద్యమాలు నిర్వహించడం పట్ల వ్యతిరేకంగా వున్నారు. పాత సామాజిక వ్యవస్థను కూలదోసేందుకు ప్రాతిపదికగా వుండాల్సిన భూమి, వేతనాలు వంటి మౌలిక సమస్యలనూ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలనూ వారు విస్మరిస్తున్నారు.

5.12 కుల అణచివేత, వివక్షతా సమస్యకు సుదీర్ఘ చరిత్ర వుంది. పెట్టుబడిదారీ పూర్వ సామాజిక వ్యవస్థలో అది బలంగా వేళ్ళూనుకుని వుంది. పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో ఉన్న సమాజం కుల వ్యవస్థతో రాజీపడింది. భారత బూర్జువా వర్గమే కుల దురభిప్రాయాలను పెంచిపోషిస్తోంది. కుల వ్యవస్థకూ, దళితుల అణచివేతకు వ్యతిరేకంగా ఐక్యత సాధించినప్పుడే కార్మికవర్గ ఐక్యత ఏర్పడుతుంది. ఎందుకంటే దళిత జనాభాలో అత్యధికులు శ్రామికవర్గాలకు చెందినవారే. కుల వ్యవస్థ నిర్మూలనకై పోరాటం ప్రజాతంత్ర విప్లవంలో ముఖ్యమైన భాగం. కుల అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటం వర్గ దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంతో ముడిపడి వుంది.

5.13 స్వాతంత్ర్య పోరాటంలో సమానంగా పాల్గొన్న, భారతీయ మహిళలు దేశ స్వాతంత్ర్యం తర్వాత శతాబ్దాల ఫ్యూడల్, లైంగిక అణచివేత సంకెళ్ళ నుంచి విముక్తి లభిస్తుందని ఆశించారు. అయితే, అయిదు దశాబ్దాల బూర్జువా భూస్వామ్య పాలన పురోగమనం మాట అటుంచి ప్రతిరంగంలో పితృస్వామిక వ్యవస్థనే కొనసాగించింది. మహిళలుగా, శ్రామికులుగా, పౌరులుగా వేర్వేరు స్థాయిల్లో మహిళలు దోపిడీకి గురవుతున్నారు. ప్రపంచీకరణ క్రమం ఆర్థిక, సామాజికరంగాలు రెంటిలోనూ లైంగిక దోపిడీని నూతన రూపాలలో ముందుకు తెచ్చి స్త్రీలపై హింసను అధికం చేసింది. ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక, రాజకీయ జీవనంలో స్వతంత్ర పాత్ర లభించినప్పుడు మాత్రమే మహిళలు పురోగమించగలుగుతారు. ఈ అసమాన హోదాకు ప్రతిఘటన, సమానత్వానికై మహిళలు సాగిస్తున్న ఉద్యమం సామాజిక విముక్తికై జరిగే ఉద్యమంలో భాగమే.

5.14 యాభయేళ్ళ బూర్జువా భూస్వామ్య పాలన రాజ్యాధికారానికి సంబంధించిన అన్ని సంస్థలను తొలచివేసింది. పెట్టుబడిదారీ అభివృద్ధిని ప్రతిబింబిస్తూ అత్యంత కేంద్రీకృతమైన అధికార యంత్రాంగంపై ఆధారపడిన పాలనా వ్యవస్థ పెంపొందింది. అధికారం అత్యున్నత స్థాయిలో కేంద్రీకృతమైవుంది. ప్రజల నుంచి వేరుపడి, దోపిడీ వర్గాల ప్రయోజనాలకు విధేయంగా సేవ చేసే కులీన అధికారుల ద్వారా అది అమలవుతున్నది. అధికార యంత్రాంగం అపారంగా పెరగడం, పాలక వర్గాలతో దానికిగల బలమైన సంబంధాలు, అధికార యంత్రాంగంలో వచ్చి అవినీతి సమాజం యొక్క ప్రజాతంత్ర నిర్మాణాన్ని బలహీనపరిచే అంశాలుగా వున్నాయి.

5.15 న్యాయవ్యవస్థ మొగ్గు కార్మికులు, రైతులు ఇతర తరగతుల శ్రామిక ప్రజానీకానికి వ్యతిరేకంగా వుంది. సూత్ర రీత్యా ధనికులు, పేదలు సమానమైనప్పటికీ సారాంశంలో న్యాయవ్యవస్థ దోపిడీ వర్గాల ప్రయోజనాలకు సేవ చేస్తూ వారి వర్గపాలనను నిలబెడుతున్నది. న్యాయ వ్యవస్థను కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి పూర్తిగా వేరు చేయాలనే బూర్జువా ప్రజాస్వామ్య సూత్రం కూడా సంపూర్ణంగా పాటించబడకపోగా న్యాయ వ్యవస్థ కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావానికి, అదుపునకు గురి చేయబడుతున్నది. ప్రజాస్వామ్య సూత్రాలను, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను పరిరక్షించే తీర్పులు వచ్చిన సందర్భాలలో పాలక వర్గాలు వాటిని వమ్ము చేస్తున్నాయి. న్యాయమూర్తుల జవాబుదారీతనానికి హామీనిచ్చే ఎలాంటి సమర్థ యంత్రాంగం లేని స్థితిలో న్యాయ వ్యవస్థలో కొందరు అవినీతికి పాల్పడినట్లు వచ్చే వార్తలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి.

5.16 స్వతంత్ర భారతంలో సాయుధ బలగాల నిర్మాణ వ్యవస్థ ఇంకా వలస వారసత్వ ఛాయలు కలిగి వుంది. సైన్యం దేశ సరిహద్దులను రక్షించాల్సి వుండగా, పాలక వర్గాలు – తమ వర్గ ప్రయోజనాలకూ, దోపిడీకి గురయ్యే ప్రజల ప్రయోజనాలకూ మధ్య బహిరంగ ఘర్షణ ఏర్పడిన ప్రతిసారీ సైన్యం మీదా, పారా మిలటరీ దళాల మీదా మరింత ఎక్కువగా ఆధారపడుతున్నాయి. సైనిక బలగాలలోని సైనికులు రైతు, కార్మిక కుటుంబాల నుంచి వచ్చిన వారే. వారు చాలా కఠోరమైన విధులు నిర్వహించాలి. పాలకవర్గాలు ఈ బలగాల శ్రేణులను ప్రజల ప్రభావం సోకకుండా దూరంగా వుంచుతున్నాయి. వారి ప్రజాతంత్ర హక్కులు నిరాకరిస్తున్నాయి. పోలీసు బలగాలను ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా,

నిర్బంధానికి సాధనాలుగా ఉపయోగిస్తున్నారు. వారు రాజకీయ కుయుక్తులకు, అవినీతికి గురవుతూ అనేక ప్రదేశాలలో పేదలకు వ్యతిరేకమైన దోపిడీ యంత్రాంగంలో భాగమవుతున్నారు.

5.17 దేశం మొత్తం మీద కార్మిక వర్గం, రైతాంగం, మధ్యతరగతి వర్గాలతో పోలిస్తే – వారిని పాలిస్తూ, భూమి, పెట్టుబడి, అన్ని రకాల ఉత్పత్తి సాధనాలపై తమకు గల యాజమాన్యంతో వారిని దోపిడీని గురి చేస్తున్న బూర్జువా భూస్వామ్య వర్గాలు చిన్న మైనారిటీగా మాత్రమే వున్నాయి. పెట్టుబడిదారీ రాజ్యాధికారమూ, దాని ప్రభుత్వాలూ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో మెజారిటీ ఓట్లతోనే ఎన్నికైనప్పటికీ, అవి తమ రాజకీయ, ఆర్థిక సారాంశంలో మైనారిటీ అధికారానికే ప్రాతినిధ్యం వహిస్తాయి.

5.18 భారత రిపబ్లిక్ రాజ్యాంగం వయోజన ఓటు హక్కు ప్రాతిపదికన పార్లమెంట్‌ను ఏర్పరుస్తున్నది. ప్రజలకు కొన్ని ప్రాథమిక హక్కులు కల్పిస్తున్నది. ఈ హక్కులలో అనేకం రాజ్యాంగ యంత్ర అధినేతలచే వక్ర వ్యాఖ్యాలకు, వక్రీకరణలకు, ఉల్లంఘనలకు కూడా గురవుతున్నాయి. కార్మికులు, రైతులు, ఇతర ప్రజాతంత్ర జన బాహుళ్యం పోరాటాల విషయానికొస్తే ప్రాథమిక హక్కులు వారికి దాదాపుగా వర్తించవు. నెలలు, సంవత్సరాల తరబడి నిషేధాజ్ఞలు విధించడం ద్వారా లక్షలాది ప్రజలు నివసించే మొత్తం ప్రాంతాలు, ప్రదేశానికే సభా స్వాతంత్ర్యం నిరాకరించబడుతోంది. కార్మికులు, రైతులు, ఇతర ప్రజాతంత్ర జన బాహుళ్యం తమ రాజకీయ, ఆర్థిక హక్కులు, డిమాండ్ల పరిరక్షణకై పోరాడినప్పుడు – రాజ్యాంగ యంత్ర సాధనాలు మరీ ఆటవికంగా వారిపై హింసాకాండకు పాల్పడతాయి. విచారణ లేకుండా నిర్బంధించడానికి అవకాశమిచ్చే కర్కోటక చట్టాలు సర్వసాధారణమైనాయి. అలాగే రాజ్యాంగంలో జాతీయ ఎమెర్జెన్సీకై కల్పించిన నిబంధనలను దుర్వినియోగపరచడం, ప్రజాతంత్ర పోరాటాలను అణచివేసేందుకు ఆర్డినెన్స్‌లు జారీ చేయడం జరుగుతోంది. 1975లో విధించిన అంతర్గత ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి దాపురించిన ప్రమాదాలలో అత్యంత తీవ్రమైనది.

5.19 ప్రజాతంత్ర ఉద్యమం ఒత్తిడి ఫలితంగా ప్రభుత్వం పంచాయితీలు, స్థానిక సంస్థల వరకు అధికార వికేంద్రీకరణ చేస్తూ చట్టాలు చేసింది. మూడంచెల పంచాయితీ వ్యవస్థ వరకు అధికారాలు తీసుకుపోవడానికీ, అధికార వికేంద్రీకరణకూ పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర వామపక్ష ప్రభుత్వాలు ముఖ్యమైన చర్యలు

తీసుకున్నాయి. అయితే వామపక్ష పాలిత రాష్ట్రాలను మినహాయించితే పంచాయితీరాజ్ సంస్థలను ప్రజాస్వామ్య విస్తరణ కోసం ఉపయోగించడంగాక గ్రామ సీమల్లో భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, కాంట్రాక్టర్ల అధికారాన్ని కొనసాగించడానికే ఉపయోగించడం జరుగుతున్నది.

5.20 దశాబ్దాల బూర్జువా భూస్వామ్య పాలన భారత ప్రజల సాంస్కృతిక అభివృద్ధిని దెబ్బతీసింది. సంప్రదాయం, మతం పేరిట స్త్రీలను, దళిత కులాలను అవమానించే ప్రమాదకరమైన ఆచారాలు, విలువలు కొనసాగించబడుతున్నాయి. సాంస్కృతిక వారసత్వంలో ప్రగతిశీలమైన, ఆరోగ్యకరమైన అంశాలను మతతత్వ సిద్ధాంతవేత్తలు కించపరుస్తున్నారు. బూర్జువా సంస్కృతి ఛాందసవాద, కులతత్వ విలువలలో చాలా భాగం అట్టి పెట్టుకుంది. ప్రజల సాంస్కృతిక వికాసానికి దోహదపడటం అటుంచి అక్షరాస్యత విషయంలోనే ప్రభుత్వం ఘోర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పత్రికా, సభా, ప్రచార స్వాతంత్ర్యాలను దోపిడీ వర్గాలు, సామ్రాజ్యవాద సంస్థలు పూర్తిగా ఉపయోగించుకుంటున్నాయి. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, రేడియో, టి.వి. నెట్ వర్క్‌లలో వారి ప్రాబల్యమే సాగుతోంది. వారికిగల అపారమైన వనరులతో శ్రామిక ప్రజలు పోటీపడలేరు. ప్రతి ఒక్కరికి లాంఛనంగా ఇవ్వబడిన ఈ హక్కుల వినియోగంలో వారు అశక్తులవుతున్నారు.

5.21 నల్లధనం అపారంగా పెరిగిపోయిన నేపథ్యంలో బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్ర సాధనాలలో దిగజారుడు చోటు చేసుకుంటున్నది. నల్లధనం సమాజంలో విస్తరించి అంతులేని అవినీతికి ద్వారాలు తెరిచింది. ప్రభుత్వాధికారంలో ఉన్నవారు, అత్యున్నత స్థాయి అధికారులూ, బూర్జువా రాజకీయవేత్తలూ అవినీతి కూటమిలో భాగస్వాములయ్యారు. చట్టాన్ని వమ్ముచేసి, ప్రజా నిధుల లూటీకి ఆ కూటమి వీలుకల్పిస్తుంది. దీనివల్ల ప్రజాస్వామ్యం పౌరుల హక్కులు బూటకంగా మార్చబడుతున్నాయి. ఎన్నికలలో ధనబలం విపరీతంగా పెరగడం, రాజకీయాలు నేరమయం కావడం, పోలింగ్ కేంద్రాలలో రిగ్గింగ్, ఆక్రమణ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా తయారయ్యాయి.

5.22 అయినప్పటికీ సార్వత్రిక వయోజన ఓటింగ్, పార్లమెంటూ, రాష్ట్రాల శాసనసభలూ ప్రజాస్వామ్యం కోసం, తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు జరిపే పోరాటంలో వారికి సాధనాలుగా వినియోగపడతాయి. ఆంతరంగిక ఎమర్జెన్సీ వంటి రూపాలలో ప్రజాస్వామ్యంపై దాడి జరిగినపుడు ప్రజలు ఆ నిరంకుశ చర్యలను వ్యతిరేకించారు.

భారత్‌లోని ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థ బూర్జువా వర్గ పాలనకు ఒక రూపమే అయినప్పటికీ ప్రజల పురోగమనానికి ప్రతి రూపంగానూ ఉంది. ప్రజలు తమ ప్రయోజనాలను రక్షించుకోడానికీ, రాజ్య వ్యవహారాలలో కొంత వరకు జోక్యం కల్పించుకోవడానికీ, ప్రజాస్వామ్యం, సామాజిక ప్రగతికై పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికై వారిని సమీకరించడానికీ అది కొన్ని అవకాశాలు కల్పిస్తోంది.

5.23 శ్రామిక ప్రజల నుంచి, వారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీల నుంచి పార్లమెంటరీ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి ముప్పురాదు. ఆ ప్రమాదం దోపిడీ వర్గాల నుంచే వస్తుంది. పార్లమెంటరీ వ్యవస్థను తమ సంకుచిత ప్రయోజనాలను రక్షించుకొనే సాధనంగా చేయడం ద్వారా వారు ఆ వ్యవస్థను లోపలి నుంచి, బయటి నుంచి కూడా దెబ్బతీస్తారు. ప్రజలు తమ ప్రయోజనాలు సాధించుకొనేందుకు పార్లమెంటరీ వ్యవస్థను సాధనంగా చేసుకోవడం ప్రారంభించి బడాబూర్జువా, భూస్వాముల ప్రభావం నుంచి దూరంకాగానే ఈ వర్గాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాలరాచివేయడానికి వెనుకాడవు. అందుకే ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఎన్నోసార్లు రద్దు చేయడం జరిగింది. పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో అర్ధ ఫాసిస్టు బీభత్సకాండ, ఈ రాష్ట్రాల్లో రాజ్యాంగ సూత్రాలు నగ్నంగా ఉల్లంఘించడం పాలకవర్గాలు ఎంత విషపూరితంగా వ్యవహరిస్తాయనే దానికి సరైన ఉదాహరణలుగా ఉన్నాయి. అధ్యక్ష తరహా పాలనను చేపట్టడం గురించి మాట్లాడటం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడం నిరంకుశత్వ సూచనలు, సరళీకరణ విధానాలు, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి నుంచి పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఈ ధోరణులు ముదురుతున్నాయి. ప్రజల ప్రయోజనం కోసం అలాంటి ప్రమాదాల నుంచి పార్లమెంటరీ, ప్రజాస్వామ్య సంస్థలను కాపాడుకోవటం, పార్లమెంటరీయేతర కార్యకలాపాలతోపాటు ఆ సంస్థలను చాకచక్యంగా వినియోగించుకోవడం అత్యంత ప్రధానం.

# 6

# జనతా ప్రజాస్వామ్యం - దాని కార్యక్రమం

6.1 ప్రస్తుత బూర్జువా భూస్వామ్య పాలనలో ప్రజలకు వెనుకబాటుతనం, దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం, దోపిడీల నుంచి విముక్తి లభించే ఆశ లేదని అనుభవం చెబుతున్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బడా బూర్జువా వర్గం ఏకధాటిగా రాజ్యాధికారంలో కొనసాగుతున్నది. ఒక వైపున జనబాహుళ్యాన్ని పణంగా పెట్టి మరోవైపున సామ్రాజ్యవాదం, బడా భూస్వామ్య వర్గాలతో రాజీలు, బేరసారాలు నడిపి తన వర్గ స్థానాన్ని పటిష్టం చేసుకోవడానికి అది ఈ అధికారాన్ని ఉపయోగిస్తున్నది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడిదారీ విధానం పెరిగిన పరిస్థితివలెగాక భారతదేశంలో పెట్టుబడిదారీ పూర్వ సమాజంపై పెట్టుబడిదారీ సమాజం రుద్దబడింది. పెట్టుబడిదారీ పూర్వ సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయడం పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛాయుత అభివృద్ధికి తప్పనిసరి ముందు షరతు. అయినా తాము పాలించిన కాలంలో బ్రిటిష్‌వారుగాని, స్వాతంత్ర్యానంతరం అధికారం చేపట్టిన భారత బూర్జువా వర్గంగాని అందుకు పూనుకోలేదు. అందుకే ప్రస్తుత భారత సమాజం గుత్త పెట్టుబడిదారీ ప్రాబల్యంతో కుల, మత, గిరిజన వ్యవస్థలు కలగలిసిన విచిత్ర సంగమంగా వుంది. అందుకనే ప్రజాతంత్ర విప్లవ పరిపూర్తికి మార్గం సుగమం చేయడానికీ, సోషలిజానికి పరివర్తనకు భూమిక సిద్ధం చేయడానికీ వీలుగా పెట్టుబడిదారీ పూర్వ సమాజ విధ్వంసంపట్ల ఆసక్తిగల అన్ని ప్రగతిశీలశక్తులను ఐక్యం చేయవలసిన బాధ్యత కార్మికవర్గంపై, దాని పార్టీపైనా పడింది.

6.2 సోషలిజం, కమ్యూనిజాలను నిర్మించడమనే తన లక్ష్యానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), దృఢంగా కట్టుబడి వుంది. ప్రస్తుత బూర్జువా, భూస్వామ్య

రాజ్యం, బడాబూర్జువా నాయకత్వంలోని ప్రభుత్వాల ఆధ్వర్యంలో అది సాధించబడదనేది తేటతెల్లమవుతున్నది. కార్మికవర్గ రాజ్యవ్యవస్థ ఏర్పడినప్పుడు మాత్రమే నిజమైన సోషలిస్టు సమాజ స్థాపన సాధ్యమవుతుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మన దేశంలో సోషలిజాన్ని నిర్మించే లక్ష్యానికి కట్టుబడి వుంటూనే అదే సమయంలో ఆర్థికాభివృద్ధి స్థాయి, శ్రామికవర్గ రాజకీయ సైద్ధాంతిక పరిణతి, నిర్మాణ స్థితి పరిగణనలోకి తీసుకొని జనతా ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం తక్షణ లక్ష్యంగా ప్రజల ముందుంచుతున్నది. స్థిరమైన కార్మిక, కర్షక సంఘటన ప్రాతిపదికపై కార్మికవర్గ నాయకత్వంలోగల నిజమైన ఫ్యూడల్ వ్యతిరేక, గుత్త వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాతంత్ర శక్తుల సంఘటన పునాదిగా ఇది స్థాపించ బడుతుంది. ఇందుకోసం ముమ్మందుగా ప్రస్తుత బూర్జువా, భూస్వామ్య రాజ్యం స్థానే జనతా ప్రజాస్వామిక రాజ్యం స్థాపించాల్సి వుంటుంది. భారత విప్లవ అసంపూర్ణ కర్తవ్యాలను పూర్తి చేసి, దేశాన్ని సోషలిస్టు పథంలో పెట్టడానికి మార్గం సుగమం చేస్తుంది.

**జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం నిర్వహించే కర్తవ్యాలు, కార్యక్రమం ఇలా వుంటాయి :**

6.3 **రాజ్యాంగ యంత్ర స్వరూపానికి సంబంధించి :** దేశంలో నివసించే విభిన్న జాతుల నిజమైన సమానత్వం, స్వయం ప్రతిపత్తి ప్రాతిపదికగా భారత యూనియన్ సమైక్యతను పరిరక్షించేందుకూ, పెంపొందించేందుకూ కింద పేర్కొన్న విధంగా ఫెడరల్ ప్రజాతంత్ర రాజ్య వ్యవస్థను పెంపొందించేందుకూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కృషి చేస్తుంది.

**i)** ప్రజలే సర్వాధికారులు. రాజ్యాధికారానికి చెందిన అన్ని అంగాలూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. వయోజన ఓటింగ్, దామాషా ప్రాతినిధ్యం, వెనక్కు పిలిపించే హక్కు ప్రాతిపదికపై ఎన్నికైన ప్రజా ప్రతినిధుల సభకు రాజ్యాధికారాన్ని అమలు చేయడంలో అత్యున్నతాధికారం ఉంటుంది. అఖిల భారత కేంద్రంలో రెండు సభలు – ప్రజల సభ, రాష్ట్రాల సభ ఉండాలి. మహిళలకు తగు ప్రాతినిధ్యానికై హామీ కల్పించాలి.

**ii)** భారత యూనియన్‌లోని అన్ని రాష్ట్రాలకు నిజమైన స్వయం ప్రతిపత్తి, సమాన అధికారాలు వుండాలి. గిరిజన ప్రాంతాలు లేదా నిర్దిష్ట తెగకు

చెందినవారై, ప్రత్యేక సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులతో గుర్తింపు కలిగిన జనాభా వుండే ప్రాంతాలకు ఆయా రాష్ట్రాల పరిధిలోనే ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి కల్పించాలి. వాటి అభివృద్ధికి పూర్తి సహాయం అందాలి.

**iii)** రాష్ట్రస్థాయిలో ఎగువ సభలుండరాదు. పై నుంచి నియమించబడే గవర్నర్లుండకూడదు. అన్ని పాలనా సర్వీసులు ఆయా రాష్ట్రాలు లేదా స్థానిక సంస్థల ప్రత్యక్ష అదుపులో వుండాలి. రాష్ట్రాలు భారత పౌరులందరినీ ఒకే విధంగా చూడాలి. కులం, లింగం, మతం, తెగ, జాతీయత వగైరాల కారణంగా ఎలాంటి వివక్షత ఉండకూడదు.

**iv)** పార్లమెంటులోనూ, కేంద్ర పాలనలోనూ అన్ని జాతీయభాషల సమానత్వాన్ని గుర్తించాలి. పార్లమెంటు సభ్యుడు తమ జాతీయభాషలో మాట్లాడే హక్కు వుండాలి. దాన్ని అప్పటికప్పుడే ఇతర భాషల్లోకి అనువదించే ఏర్పాటు ఉండాలి. అన్ని చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, తీర్మానాలు అన్ని జాతీయ భాషల్లో అందుబాటులో వుండాలి. మిగిలిన అన్ని భాషలను పక్కనబెట్టి హిందీని ఏకైక అధికార భాషగా వినియోగించడం నిర్బంధం కాకూడదు. వివిధ భాషలకు సమానత్వం కల్పించడం ద్వారానే దాన్ని దేశమంతటా సమాచార సంబంధాల భాషగా ఆమోదించడం సాధ్యమవుతుంది. అప్పటి వరకు హిందీ, ఇంగ్లీషులను ఉపయోగించే ప్రస్తుత ఏర్పాటు కొనసాగాలి. ప్రజలు అత్యున్నత స్థాయి వరకు విద్యా సంస్థల్లో తమ మాతృభాషలో బోధన పొందే హక్కు తప్పనిసరిగా ఉంటుంది. ఒకానొక భాషా ప్రయుక్త రాష్ట్ర భాషను అన్ని స్థాయిల ప్రభుత్వ సంస్థల్లో పాలనా భాషగా వినియోగించే హక్కుకు హామీనివ్వాలి. మైనారిటీ లేదా మైనారిటీల భాషను లేదా అవసరమైన చోట ఒక ప్రాంతానికి చెందిన భాషను, రాష్ట్రానికి చెందిన భాషకు తోడుగా ఉపయోగించే అవకాశముండాలి. ఉర్దూభాషకు, లిపికి రక్షణ కల్పించాలి.

**v)** వివిధ రాష్ట్రాలు, ఆ రాష్ట్రాలలోని ప్రజల మధ్య ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడం ద్వారా భారత దేశ ఐక్యతను సంఘటిత పరిచేందుకు జనతా ప్రజాతంత్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొంటుంది. జాతులు, భాషలు, సంస్కృతుల వైవిధ్యాన్ని

గౌరవించి భిన్నత్వంలో ఏకత్వాన్ని బలోపేతం చేసే విధానాలు అనుసరిస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన, బలహీనంగా వున్న రాష్ట్రాలు, ప్రాంతాలు త్వరితగతిన తమ వెనుకబడిన తనాన్ని అధిగమించడానికిగాను ఆర్థికంగానూ, తదితర విధాలుగానూ సహాయాన్ని అందజేసేందుకు జనతా ప్రజాతంత్ర ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధను తీసుకుంటుంది.

**vi)** స్థానిక పరిపాలనారంగంలో, జనతా ప్రజాస్వామిక రాజ్యం, గ్రామస్థాయి నుంచి పై వరకు ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నికైన విస్తార స్థానిక సంస్థల సముదాయాన్ని ఏర్పాటు చేసేలా చూస్తుంది. వాటికి తగినన్ని అధికారాలు, బాధ్యతలు కల్పిస్తుంది. తగినన్ని ఆర్థిక వనరులు సమకూరుస్తుంది. స్థానిక సంస్థలు చురుగ్గా పని చేయడంలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తుంది.

**vii)** మన సామాజిక, రాజకీయ సంస్థలన్నింటిలో ప్రజాస్వామ్య స్ఫూర్తి నింపేందుకు జనతా ప్రజాస్వామిక రాజ్యం పాటుపడుతుంది. జాతీయ జీవితంలోని సకల అంశాల్లో ప్రజాతంత్ర రూపాల్లో చొరవను, అదుపును నెలకొల్పుతుంది. రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు, శ్రామిక ప్రజల, ఇతర వర్గ ప్రజా సంఘాలు ఈ విషయంలో ఒక కీలక పాత్ర నిర్వహిస్తాయి. దేశంలో శాసన, కార్యనిర్వాహక యంత్రాంగం ప్రజల ప్రజాతంత్ర కాంక్షలకు నిరంతరం స్పందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పాలనా యంత్రాంగంలో, రాజ్యం పనిలో ప్రజా బాహుళ్యం, వర్గ సంఘాలు చురుగ్గా పాల్గొనేలా హామీనిస్తుంది. రాజ్యాంగ యంత్రంలో పాలనా యంత్రాంగంలో నిరంకుశ అధికార పద్ధతుల నిర్మూలనకు అది కృషి చేస్తుంది.

**viii)** జనతా ప్రజాస్వామిక రాజ్యం నల్లడబ్బును వెలికితీస్తుంది. అవినీతిని నిర్మూలిస్తుంది. ఆర్థిక నేరాలకు, అవినీతి పద్ధతులకు పాల్పడే ప్రజా ప్రతినిధులను శిక్షిస్తుంది.

**ix)** న్యాయపాలనలో ప్రజాస్వామ్య మార్పులు ప్రవేశపెడుతుంది. సత్వర, సముచిత న్యాయానికి హామీ ఇస్తుంది. అవసరమైన వారికి ఉచిత న్యాయం,

సలహాలు సమకూర్చడం ద్వారా అలాంటి వారికి న్యాయపరమైన పరిష్కారం తేలిగ్గా అందే ఏర్పాటు చేస్తుంది.

**x)** జనతా ప్రజాతంత్ర ప్రభుత్వం సాయుధ దళాల సభ్యులలో దేశభక్తి, ప్రజాస్వామ్యం, ప్రజాసేనానిరతి స్ఫూర్తిని కలిగించుతుంది. వారికి మంచి జీవన ప్రమాణాలు, పని పరిస్థితులు, సాంస్కృతిక సదుపాయాలు, వారి పిల్లలకు విద్యావసతి కల్పిస్తుంది. దేహదారుఢ్యంగలవారంతా సైనిక శిక్షణ పొందేలా ప్రోత్సహించి, జాతీయ స్వాతంత్ర్యం, దాని పరిరక్షణ గురించిన భావన నింపేలా చూస్తుంది.

**xi)** పూర్తి పౌరహక్కులకు గ్యారంటీ కల్పిస్తుంది. వ్యక్తుల, నివాసుల హక్కులను అతిక్రమించదు. విచారణ లేకుండా వ్యక్తులను నిర్బంధించడం జరగదు. నిరాటంకమైన భావనా స్వేచ్ఛ, ఆరాధన, మత విశ్వాసాలు, వాక్, పత్రిక, సభ, సమ్మె స్వాతంత్రాలు, రాజకీయ పార్టీలు, సంఘాలుగా ఏర్పడేందుకు హక్కులు, సంచార స్వేచ్ఛ, వృత్తి స్వాతంత్ర్యం, అసమ్మతి తెలిపే హక్కులకు హామీ ఇస్తుంది.

**xii)** మతం, కులం, లింగం, జాతి తేడాలు లేకుండా ప్రతి పౌరుడికి పని హక్కు ప్రాథమిక హక్కుగా గ్యారంటీ చేస్తుంది. పౌరులందరికీ సమానహక్కులు కల్పిస్తుంది. మతం, కులం, లింగం, తెగ, జాతి భేదం లేకుండా అందరికీ సమాన పనికి సమాన వేతనం గ్యారంటీ చేస్తుంది. జీతాలు, ఆదాయాలలో విస్తార వ్యత్యాసాలను అంచెలంచెలుగా తగ్గించడం జరుగుతుంది.

**xiii)** ఒక కులంపై మరో కులం సాంఘిక అణచివేతకు పాల్పడినా, అస్పృశ్యత పాటించినా, ఏ రకమైన సాంఘిక వివక్షతకు పాల్పడినా చట్టం ద్వారా శిక్షిస్తుంది. షెడ్యూల్డ్ కులాలు, తెగలు ఇతర వెనుకబడిన తరగతుల వారికి ఉద్యోగాలు, ఇతర విద్యా సదుపాయాల విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది.

**xiv)** మహిళలకు వ్యతిరేకంగా సామాజిక అసమానతలు, వివక్షల తొలగింపు, భూమితో సహా ఆస్తి వారసత్వం వంటి అంశాల్లో పురుషులతో సమాన హక్కులు, అన్ని మతాల మహిళల సమాన హక్కులకు హామీ లభించేలా

రక్షణనిచ్చే సాంఘిక ఆర్థిక కుటుంబ చట్టాల అమలు, వృత్తులు, సర్వీసులలో ప్రవేశానికి హామీ. కుటుంబ నిర్మాణాన్ని ప్రజాతంత్రీకరించే చర్యలలో భాగంగా పిల్లల పెంపకంలో, ఇంటి పనిలో సహాయంగా వుండే అనువైన వ్యవస్థలు ఏర్పాటు చేస్తుంది.

**xv)** రాజ్యాంగ యంత్ర లౌకిక స్వభావానికి గ్యారంటీ కల్పిస్తుంది. మత సంస్థలు రాజ్య వ్యవహారాల్లో, దేశ రాజకీయ జీవితంలో తలదూర్చడాన్ని నిషేధిస్తుంది. మతపరమైన మైనారిటీలకు రక్షణ కల్పిస్తుంది. వారిపట్ల వివక్షను నిషేధిస్తుంది.

**xvi)** అన్ని స్థాయిలలో సమగ్రమైన శాస్త్రీయ విద్యను అందించేందుకు వీలుగా పబ్లిక్ విద్యా విధానం పెంపొందించబడుతుంది. సెకండరీ దశ వరకు ఉచిత, నిర్బంధ విద్యనూ, విద్య లౌకిక స్వభావాన్నీ గ్యారంటీ చేస్తుంది. ఉన్నత విద్యను, వృత్తి విద్యను ఆధునీకరించడం, తాజాపరచడం జరుగుతుంది. అన్ని రకాలయిన పరిశోధన అభివృద్ధి సంస్థల ద్వారా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయబడుతుంది. క్రీడా కార్యకలాపాల అభివృద్ధికై సమగ్ర క్రీడా విధానం చేపట్టబడుతుంది.

**xvii)** ఉచిత ఆరోగ్య, ఔషధ, వైద్య, ప్రసూతి సేవల విస్తారమైన యంత్రాంగాన్ని నెలకొల్పుతుంది. పిల్లల కోసం నర్సరీలు, క్రెచ్‌లు; పని చేసే ప్రజల కోసం విశ్రాంతి గృహాలు, వినోద కేంద్రాలు; వృద్ధాప్య పింఛన్లు గ్యారంటీ చేస్తుంది. కుటుంబ నియంత్రణ గురించి స్త్రీ పురుషులలో చైతన్యం పెంపొందించే విధంగా బలప్రయోగ రహితమైన జనాభా విధానాన్ని జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

**xviii)** వాతావరణ పరిరక్షణకు సమగ్ర చర్యలు తీసుకుంటుంది. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సమయంలో పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన అవసరం దృష్టిలో ఉంచుకుంటుంది. దేశంలోని జీవ వైవిధ్యం, జీవసంపద సామ్రాజ్యవాద దోపిడీ నుంచి కాపాడబడతాయి.

**xix)** పూర్తి స్థాయి పౌరులుగా జీవిస్తూ సమాజంలో సంలీనమయ్యేందుకు వికలాంగులకుగల హక్కులకు పూచీ వుంటుంది. వయోవృద్ధులు గౌరవంగా జీవించే హక్కును రాజ్యం గట్టిగా కాపాడుతుంది. మొత్తంపైన

ప్రాథమిక హక్కులుగా పరిగణించబడే సాంఘిక హక్కులు జనతా ప్రజాస్వామికంలో ఒక మౌలిక సూత్రంగా వుంటాయి.

**xx)** ప్రజాస్వామ్య, లౌకిక దృక్పథంగల నూతన ప్రగతిశీల ప్రజా సంస్కృతిని పెంపొందించేందుకుగాను మన ప్రజల సృజనాత్మక నైపుణ్యాన్ని జనతా ప్రజాస్వామ్య రాజ్యం ప్రభుత్వం పెంపొందిస్తాయి. ప్రజల భౌతిక, సాంస్కృతిక జీవితాలను సుసంపన్నం చేసేందుకై సాహిత్యం, కళలు, సంస్కృతుల, సృజన, వికాసాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటాయి. ప్రజలు కుల, లైంగికపరమైన దురభిప్రాయాలు, మతపరమైన పొరపాటు భావనల నుండి, అంధ విధేయత, విశ్వాసాల భావనల నుండి బయటపడటానికి అది సహాయపడుతుంది. శాస్త్రీయ దృష్టిని ప్రోత్సహిస్తుంది. మొత్తంగా దేశంలోని ప్రజాతంత్ర ప్రజానీకం ఉమ్మడి ఆకాంక్షలకు అనుగుణమైన రీతిలో తమ ప్రత్యేక భాష, సంస్కృతి, జీవన విధానాలను పెంపొందించుకునేందుకు గిరిజనులతో సహా ప్రతి భాషా జాతికి సహాయపడుతుంది. అన్ని దేశాల ప్రజలతో సౌహార్ద భావనను అది పెంపొందించుతుంది. జాతి దురహంకార, విద్వేషాలను పారద్రోలుతుంది.

**xxi)** ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రజాప్రసార వ్యవస్థకు ప్రాధాన్యతనిస్తూ మీడియా అభివృద్ధి పరచబడ్తుంది. ప్రైవేట్ హస్తాల్లో మీడియా కేంద్రీకరణ, భారతీయ, మీడియా ఆస్తులపై విదేశీ యాజమాన్యం అనుమతించబడదు. ప్రజాతంత్ర అదుపు, జవాబు దారీతనాలకు హామీనివ్వబడుతుంది.

6.4 **రైతాంగం – వ్యవసాయ రంగాల్లో** : జనాభాలో 70 శాతం పైగా గ్రామాలలో నివసించే భారతదేశం వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ కలిగి వుంది. అందుకే వ్యవసాయాభివృద్ధి, రైతాంగ జీవన ప్రమాణాల పెంపుదల ఆర్థిక వ్యవస్థ సమగ్రాభివృద్ధిక కీలకం.

**జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం ఈ లక్ష్యసాధనకై**

**i)** మౌలిక భూసంస్కరణలు అమలు జరిపి భూస్వామ్య విధానాన్ని నిర్మూలిస్తుంది. వ్యవసాయ కార్మికులు, పేద రైతులకు భూమి ఉచితంగా అందజేస్తుంది.

ii) వడ్డీ వ్యాపారులకు, భూస్వాములకు పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, చిన్న చేతివృత్తిదారులు ఇవ్వాల్సిన రుణాలను రద్దు చేస్తుంది.

iii) బడా వ్యాపారులు, బహుళజాతి సంస్థల నుంచి, ధరలలో తీవ్రమైన ఎగుడు దిగుళ్ళ నుంచి రైతాంగాన్ని రక్షించేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ వ్యవస్థను పెంపొందిస్తుంది. రైతులు, చేతివృత్తిదారులకు దీర్ఘకాలిక, సులభ పరపతి లభించేట్లు చేస్తుంది. వ్యవసాయోత్పత్తులకు న్యాయమైన ధరలు కల్పిస్తుంది.

iv) నీటిపారుదల, విద్యుచ్ఛక్తి సదుపాయాలను గరిష్టంగా పెంపొందిస్తుంది. అని సక్రమంగా సమానంగా వినియోగం జరిగేలా చూస్తుంది. వ్యవసాయరంగంలో దేశీయ పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. రైతాంగం ఉత్పాదకత పెంచేందుకుగాను మేలిరకం విత్తనాల, ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం ద్వారా వారు మెరుగైన సేద్యపు పద్ధతులు పాటించేందుకు సహకరిస్తుంది.

v) వ్యవసాయ కార్మికులకు తగు వేతనాలు, సాంఘిక సంక్షేమ చర్యలు, జీవన పరిస్థితులు కల్పిస్తుంది.

vi) వ్యవసాయం, ఇతర సేవల నిమిత్తం స్వచ్ఛంద ప్రాతిపదికపై రైతులు, చేతివృత్తిదారుల సహకార సంఘాలను పెంపొందిస్తుంది.

vii) ప్రజలకు ఆహార ధాన్యాలు, ఇతర నిత్య జీవితావసర సరుకులు చౌకగా అందించేందుకు ఒక సమగ్ర ప్రజా పంపిణీ వ్యవస్థను నెలకొల్పుతుంది.

6.5 భారత్ ఒక పెద్ద దేశం. దీనిలో ఆర్థికాభివృద్ధి, సామాజిక ఆర్థిక నమూనాలు రకరకాల స్థాయిల్లో వున్నాయి. అందుకే ఆర్థిక వ్యవస్థ శీఘ్రాభివృద్ధికి ప్రజల జీవన పరిస్థితులు స్థిరంగా అభివృద్ధి చెందడానికి ఉత్పాదక శక్తుల సత్వరాభివృద్ధి తప్పనిసరి. అందుకోసం ప్రజల యాజమాన్యం ద్వారా ఆర్థిక వ్యవస్థ కీలకరంగాలలో జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం నిర్ణయాత్మక పాత్ర నిర్వహించాలి. రాజ్యం ఇతర రంగాలలో నియంత్రణ, మార్గదర్శక పాత్ర నిర్వహించాలి. జనతా ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ వివిధ రకాల యాజమాన్యాలతో బహుళరూపాలలో వుంటుంది. ఇందులో ప్రభుత్వ రంగానికి ఆధిపత్య పాత్ర ఉంటుంది. ప్రపంచ

ఆర్థిక వ్యవస్థలో వచ్చిన పెనుమార్పుల దృష్ట్యా విదేశాల నుంచి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ అదే సమయంలో తన స్వావలంబన పునాదిని బలోపేతం చేసుకోవడానికి దృఢంగా కృషి చేస్తుంది.

6.6 **పరిశ్రమలు, కార్మికుల రంగంలో** : రైతాంగానికి కొనుగోలుశక్తి చాలా తక్కువగా ఉండటంవల్లనేగాక గుత్త సంస్థల ఉక్కు పట్టువల్ల, విదేశీ పెట్టుబడి ఎక్కువెక్కువగా చొరబడుతుండటంవల్ల, దాదాపుగా అన్ని ఉత్పత్తి రంగాల్లోనూ సామ్రాజ్యవాద ఏజెన్సీలు పలు రూపాల్లో ప్రాబల్యం వహించడంవల్ల కూడా మన పరిశ్రమలు దెబ్బతింటున్నాయి. గుత్త సంస్థల చేతుల్లో ఆస్తులు కేంద్రీకృతం కావడంవల్ల ఆర్థికాభివృద్ధి వక్రీకరించబడి, తీవ్రస్థాయి అసమానతలు పెంపొందుతున్నాయి. విదేశీ పెట్టుబడిపై పరాధీనత, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలవల్ల దోపిడీకి వీలుకలుగుతోంది. ప్రజల అవసరాలు అందుకోలేని వక్రరూప అభివృద్ధి జరుగుతున్నది.

**అందుకే పారిశ్రామికరంగంలో జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం :**

**i)** వివిధ పారిశ్రామిక, ద్రవ్య, వాణిజ్య, సర్వీసు రంగాలలో భారతీయ, విదేశీ గుత్త సంస్థలను నిర్మూలించేందుకు వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలతో సహా అన్ని రకాల చర్యలూ తీసుకుంటుంది.

**ii)** ఆధునీకరణ, ప్రజాస్వామీకరణ ద్వారానూ, అధికార యంత్రాంగం అదుపాజ్ఞల నుంచి, అవినీతి నుంచి విముక్తి కల్పించడం ద్వారానూ ప్రభుత్వరంగ పరిశ్రమలను బలోపేతం చేస్తుంది. కచ్చితమైన జవాబుదారీతనం ఏర్పాటు చేస్తుంది. యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పిస్తుంది. ఈ చర్యల ద్వారా వాటి పోటీ స్వభావాన్ని పెంచి ఆర్థిక వ్యవస్థలో అవి నిర్ణయాత్మక స్థానానికి చేరుకునేలా చేస్తుంది.

**iii)** అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సంపాదించడానికి, ఉత్పాదక సామర్థ్యం మెరుగుపరుచుకోవడానికిగాను ఎంపిక చేసిన రంగాలలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తుంది. మొత్తం ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఫైనాన్స్ పెట్టుబడి రాకను నియంత్రిస్తుంది.

**iv)** చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పరపతినీ, సరసమైన ధరలకు ముడి సరుకులనూ అందించడం ద్వారా సహాయ పడుతుంది. మార్కెటింగ్ సదుపాయాలకు సంబంధించి తోడ్పాటునిస్తుంది.

**v)** దేశం సమతుల్యమైన, ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి సాధించేందుకై ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలను, మార్కెట్‌ను నియంత్రించి సమన్వయ పరుస్తుంది. విదేశీ వాణిజ్యాన్ని నియంత్రిస్తుంది.

కార్మికుల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచేందుకై క్రింది చర్యలు తీసుకుంటుంది. (అ) జీవనానికి అవసరమైన వేతన నిర్ణయం (ఆ) పని గంటలు క్రమంగా తగ్గింపు (ఇ) అన్ని రకాల అంగ వైకల్యాలు, నిరుద్యోగాల నుంచి రక్షణకు సాంఘిక బీమా (ఈ) కార్మికులకు గృహవసతి (ఉ) రహస్య బ్యాలెట్ ద్వారా కార్మిక సంఘాల గుర్తింపు, బేరసారాల హక్కు, అలాగే సమ్మె హక్కు (ఊ) బాల కార్మిక వ్యవస్థ నిషేధం.

**vii)** కార్మికులు, రైతులు, చేతివృత్తిదార్లకు పన్నుల నుంచి గరిష్ట ఉపశమనం కలిగిస్తుంది. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యంలో పైకిపోయే కొద్దీ పెరిగే (గ్రేడెడ్) పన్ను పద్ధతి ప్రవేశపెడుతుంది. సామాన్య ప్రజలకు ప్రయోజనకరమైన ధరల విధానాన్ని సమర్థంగా అమలు జరుపుతుంది.

6.7 **విదేశాంగ విధానంలో** : ప్రపంచ శాంతి పరిరక్షణ కోసమూ, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగానూ భారతదేశం తన న్యాయమైన పాత్ర పోషించేలా చూడటానికి, అంతర్జాతీయ సంబంధాల ప్రజాస్వామీకరణకుగాను జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం క్రింది చర్యలు తీసుకుంటుంది :

**i)** స్నేహ, సహకారాల ప్రాతిపదికన అన్ని దేశాలతో సంబంధాలు పెంపొందించుకుంటుంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలతో సంఘీభావాన్ని, సంబంధాలను బలోపేతం చేస్తుంది. పేద దేశాల మధ్య సంబంధాలను పెంపొందిస్తుంది. సామ్రాజ్యవాద దేశాల ప్రాబల్యాన్ని తిప్పి కొట్టేందుకుగాను అలీనోద్యమాన్ని తిరిగి జాగృతం చేసేందుకు కృషి చేస్తుంది.

**ii)** సోషలిస్టు దేశాలతోనూ, అన్ని శాంతికాముక దేశాలతోనూ స్నేహ సంబంధాలు, సహకారం పెంచుకుంటుంది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం జరిగే అన్ని పోరాటాలకూ మద్దతునిస్తుంది.

**iii)** అణుయుద్ధ ప్రమాదాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తుంది. విశ్వవ్యాప్త అణునిరాయుధీకరణకు, జనసంహారకాలైన అన్ని రకాల అణు, రసాయన, జీవ ఆయుధాల నిర్మూలనకు, వాటి పరీక్షలను, ఉత్పత్తిని నిషేధించేందుకు కృషి చేస్తుంది. అణు సైనిక స్థావరాల నిర్మూలనకు డిమాండ్ చేస్తుంది. జీవావరణ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత రక్షణ కోసం అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందిస్తుంది.

**iv)** భారత సరిహద్దు దేశాలైన పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, శ్రీలంక బర్మాలతో ప్రస్తుత విభేదాలు, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించేందుకు, స్నేహసంబంధాలు బలోపేతం చేసుకునేందుకు ప్రత్యేకమైన నిరంతర ప్రయత్నం చేస్తుంది. దక్షిణాసియా సహకారాన్ని పెంపొందిస్తుంది.

# 7

# జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మాణం

7.1 భారత విప్లవ మౌలిక కర్తవ్యాలను సంపూర్ణంగా, సమగ్రంగా అమలు జరిపేందుకుగాను ప్రస్తుత దశలో బడా బూర్జువా వర్గ నాయకత్వంలో ఇప్పుడున్న బూర్జువా భూస్వామ్య రాజ్యం స్థానే కార్మికవర్గ నాయకత్వంలోని జనతా ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించడం తప్పనిసరి అవసరం.

7.2 ప్రస్తుత దశలో మన విప్లవం ప్రధానంగా ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, గుత్త వ్యతిరేక ప్రజాతంత్ర స్వభావం కలిగి వుంటుంది. మన విప్లవ దశ, దాన్ని సాధించడంలో వివిధ వర్గాలు నిర్వహించే పాత్రను కూడా నిర్దేశిస్తుంది. ప్రస్తుత యుగంలో సోషలిజం సాధన దిశగా ముందుకు సాగేందుకుగాను కార్మికవర్గం తప్పనిసరిగా ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించవలసి వుంటుంది. ఇది కార్మికవర్గం నిర్మించి, నడిపించే నూతన తరహా జనతా ప్రజాస్వామిక విప్లవమేగాని పాత తరహా బూర్జువా ప్రజాతంత్ర విప్లవం కాదు.

7.3 జనతా ప్రజాస్వామిక విప్లవ ప్రథమ, ప్రప్రధాన కర్తవ్యం మౌలిక భూసంస్కరణలు అమలుజరపడం. మన వ్యవసాయం అలాగే పరిశ్రమలో ఉత్పాదక శక్తులపై ఫ్యూడల్, అర్ధఫ్యూడల్ అవశేషాల శృంఖలాలను పూర్తిగా వదిలించడానికి ఇది అవసరం. పెట్టుబడిదారీ పూర్వ సమాజ అవశేషాలైన కులం తదితర సామాజిక వ్యవస్థల ద్వారా గ్రామాలను తరతరాల వెనుకబాటుకు కట్టివుంచుతున్న సామాజిక వ్యవస్థను సంస్కరించేందుకు సమూలమైన చర్యలను దీంతోపాటే అమలు చేయాలి. ఈ కర్తవ్యం వ్యవసాయక విప్లవంతో విడదీయలేనంతగా ముడిపడి ఉంది. నిజానికి వ్యవసాయక విప్లవం జనతా ప్రజాస్వామిక విప్లవానికి ఇరుసువంటిది. రెండవ తక్షణ కర్తవ్యం, మన ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితాన్ని సామ్రాజ్యవాద

వినాశకర ప్రభావం నుంచి బహుళజాతి కంపెనీలు, అనేక అంతర్జాతీయ గుత్త పెట్టుబడి ఏజెన్సీల ప్రాబల్యం నుంచి విముక్తి చేయడం. గుత్త పెట్టుబడి పట్టును బద్దలుగొట్టాల్సిన కర్తవ్యం కూడా దీనితో ముడివడి వుంది.

7.4 ఏమైనప్పటికీ బడా బూర్జువా వర్గానికీ, రాజ్యంలో ప్రముఖ స్థానాల్లో వున్న దాని రాజకీయ ప్రతినిధులకూ దృఢమైన వ్యతిరేకత తెలపకుండా వారికి వ్యతిరేకంగా పోరాడకుండా నేటి సందర్భంలో ఈ మౌలిక, ప్రాథమిక విప్లవ కర్తవ్యాలను నెరవేర్చటం సాధ్యంకాదు. తమ వర్గాధిపత్యాన్ని పెంచుకునేందుకై వారు భూస్వామ్య విధానంతో చేతులు కలిపారు. విదేశీ గుత్త పెట్టుబడిని కాపాడేందుకు, అది మరింతగా చొరబడటానికి వీలు కల్పించేందుకు వారు తమ రాజ్యాధికారాన్ని వినియోగిస్తున్నారు. అంతేగాక విదేశీగుత్త పెట్టుబడిదారులతో రాజీ, మిలాఖత్ నెరిపే తమ విధానాలు, భారతీయ భూస్వాములతో కలయికకుతోడు పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాను గట్టిగా అమలు జరుపుతున్నారు. అది తిరిగి దేశీయ గుత్త పెట్టుబడి పెరగడానికి ఎంతగానో వీలు కల్పిస్తుంది. బడా బూర్జువా వర్గం రాజ్యానికి నాయకత్వం వహిస్తూ విదేశీ ఫైనాన్స్ పెట్టుబడితో రాజీ, మిలాఖత్ విధానాలు అనుసరిస్తూ, భూస్వామ్య విధానంతో కలిసి వ్యవహరిస్తుంది. అందుకే జనతా ప్రజాస్వామిక విప్లవం భూస్వామ్య విధానం, విదేశీ గుత్త పెట్టుబడిదారీ విధానాలపట్ల తిరుగులేని వ్యతిరేకత కలిగివుండటమేగాక, వాటితోపాటు బడా బూర్జువా వర్గాన్ని కూడా వ్యతిరేకిస్తుంది.

7.5 కార్మికవర్గం దాని రాజకీయ పార్టీ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వంలో మినహా జనతా ప్రజాస్వామిక విప్లవం జయప్రదంగా నిర్మించడం, విజయం సాధించడం సాధ్యంకాదు. చారిత్రికంగా ఆధునిక సమాజంలో కార్మికవర్గం మినహా మరే వర్గం ఈ పాత్ర నిర్వహించగల స్థితిలో లేదు. మన కాలపు మొత్తం అనుభవం ఈ వాస్తవానికి ప్రబల నిదర్శనంగా వుంది.

7.6 జనతా ప్రజాస్వామిక విప్లవానికి కీలకం, పునాది–కార్మిక, కర్షక వర్గాల దృఢమైన సంఘటన, జాతీయ స్వాతంత్ర్యాన్ని రక్షించడంలోనూ, దీర్ఘకాలిక ప్రజాస్వామిక పరివర్తనలు సాధించడంలోనూ, సర్వతోముఖ సామాజిక ప్రగతి సాధించడంలోనూ ఈ సంఘటనే అత్యంత ప్రధానమైన శక్తి, విప్లవాన్ని సాగించడంలో ఇతర వర్గాలు నిర్వహించే పాత్ర కార్మిక, కర్షక కలయిక, బలం, స్థిరత్వంపై కీలకంగా ఆధారపడి వుంటుంది.

7.7 వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం లోతుగా చొరబడిన ఫలితంగా రైతాంగంలో స్పష్టమైన విభజన ఏర్పడింది. ఆ విభిన్న తరగతులు విప్లవంలో వేర్వేరు పాత్రలు నిర్వహిస్తాయి. గ్రామీణ కుటుంబాలలో అత్యధికంగా ఉన్న వ్యవసాయ కార్మికులూ పేద రైతులూ – భూస్వాముల, పెట్టుబడిదారుల నిర్దాక్షిణ్య దోపిడీకి గురవుతున్నారు. వారు కార్మికవర్గ మౌలిక మిత్రులుగా వుంటారు. మధ్యతరగతి రైతాంగం కూడా దోపిడీదారీ పెట్టుబడి యొక్క; గ్రామాల్లోని ఫ్యూడల్, పెట్టుబడిదారీ భూస్వాముల, బహుళజాతి సంస్థల చెప్పుచేతల్లో వుండే పెట్టుబడిదారీ మార్కెట్ యొక్క చెలగాటాలకు అనేక విధాల గురవుతున్నారు. గ్రామీణ జీవితంలో భూస్వామ్య ప్రాబల్యం వారి సామాజిక స్థితిని అనేక విధాల ప్రభావితం చేయడంవల్ల వారు జనతా ప్రజాస్వామిక విప్లవంలో విశ్వసనీయ మిత్రులుగా వుంటారు.

7.8 రైతాంగంలో ధనిక రైతాంగం ఒక పలుకుబడిగల భాగం. బూర్జువా భూస్వామ్య విధానాలు నిస్సందేహంగా వారిలో కొంత మందికి లాభం కలిగించాయి. స్వాతంత్ర్యానంతర ప్రభుత్వాల హయాంలో కూడా వారు బాగుపడ్డారు. వారి పొలాల్లో వ్యవసాయ కార్మికులను కూలిపనికి పెట్టుకుంటారు కనుక వారు పెట్టుబడిదారీ భూస్వామ్యవర్గంలో చేరడానికి సుముఖంగా వుంటారు. అయితే నిరంతర ధరల హెచ్చుతగ్గులు, గుత్త వ్యాపారుల బహుళజాతి సంస్థల పట్టులో వున్న మార్కెట్ ఒడిదుడుకులకు గురై వారు బూర్జువా భూస్వామ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముందుకొస్తారు. కొన్ని మలుపుల్లో వారిని కూడా జనతా ప్రజాస్వామిక విప్లవంలోకి తీసుకొని రావచ్చు. ఊగిసలాట స్వభావం వున్నా జనతా ప్రజాస్వామిక విప్లవంలో వారు ఒక పాత్ర నిర్వహించవచ్చు.

7.9 పెట్టుబడిదారీ భూస్వామ్య పాలనలో పట్టణ, గ్రామీణ మధ్యతరగతి వర్గాలు ఉభయులూ నష్టపోతారు. పెద్ద సంఖ్యలో వుండే మధ్య తరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వృత్తినిపుణులు, ఇంజనీర్లు, డాక్టర్లు నూతన మేధావి సెక్షన్లూ ఒక గణనీయమైన, పలుకుపడి చూపగల తరగతిగా వున్నారు. పెట్టుబడిదారీ విధానం మరింత అభివృద్ధి చెందడంవల్ల, సరళీకరణ విధానాలవల్ల మధ్యతరగతి వర్గాల్లో వ్యత్యాసాలు తీవ్రమయ్యాయి. వారిలో ఒక పై పొర ప్రయోజనం పొందింది. ఇది తక్కిన మధ్యతరగతి వర్గం దృక్పథంలో ఏకీభవించదు. ఏమైనప్పటికీ ఈ తరగతిలో అధిక భాగం మధ్యతరగతి వర్గం దృక్పథంతో ఏకీభవించదు. ఏమైనప్పటికీ ఈ తరగతిలో అధిక భాగం ఎప్పటికప్పుడు పెరిగే జీవితావసర వస్తువుల ధరలు, రాజ్యం విధించే మితిలేని పన్ను భారాలు, తీవ్ర నిరుద్యోగ సమస్య, కనీస జీవన సదుపాయాల కొరత వంటి సమస్యలకు

గురవుతున్నారు. ఈ తరగతి జనతా ప్రజాస్వామిక విప్లవంలో మిత్రునిగా వుండగలదు, వుంటుంది. వారిని విప్లవం వైపు తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు జరగాలి. ఈ తరగతిని ప్రజాస్వామ్య ప్రయోజనాల కోసం సమీకరించడంలో ప్రగతిశీల మేధావుల పాత్ర చాలా కీలకమైనది.

7.10 ఒక వర్గంగా భారత బూర్జువా వర్గానికి సామ్రాజ్యవాదంతోనూ, అలాగే ఫ్యూడల్, అర్ధ ఫ్యూడల్ గ్రామీణ వ్యవస్థతోనూ ఘర్షణలూ, వైరుధ్యాలూ ఉన్నాయి. అయితే పెద్ద, గుత్త వర్గం స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాధికారంపై తన పట్టును ఉపయోగించుకొని ఈ ఘర్షణలను, వైరుధ్యాలను రాజీలు, ఒత్తిళ్ళు, బేరసారాల ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలో అది భూస్వాములతో అధికారం పంచుకుంటున్నది. అది స్వభావ రీత్యా ప్రజా వ్యతిరేకమైంది, కమ్యూనిస్టు వ్యతిరేకమైంది. జనతా ప్రజాస్వామిక సంఘటనను, దాని విప్లవ లక్ష్యాలను గట్టిగా వ్యతిరేకిస్తుంది.

7.11 గుత్తేతరమైన బడాయేతర బూర్జువా వర్గం–బడా బూర్జువా వర్గం నుంచీ, విదేశీ బహుళజాతి సంస్థల నుంచీ అనేక రూపాలలో అసమాన పోటీ నెదుర్కొంటోంది. పెట్టుబడిదారీ సంక్షోభం, బహుళజాతి సంస్థలు నిరాఘాటంగా ప్రవేశించడంవల్ల వారికి విదేశీ పెట్టుబడికీ మధ్య వైరుధ్యాలు తీవ్రమవుతాయి. తన ఆర్థిక శక్తిని, రాజ్యాంగ యంత్రంలో ప్రముఖ స్థానాన్ని ఉపయోగించుకొని బడా బూర్జువా వర్గం తన బలహీన వర్గ సోదరులను పణంగా పెట్టి ఈ సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తుంది. దీంతో బూర్జువా వర్గంలోని ఈ తరగతి రాజ్యాధికారానికి వ్యతిరేకంగా రంగంలోకి రావలసిన స్థితికి నెట్టబడి, జనతా ప్రజాస్వామిక సంఘటనలో స్థానం పొందగలుగుతుంది. అయితే వారు ఇంకా బడా బూర్జువా వర్గంతో కలిసి అధికారం పంచుకుంటున్నారనీ దృష్టిలో పెట్టుకోవాలి. వాస్తవికంగా ప్రగతిశీల పాత్ర కలిగి వున్నా భారతీయ బడా బూర్జువా వర్గంతోనూ, సామ్రాజ్య వాదంతోనూ పోల్చినపుడు వర్గరీత్యా బలహీనంగా వున్న దృష్ట్యా అది అస్థిరంగా వుంటుంది. ఒకవైపున బడా బూర్జువా వర్గానికీ, విదేశీ పెట్టుబడులకూ, మరో వైపున జనతా ప్రజాస్వామిక సంఘటనకు మధ్య ఊగిసలాట కనబరుస్తుంది. ఈ ద్వంద్వ స్వభావం కారణంగా అస్థిరమిత్రునిగానైనా విప్లవంలో అది పాల్గొనడం అనేక నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. వర్గ శక్తుల పొందికలో మార్పులు, సామ్రాజ్యవాదం భూస్వామ్య విధానాలకు ప్రజలకు మధ్య వైరుధ్యం తీవ్రత, బడా బూర్జువా నాయకత్వంలోని రాజ్యానికి, మిగిలిన తరగతుల

బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యం వంటి అనేక అంశాలపై ఇది ఆధారపడి వుంటుంది.

7.12 వారి సమస్యలపై జాగ్రత్తగా, నిర్దిష్టంగా అధ్యయనం చేయడం ద్వారా వారిని ప్రజాస్వామిక సంఘటన వైపు ఆకర్షించేందుకు అన్ని ప్రయత్నాలూ జరగాలి. భారత గుత్తాధిపతులకు, విదేశీ సామ్రాజ్యవాద పోటీదార్లకు వ్యతిరేకంగా వారు చేసే అన్ని పోరాటాలకు మద్దతు అందించేందుకు లభించే ఏ అవకాశాన్నీ కార్మికవర్గం వదులుకోరాదు.

7.13 జనతా ప్రజాస్వామిక విప్లవ సాధనకై జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మించాల్సిన ప్రాథమిక కర్తవ్యాన్ని కార్మికవర్గం, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఒక్క క్షణం కూడా విస్మరించవు. బడా బూర్జువా వర్గ నాయకత్వంలోని ప్రస్తుత భారత రాజ్యాంగ యంత్రంతో తాము ఘర్షణ పడటం అనివార్యమని గుర్తిస్తూనే అదే సమయంలో బడా బూర్జువా వర్గంతో సహా భారత బూర్జువా వర్గానికి విదేశీ సామ్రాజ్యవాదానికి మధ్యగల వైరుధ్యాలూ, ఘర్షణలను గమనంలోకి తీసుకుంటాయి. బహుళజాతి సంస్థలు, విదేశీ ద్రవ్య పెట్టుబడి నిర్నిరోధ ప్రవేశానికి ద్వారాలు తెరవటం ఈ వైరుధ్యాన్ని తీవ్రం చేస్తుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఈ అంశాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తూ అదే సమయంలో అలాంటి ప్రతి విభేదాన్ని, ఒత్తిళ్ళను, ఘర్షణను, వైరుధ్యాన్ని ఉపయోగించుకోవడానికి కృషి చేస్తుంది. సామ్రాజ్యవాదులను ఒంటరులను చేసి ప్రజాతంత్ర పురోగమనానికి ప్రజా పోరాటాలను బలోపేతం చేయడానికి పాటుపడుతుంది. దేశ ప్రయోజనాలకు అనుగుణమైన, ప్రపంచ శాంతి, సామ్రాజ్యవాద వ్యతిరేకతకు సంబంధించిన అన్ని సమస్యలపైనా, సామ్రాజ్యవాదంతో ఘర్షణపడే అన్ని ఆర్థిక రాజకీయ సమస్యలపైనా, మన సార్వభౌమత్వాన్ని స్వతంత్ర విదేశాంగ విధానాన్ని దృఢతరం చేసుకోవడానికి సంబంధించిన అన్ని సమస్యలపైనా ప్రభుత్వానికి అరమరికలులేని మద్దతునివ్వడానికి కార్మికవర్గం వెనుకాడదు.

7.14 స్వాతంత్ర్యానంతరం కూడా అభివృద్ధి నిరోధక, విప్లవ ప్రతీఘాత ధోరణులు ఉనికిలో వుంటున్నాయి. ఫ్యూడల్ భావజాలానికిగల అపారమైన ప్రభావం ప్రాతిపదికన ప్రజల వెనుకబాటును వారు ఉపయోగించుకుంటారు. ఇటీవలి దశాబ్దాలలో కాంగ్రెస్‌పై పెరిగిన అసంతృప్తిని, అది క్రమేణా క్షీణించడాన్ని ఉపయోగించుకొని వారు కాంగ్రెస్ వదిలిన ఖాళీని భర్తీ చేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు ప్రారంభించారు. భారతీయ జనతా పార్టీ విచ్ఛిన్నకర మతోన్మాద కార్యక్రమంగల అభివృద్ధి నిరోధక పార్టీ. ఇతర మతాలపట్ల ద్వేషం, అసహనం,

పచ్చి జాతీయ దురభిమానం దాని అభివృద్ధి నిరోధక సారానికి ప్రాతిపదిక. ఫాసిస్టు తరహా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మార్గదర్శకత్వంలో, ప్రాబల్యంలో పని చేసే బిజెపి సాధారణ బూర్జువా రాజకీయ పార్టీ కాదు. బిజెపి అధికారంలో వుంటే రాజ్యాధికారం, రాజ్యాంగ యంత్రం ఆర్.ఎస్.ఎస్.కు అందుబాటులోకి వస్తాయి. హిందూ రాష్ట్ర స్థాపన లక్ష్యంతో హిందూత్వ సిద్ధాంతం పునరుద్ధరణ వాదాన్ని పెంపొందిస్తోంది. భారతదేశ మిశ్రమ సంస్కృతిని తోసిపుచ్చుతుంది. ఈ విధమైన మతతత్వ ధోరణి వ్యాప్తి చెందడంవల్ల మైనారిటీ మత ఛాందసం కూడా పెరుగుతుంది. రాజకీయ వ్యవస్థ లౌకిక పునాదిపై ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుంది. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీవ్ర ప్రమాదం తెచ్చిపెడుతుంది. బడా వాణిజ్య వర్గాలు, భూస్వామ్యవర్గాలలో గణనీయమైన భాగాలు మాత్రమేగాక అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం కూడా బిజెపికి అన్ని విధాలా మద్దతునిస్తోంది.

7.15 ఈ అంశాలన్నిటి ప్రాతిపదికగా అన్ని దేశభక్తియుత శక్తులతో – అంటే పెట్టుబడిదారీ పూర్వ సమాజపు అవశేషాలన్నింటినీ నిర్మూలించాలని, రైతాంగానికి అనుకూలమైన పద్ధతిలో వారి ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవసాయ విప్లవం సాగించాలని, విదేశీ పెట్టుబడి నిర్నిరోధంగా ప్రవేశించడాన్ని వ్యతిరేకించాలని, భారతీయ ఆర్థిక, సామాజిక జీవితాన్నీ సంస్కృతినీ మొదలంటా పునర్నిర్మించడానికి ఎదురయ్యే అన్ని అవరోధాలను తొలగించాలని కోరుకునే అన్ని శక్తులతో – ఐక్యం కావలసిన కర్తవ్యాన్ని కమ్యూనిస్టు పార్టీ చేపడుతున్నది.

7.16 కార్మిక కర్షక ఐక్యత కేంద్రంగా అన్ని దేశభక్తి, ప్రజాతంత్ర శక్తుల విప్లవకర ఐక్యత ద్వారా జనతా ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాలు సాధించేందుకు జరిగే పోరాటం సంక్లిష్టమైనదీ, సుదీర్ఘమైనదీ, దాన్ని వేర్వేరు దశల్లో వేర్వేరు పరిస్థితుల్లో సాగించాల్సి వుంటుంది. వేర్వేరు వర్గాలూ, ఒకే వర్గంలోని వేర్వేరు తరగతులూ విప్లవోద్యమ అభివృద్ధి యొక్క వేర్వేరు దశల్లో వేర్వేరు వైఖరులు తీసుకోవడం తప్పనిసరిగా జరుగుతుంది. విస్తారమైన ప్రజా ఉద్యమాలను పెంపొందించి, వ్యూహాత్మక లక్ష్యసాధనకై తగిన ఐక్యసంఘటనా ఎత్తుగడలు అనుసరించగల బలమైన కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ఈ మార్పులను ఉపయోగపెట్టుకుని, ఈ వర్గాలను తన శ్రేణులలోకి రాబట్టుకోగలుగుతుంది. అత్యంత నిజాయితీపరులైన, త్యాగధనులైన విప్లవకారులతో కూడిన అలాంటి పార్టీయే విప్లవోద్యమ క్రమంలో తప్పనిసరిగా చోటు చేసుకునే వివిధ మలుపుల్లో జనబాహుళ్యానికి నాయకత్వం వహించగలదు.

7.17 త్వరితగతిని మారిపోయే రాజకీయ పరిస్థితి అవసరాలకు తగినట్లుగా వివిధ తాత్కాలిక నినాదాలను పార్టీ రూపొందించుకోవలసి వుంటుంది. ప్రస్తుత పాలక వర్గాలను కూలదోసి బలమైన కార్మిక కర్షక ఐక్యత ఆధారంగా నూతన ప్రజాతంత్ర రాజ్యాన్నీ, ప్రభుత్వాన్నీ స్థాపించాల్సిన కర్తవ్యాన్ని ప్రజల ముందుంచుతూనే, పార్టీ ప్రజలకు ఉపశమనం కలిగించే ఒక కార్యక్రమం అమలు జరిపేందుకు ప్రతినబూనిన ప్రభుత్వాలను ఏర్పరచడానికి లభించే అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటుంది. ఉన్న పరిమితులలోనే ప్రత్యామ్నాయ విధానాలు ముందుకు తేవడానికీ, అమలు జరపడానికీ కృషి చేస్తుంది. అలాంటి ప్రభుత్వాలను ఏర్పరచడం శ్రామిక ప్రజల విప్లవోద్యమానికి గొప్ప ఊపునిచ్చి ఆ విధంగా జనతా ప్రజాస్వామిక నిర్మాణ క్రమానికి దోహదపడుతుంది. అయితే అది దేశం ఎదుర్కొనే ఆర్థిక, రాజకీయ సమస్యలకు ఎలాంటి మౌలికమైన పరిష్కారాన్ని సాధించజాలదు. అందుకే పార్టీ రాష్ట్రాలలో లేదా కేంద్రంలో నిర్దిష్ట పరిస్థితుల ప్రాతిపదికన అలాంటి ప్రభుత్వాల ఏర్పాటుకుగల అవకాశాలన్నిటినీ ఉపయోగించుకుంటూ ఆ విధంగా ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేస్తూనే మరో వైపు బడా బూర్జువా నాయకత్వానగల ప్రస్తుత బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రాన్నీ, ప్రభుత్వాన్నీ తొలగించాల్సిన అవసరాన్ని ప్రజలకు ప్రబోధిస్తూనే వుంటుంది.

7.18 జనతా ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పాటునూ, సోషలిస్టు పరివర్తననూ శాంతియుత మార్గాల ద్వారా సాధించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కృషి చేస్తుంది. శక్తివంతమైన ప్రజా విప్లవోద్యమాన్ని పెంపొందించడం, పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర పోరాట రూపాలను సమ్మిళితం చేయడం ద్వారా కార్మికవర్గం దాని మిత్రులు అభివృద్ధి నిరోధక శక్తుల ప్రతిఘటనను అధిగమించేందుకు, ఈ పరివర్తన శాంతియుతంగా సాధించేందుకు శాయశక్తులా కృషి చేస్తాయి. అయితే పాలకవర్గాలు తమ అధికారాన్ని ఎన్నడూ ఐచ్ఛికంగా వదులుకోవని నిరంతరం మనసులో వుంచుకోవడం అవసరం. ప్రజల అభిప్రాయాన్ని వమ్ము చేసేందుకు చట్ట ఉల్లంఘన, హింసాకాండ ద్వారా దాన్ని వెనక్కు మళ్ళించేందుకు అవి ప్రయత్నిస్తాయి. అందుకే విప్లవకర శక్తులు అప్రమత్తంగా వుండి అన్ని రకాల అవాంతర పరిస్థితులను దేశ రాజకీయ జీవితంలో వచ్చే ఎలాంటి మార్పులు మలుపులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా తమ కృషిని నిర్దేశించుకోవాలి.

# 8

# కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం

8.1 జనతా ప్రజాస్వామికాన్ని స్థాపించేందుకై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తన విప్లవకర కార్యక్రమాన్ని భారత ప్రజానీకం ముందు ఉంచుతున్నది. జనతా ప్రజాస్వామిక విప్లవం సోషలిజానికి, దోపిడీరహిత సమాజానికి పురోగమించే బాట వేస్తుంది. భారత ప్రజలను విముక్తి చేసే అలాంటి విప్లవానికి, రైతాంగంతో కలిసి కార్మికవర్గం నాయకత్వం వహించాల్సి వుంటుంది. కార్మికవర్గం అగ్రగామి దళమైన కమ్యూనిస్టు పార్టీ ఈ లక్ష్యసాధన కోసం సామ్రాజ్య వాదానికి, గుత్త పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాల్సి వుంటుంది. మార్క్సిజం లెనినిజం సూత్రాలను మన దేశంలో వున్న పరిస్థితులకు నిర్దిష్టంగా అన్వయించడం ద్వారా పార్టీ విజయం సాధించే వరకు రాజకీయ, సైద్ధాంతిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నిటా దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహించాల్సి వుంటుంది.

8.2 సోషలిజానికి ఎదురు దెబ్బలు తగిలిన దరిమిలా అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం తీవ్ర కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేపట్టిన నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతిక పోరాటాన్ని ఉధృతం చేయడం తప్పనిసరి అవసరం. పాలకవర్గాల ప్రధాన సైద్ధాంతిక ఆయుధంగా వున్న కమ్యూనిస్టు వ్యతిరేకతను కమ్యూనిస్టులు ఎండగట్టి ఎదుర్కొంటారు. కమ్యూనిస్టులు, ఫ్యూడల్, బూర్జువా సిద్ధాంతాల ప్రభావం నుండి ప్రజలను విముక్తి చేసేందుకూ వారి రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకూ, సామ్రాజ్యవాద చోదిత ప్రపంచీకరణకు, సరళీకరణకు, స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలకు వంతపాడే వారి ప్రచారాలను

తిప్పి కొట్టేందుకూ కమ్యూనిస్టులు ఈ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటం నిర్వహిస్తారు.

8.3 మతచాందసం, మూఢత్వం, మతతత్వం, కులతత్వం ప్రజలలో చీలికలు పెట్టి వారి ప్రజాతంత్ర చైతన్యాన్ని మొద్దుబారుస్తాయి. అభివృద్ధి నిరోధక శక్తులు బూర్జువా జాతీయవాదం, దురభిమానాలతోపాటుగా వాటినీ వినియోగించుకుంటాయి. ప్రజాతంత్ర ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు సామ్రాజ్యవాదం ఈ శక్తులను ప్రోత్సహిస్తుంది. ఈ విచ్ఛిన్నకర భావాలు, శక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు దృఢసంకల్పంతో పోరాడతారు.

8.4 అన్ని రంగాల్లో పోరాటం సాగించేందుకు, విప్లవోద్యమాన్ని నిర్దేశించేందుకు ప్రజావిప్లవ పార్టీని నిర్మించడం అవసరం. అలాంటి పార్టీ ప్రజా ఉద్యమాలు పెంపొందించడం ద్వారా, అందుకు తగిన స్థాయిలో తన రాజకీయ సైద్ధాంతిక పలుకుబడిని సంఘటితపరచుకోవడం ద్వారా ప్రజలలో తన పునాదిని నిరంతరం విస్తరించుకుంటూ వుండాలి. ఇందుకోసం కేంద్రీకృత ప్రజాస్వామ్యంపై ఆధారపడిన బలమైన, క్రమశిక్షణాయుతమైన పార్టీ వుండాలి. కార్మికులపట్ల, శ్రామికవర్గంలోని అన్ని తరగతులపట్ల తన చారిత్రక బాధ్యతలను నెరవేర్చేందుకై పార్టీ ఎప్పటికప్పుడు మరల మరల విజ్ఞానవంతమవుతూ వుండాలి. తన భావజాల, సైద్ధాంతిక స్థాయిని పునర్నవీకరించుకోవాలి. నిర్మాణబలాన్ని పెంచుకోవాలి.

8.5 జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించడం, ప్రజాతంత్ర కర్తవ్యాలను జయప్రదంగా నెరవేర్చడం, జనతా ప్రజాస్వామిక రాజ్యాంగ యంత్రంలో కార్మికవర్గ నాయకత్వం ఏర్పడడం – వీటన్నిటి మూలంగా భారత విప్లవం ప్రజాతంత్ర దశవద్దనే ఆగిపోకుండా ఉత్పత్తి శక్తులను అభివృద్ధి పరచడం ద్వారా సోషలిస్టు సమాజ పరివర్తనను సాధించే దశకు అతి త్వరగా సాగిపోతోంది.

8.6 భారత కమ్యూనిస్టు (మార్క్సిస్టు) ఈ కార్యక్రమాన్ని ప్రజలకు సమర్పిస్తూ ప్రజాతంత్ర జాతీయ పురోగమనానికై తాము పోరాడుతున్నామనే, తమ లక్ష్యం పట్ల స్పష్టమైన అవగాహన కలిగి వుండేందుకై ఈనాటి ప్రధాన తక్షణ కర్తవ్యాలను వారి ముందుంచుతున్నది. నిజమైన ప్రజాతంత్ర పురోగమనంపట్ల, సౌభాగ్యవంతమైన జీవితం సృష్టించడంపట్ల ఆసక్తిగల శ్రామిక ప్రజలు, కార్మికవర్గం, రైతాంగం,

మహిళలు, విద్యార్థులు, యువత, మేధావులు, మధ్యతరగతి వారు – అందరినీ ఈ కర్తవ్యాల పరిపూర్తికి, లక్ష్యసాధనకు జనతా ప్రజాస్వామిక సంఘటనలో ఐక్యం కావలసిందిగా పిలుపునిస్తున్నది.

8.7 మన ప్రజల పోరాట సంప్రదాయాలనూ, మన సంస్కృతి, నాగరికతలలో ఉత్తమమైన, విలువైన వాటన్నిటినీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ముందుకు గొనిపోతుంది. సిపిఐ(ఎం), దేశభక్తిని శ్రామికవర్గ అంతర్జాతీయతతో మేళవిస్తుంది. తన సకల కార్యకలాపాలు, పోరాటాలలోనూ పార్టీ మార్క్సిజం, లెనినిజం సూత్రాలను, శాస్త్రీయ తాత్వికతను మార్గదర్శకంగా స్వీకరిస్తుంది. ఇవి మాత్రమే సంపూర్ణ విముక్తికి సరైన మార్గం చూపగలవు. అత్యంత పురోగాములు అత్యంత చురుకైన, అత్యంత నిస్వార్థపరులైన శ్రామికవర్గ ఉత్తమోత్తమ పుత్రికలు, పుత్రులను పార్టీ తన శ్రేణులలో ఐక్యపరిచి వారిని దృఢమైన మార్క్సిస్టు లెనినిస్టులుగానూ, శ్రామికవర్గ అంతర్జాతీయ వాదులుగానూ తీర్చిదిద్దుతుంది. ప్రజాతంత్ర అభివృద్ధి క్రమం కోసం జరిగే పోరాటంలో –ఈ కార్యక్రమ సాధనకై శక్తివంతమైన జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మించే మహత్తర కర్తవ్యంలో – దేశ భక్తి, ప్రజాతంత్ర శక్తులన్నిటినీ ఐక్యపరచే కర్తవ్యానికి పార్టీ తన సర్వశక్తులూ, వనరులూ ధారపోస్తుంది.

8.8 అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం ప్రపంచాధిపత్యానికి ప్రాకులాడుతున్నది. భారత ఆర్థిక, రాజకీయ వ్యవస్థలూ దేశ సార్వభౌమత్వం కూడా ముప్పు నెదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రగతిశీల శక్తులన్నింటినీ ఏకం చేసి ఈ దాడిని గట్టిగా, ధైర్యంగా ఎదుర్కొనేలా చేయడం కార్మికవర్గం, దాని రాజకీయ పార్టీ ప్రధాన కర్తవ్యమవుతుంది. శ్రామికవర్గ అంతర్జాతీయతను నిలబెట్టడంలోనూ, ప్రపంచమంతటా గల కమ్యూనిస్టు శక్తుల మధ్య అర్థవంతమైన, ఆచరణాత్మకమైన ఐక్యతను పెంపొందించడంలోనూ, విప్లవోద్యమాలు నడిపించడంలోనూ సోషలిజం నిర్మాణంలోనూ కమ్యూనిస్టు ఉద్యమానుభవాల నుంచి తగిన పాఠాలు తీసుకోవడం ద్వారా, సోషలిజం వెనుకంజకు కారణాలను విశ్లేషించడం ద్వారా మాత్రమే మనం ఈ విప్లవకర బాధ్యతను నెరవేర్చ గలుగుతాము. మితవాద రివిజనిజం, అతివాద ఒంటెత్తు,

పెదభూస్వామ్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తానని సిపిఐ(ఎం) ప్రతిన బూనుతోంది. వర్గ శక్తుల బలాబలాల పొందికను మార్చేందుకు జనతా ప్రజాస్వామిక సంఘటనను నిర్మించేందుకుగాను భారత ప్రజలను సమీకరించే కర్తవ్యాన్ని అది ముందుకు గొనిపోతుంది.

8.9 శ్రామిక వర్గం, దాని విప్లవకర అగ్రగామి నాయకత్వంలో, మార్క్సిజం లెనినిజం బోధనల మార్గదర్శకత్వంలో మన దేశ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సాధిస్తారని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విశ్వసిస్తోంది. మన మహత్తర భారతదేశం కూడా జనతా ప్రజాస్వామికాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని సోషలిజం వైపు పురోగమిస్తుందని మన పార్టీ విశ్వసిస్తోంది.

# నిబంధనావళి

**(1968 డిసెంబర్ 23 - 29 తేదీల్లో కొచ్చిన్‌లో జరిగిన**
**పార్టీ 8వ మహాసభ ఆమోదించినది)**

**(2015 ఏప్రిల్ పార్టీ 21 మహాసభ వరకు నిబంధనావళికి చేసిన సవరణలు,**
**2014 నవంబరులో కేంద్ర కమిటీ రూల్స్‌కు చేసిన సవరణలు చేర్చబడ్డాయి)**

# నిబంధన-1

## పార్టీపేరు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# నిబంధన - 2

## ఆశయము

భారత కార్మికవర్గం యొక్క విప్లవాగ్రదళం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు). కార్మికవర్గ నియంతృత్వ రాజ్యాంగ యంత్ర స్థాపన ద్వారా సోషలిజాన్ని, కమ్యూనిజాన్నీ సాధించడం దాని లక్ష్యం. మానవుని మానవుడు దోచుకునే పద్ధతి నుండి పూర్తి విముక్తిని సాధించుకోవడానికై, శ్రామిక ప్రజా బాహుళ్యానికి సరైన మార్గాన్ని జూపే మార్క్సిజం–లెనినిజం యొక్క తత్వశాస్త్రమూ, సూత్రములే ఈ పార్టీ కార్యాచరణకు మార్గదర్శకంగా వుంటాయి. శ్రామికవర్గ అంతర్జాతీయతా పతాకాన్ని పార్టీ దృఢంగా చేబూని నిలుస్తుంది.

# నిబంధన - 3

## జెండా

పార్టీ జెండా ఎఱ్ఱజెండా. దీని నిలువు కంటే వెడల్పు ఒకటిన్నర రెట్లు వుంటుంది. జెండా మధ్యలో క్రాస్‌గా తెల్లటి సుత్తి, కొడవలి వుంటాయి.

# నిబంధన-4

## సభ్యత్వం

1. భారతదేశంలో నివసిస్తూ 18 ఏండ్ల వయస్సు దాటి, పార్టీ కార్యక్రమాన్ని మరియు నిబంధనావళిని అంగీకరించి, పార్టీ సంస్థలలో ఏదో ఒక దానిలో పని చేయడానికి అంగీకరించి, పార్టీ సభ్యత్వ రుసుమును (నిర్ణయించిన రుసుమునూ, లెవీని)

క్రమంగా చెల్లిస్తానని ఒప్పుకొని, పార్టీ నియమాలను అమలు జరపడానికి అంగీకరించిన ఏ వ్యక్తియైనా పార్టీ సభ్యత్వమునకు అర్హుడవుతాడు.

2. (అ) వ్యక్తిగతంగా దరఖాస్తులు పెట్టిన కొత్త సభ్యులను ఇద్దరు పార్టీ సభ్యులు సిఫార్సు చేసినచో పార్టీలోకి తీసుకోబడతారు. సిఫార్సు చేసే పార్టీ సభ్యులు ఆ దరఖాస్తుదారును గూర్చి స్వయంగా తమకు తెలిసిందంతా పూర్తి బాధ్యతతో దరఖాస్తును విచారించి పార్టీ శాఖకు గానీ, యూనిట్‌కు గాని తెలియజేయాలి. దరఖాస్తుదారుని పార్టీలోకి తీసుకోదలిస్తే పార్టీ శాఖ ఆ మేరకు తన పై కమిటీకి సిఫార్సు చేయాలి. అన్ని సిఫార్సులపైనా ఆ పై కమిటి నిర్ణయం తీసుకుంటుంది.

   (ఆ) కేంద్ర కమిటీ స్థాయి వరకూ పార్టీ శాఖకు పైనున్న అన్ని పార్టీ కమిటీలు నేరుగా కొత్త సభ్యులను పార్టీలోకి తీసుకోగల అధికారాన్ని కలిగి ఉంటాయి.

3. (అ) పార్టీ సభ్యత్వం కొరకై పెట్టుకొన్న దరఖాస్తులన్నింటినీ, దరఖాస్తు గురించి సిఫార్సు చేసిన నెలరోజులలోగా, అందుకు సంబంధించిన కమిటీల ముందు వుంచాలి.

   (ఆ) దరఖాస్తుదారుని పార్టీలో చేర్చుకొంటే అతడు లేక ఆమె చేరిన రోజు నుండి ఒక ఏడాది పాటు క్యాండిడేటు సభ్యుడుగా లేక సభ్యురాలిగా ఎంచబడతారు.

4. స్థానిక, జిల్లా లేక రాష్ట్ర స్థాయిలో వున్న ఇతర పార్టీల నాయకులు పార్టీలో చేరదలచుకుంటే అటువంటి వారికి సభ్యత్వాన్ని యిచ్చే ముందు ఆయా స్థాయి కమిటీ ఆమోదించడమేగాక అందుకు పై మెట్టునున్న కమిటీ ఆమోదం కూడా పొందడం అవసరం. ప్రత్యేకమైన సందర్భాలలో యీ తరహా సభ్యులను పూర్తి స్థాయి పార్టీ సభ్యత్వానికి కేంద్ర కమిటీ లేదా రాష్ట్ర కమిటి అనుమతించవచ్చు. ఎప్పుడైనా రాష్ట్ర కమిటీ ఈ తరహా సభ్యులను అనుమతించదలిస్తే ముందుగా కేంద్ర కమిటీ అంగీకారాన్ని పొందాలి.

5. పార్టీ నుండి తొలగించిన సభ్యులను తిరిగి చేర్చుకోవాలంటే అతని తొలగింపును ధృవపరచిన పార్టీ కమిటీ గాని లేదా అంతకు పై కమిటీ గాని ఆ విషయాన్ని నిర్ణయించవలసి వుంటుంది.

6. ఎన్నుకోవడం, ఎన్నిక కావడం, ఏ ప్రతిపాదన మీదనైనా ఓటు చేయడం మినహా మిగతా అన్ని విషయాల్లోనూ పార్టీ సభ్యులకు వుండేహక్కులు, విధులు క్యాండిడేటు సభ్యులకు కూడా వుంటాయి.

7. క్యాండిడేటు సభ్యులను చేర్చుకోమని సిఫార్సు చేసిన శాఖగాని, చేర్చుకొన్న కమిటీగాని వారిని ఏదో ఒక శాఖలో లేదా యూనిట్‌లో చేర్చి వారికి పార్టీ కార్యక్రమం, నిబంధనావళి, ప్రస్తుత పార్టీ విధానాలకు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానాన్ని కలుగచేసేందుకు తగు ఏర్పాటు చేసి వారి అభివృద్ధిని గమనించుతూ వుండాలి.

8. క్యాండిడేట్ దశ పూర్తయిన పిమ్మట ఆ క్యాండిడేటు సభ్యుని పూర్తి సభ్యునిగా తీసుకొనడానికి అర్హత సంపాదించాడా లేదా అనేది అందుకు సంబంధించిన పార్టీ శాఖ లేక కమిటీ చర్చించాలి. క్యాండిడేటు సభ్యుడు అనర్హుడుగా కనపడితే అతని లేక ఆమె క్యాండిడేట్ సభ్యత్వాన్ని పార్టీ శాఖ గాని, పార్టీ కమిటీగాని రద్దు చేస్తుంది. పూర్తి స్థాయి పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చిన సందర్భాలలో దానిని గూర్చిన నివేదికను ఆ పార్టీ శాఖ లేక పార్టీ కమిటీ పై కమిటీకి రెగ్యులర్‌గా పంపాలి.

9. ఆ నివేదికను పరిశీలించిన మీదట పై కమిటీ ఈ నివేదికను పంపిన శాఖతోగాని, కమిటీతోగాని సంప్రదించి మార్చనూవచ్చు లేదా సవరించనూవచ్చు. క్యాండిడేటు సభ్యులుగానూ, క్యాండిడేట్ సభ్యులను పూర్తి సభ్యులుగానూ చేర్చుకొనేటప్పుడు జిల్లా, రాష్ట్ర కమిటీలు పర్యవేక్షణాధికారాలను కలిగి వుంటాయి. ఈ సందర్భంలో క్రింది కమిటీలు చేసిన నిర్ణయాలను సవరించడానికి, నిరాకరించడానికి అవి హక్కును కలిగి వుంటాయి.

10. పార్టీ సభ్యులెవరైనా తన సభ్యత్వాన్ని ఒక యూనిట్ నుండి మరో యూనిట్‌కు బదిలీ చేసుకోవచ్చు. అట్లు బదిలీ చేసుకోవడానికి తాను వున్న యూనిట్ అనుమతిని పొందాలి. తాను కొత్తగా చేరగోరే యూనిట్ ఏ కమిటీ యొక్క అధికార పరిమితి కింద వుంటున్నదో ఆ పై కమిటీకి తన యూనిట్ ద్వారా దరఖాస్తును పంపుకోవాలి.

## నిబంధన - 5

### పార్టీ ప్రమాణ పత్రం

పార్టీలో జేరే ప్రతి వ్యక్తి పార్టీ ప్రమాణ పత్రంపై సంతకం పెట్టాలి. ఆ ప్రమాణ పత్రం యిలా వుంటుంది.

“పార్టీ లక్ష్యాలను, ఆశయాలను నేను ఆమోదిస్తున్నాను. పార్టీ నిబంధనావళికి కట్టుబడి వుండటానికి, పార్టీ నిర్ణయాలను విధేయతతో అమలు జరపడానికి నేను అంగీకరిస్తున్నాను.

"కమ్యూనిజం ఆశయాలకు అనుగుణంగా జీవించడానికి కృషి చేస్తాను. ఎల్లవేళలా స్వప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను మిన్నగా ఎంచుకుంటూ కార్మికవర్గానికి, శ్రామిక ప్రజానీకానికి, దేశానికి నిస్వార్థంగా సేవ చేస్తాను."

## నిబంధన-6

### పార్టీ సభ్యత్వ రికార్డులు

పార్టీ సభ్యత్వ రికార్డులన్నిటినీ జిల్లా కమిటీ పర్యవేక్షణలో వుంచాలి.

## నిబంధన-7

### పార్టీ సభ్యత్వాన్ని సరిచూడటం

1. పార్టీ సభ్యుడు ఏ పార్టీ సంస్థకు చెందుతాడో ఆ పార్టీ సంస్థ ప్రతి సంవత్సరం పార్టీ సభ్యత్వాన్ని సరి చూస్తుంది. ఏ పార్టీ సభ్యుడైనా వరుసగా, సకారణం లేకుండా పార్టీ జీవితంలోగాని, కార్యకలాపాలలోగాని పాల్గొనకపోయినా, పార్టీ బాకీలు చెల్లింపక పోయినా పార్టీ సభ్యత్వం నుండి మినహాయింపబడతాడు.
2. ఒక శాఖగాని, పార్టీ కమిటీ గాని సరిజూచిన పార్టీ సభ్యత్వ నివేదికను ధృవపరచడానికి, నమోదు చేయడానికి పై కమిటీకి పంపాలి.
3. పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించనప్పుడు దానిపై విజ్ఞప్తి చేసుకొనే హక్కు వున్నది.

## నిబంధన-8

### పార్టీ సభ్యత్వం నుండి రాజీనామా

1. పార్టీ నుండి రాజీనామా యివ్వదలచుకొన్న పార్టీ సభ్యుడు తాను ఏ పార్టీ శాఖకు లేక పార్టీ కమిటీకి చెందుతాడో దానికి తన రాజీనామాను అందజేయాలి. దానిని ఆ యూనిట్ అంగీకరించి సభ్యత్వం జాబితానుండి అతని లేక ఆమె పేరును కొట్టివేయవచ్చును. ఆ విషయాన్ని తనపై కమిటీకి నివేదించాలి. రాజీనామా గనుక రాజకీయ కారణాలపైనైతే దానిని యూనిట్ అంగీకరించకుండా నిరాకరించి అతనిని లేక ఆమెను బహిష్కరించవచ్చు.

2. రాజీనామా చేస్తున్న సభ్యుడు పార్టీ నుండి బహిష్కరించడానికి అవసరమయ్యేంతటి తీవ్రంగా పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించి వున్నాడనే అభియోగానికి గురయ్యే పక్షంలో, అభియోగం గట్టిదైనప్పుడు అతని రాజీనామాను పార్టీనుండి బహిష్కరణగా పరిగణించి ఆ విధంగా చర్యను తీసుకోవచ్చు.

3. అలాంటి రాజీనామాలను బహిష్కరణగా పరిగణించి చర్య తీసుకొన్నప్పుడు వెనువెంటనే ఆ విషయాన్ని పైకమిటీకి తెలియజేసి దాని ధృవీకరణను పొందవలసి వుంటుంది.

## నిబంధన-9

### సభ్యత్వ రుసుం

1. క్యాండిడేటు సభ్యులతో సహా ప్రతిపార్టీ సభ్యుడూ ఏడాదికి ఐదు రూపాయలు పార్టీ సభ్యత్వ రుసుం క్రింద చెల్లించాలి. ఈ వార్షిక పార్టీ రుసుమును పార్టీలోకి తీసుకొన్నప్పుడూ, అటు తర్వాత ప్రతి ఏడాది మార్చి నెలాఖరులోగా తన సభ్యత్వమున్న శాఖ కార్యదర్శికిగాని, యూనిట్ కార్యదర్శికిగాని చెల్లించాలి. ఆ గడువులోగా రుసుం చెల్లించకపోతే అతని లేక ఆమె పేరు పార్టీ సభ్యుల జాబితానుండి తొలగించబడుతుంది. ఈ గడువును పరిస్థితులను బట్టి, అవసరమనుకుంటే కేంద్ర కమిటీపొడిగించవచ్చు.

2. పార్టీ శాఖలుగాని, పార్టీ యూనిట్లుగాని పార్టీ సభ్యులనుండి వసూలు చేసే పార్టీ సభ్యత్వ రుసుమునంతా ఆయా పార్టీ కమిటీలద్వారా కేంద్ర కమిటీ వద్ద జమకట్టాలి.

## నిబంధన-10

### పార్టీలెవీ

ప్రతి పార్టీ సభ్యుడూ ప్రతినెలా కేంద్రకమిటీ నిర్ణయించినట్లుగా పార్టీ లెవీని చెల్లించాలి. వార్షికాదాయం, లేక దఫదఫాలుగా వచ్చే ఆదాయం గలవారు ఆ రుతువు ప్రారంభంలోగాని, పావు సంవత్సరం ప్రారంభంలోగాని, నిర్ణీత శాతం ప్రకారం చెల్లించాలి. సభ్యుడు గనుక తాను చెల్లించవలసిన తేదీనుండి మూడు నెలలలోగా

తన లెవీని చెల్లించకపోయినచో అతనిపేరు పార్టీ సభ్యుల జాబితానుండి తొలగించబడుతుంది.

## నిబంధన-11

### పార్టీ సభ్యుల బాధ్యతలు

1. పార్టీ సభ్యుల బాధ్యతలు ఈ క్రింది విధంగా వుంటాయి.

(అ) తాము సభ్యులుగా వున్న పార్టీ సంస్థ కార్యకలాపాల్లో క్రమబద్ధంగా పాల్గొంటూ, పార్టీ విధానాన్ని, నిర్ణయాలను, ఆదేశాలను విశ్వాసంతో నెరవేర్చాలి.

(ఆ) మార్క్సిజం-లెనినిజంను అధ్యయనం చేస్తూ తమ అవగాహనను పెంపొందించుకునేందుకు కృషి చేయాలి.

(ఇ) పార్టీ పత్రికలను, పార్టీ ప్రచురణలను చదవాలి. వాటిని బలపర్చుతూ ప్రచారం చేయాలి.

(ఈ) పార్టీ నిబంధనావళిని, పార్టీ క్రమశిక్షణను పాటించాలి. కమ్యూనిజం మహత్తరాశయాలకు అనుగుణంగా, శ్రామికవర్గ అంతర్జాతీయతను పాటిస్తూ వ్యవహరించాలి.

(ఉ) పార్టీ ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను స్వప్రయోజనాల కన్నా మిన్నగా పాటించాలి.

(ఊ) గాఢ విశ్వాసంతో ప్రజానీకానికి సేవచేయాలి. వారితో తమ సంబంధాలను అదేపనిగా పెంపొందించుకుంటూ వుండాలి. ప్రజల నుండి నేర్చుకొంటూ వారి అభిప్రాయాలను, కోర్కెలను పార్టీకి తెలుపుతూ వుండాలి. మినహాయింపులను పొందితేతప్ప ప్రతి పార్టీ సభ్యుడూ పార్టీ నాయకత్వాన ఏదో ఒక ప్రజాసంఘంలో పనిచేస్తూ వుండాలి.

(ఎ) పార్టీలో ఒకరిపట్ల మరొకరు కామ్రేడ్స్ మధ్యవుండవలసిన స్నేహ సంబంధాలను పెంపొందించుకుంటూ సుహృద్భావాన్ని నికరంగా అభివృద్ధి చేసుకోవాలి.

(ఏ) ఒకరికొకరు తోడ్పడాలనే దృష్టితోనూ, వ్యష్టి, సమిష్టి కార్యవిధానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న దృష్టితోనూ విమర్శన–ఆత్మ విమర్శన అలవర్చుకోవాలి.

(ఐ) దాపరికం లేకుండా చిత్తశుద్ధితో వ్యవహరించుతూ పార్టీ పట్ల నిజాయితీతో సంచరించాలి. పార్టీ పట్ల విశ్వాసంతో వుండాలి. దానికి ఎప్పుడూ ద్రోహం చేయరాదు.

(ఒ) పార్టీ ఐక్యతనూ, సంఘటిత శక్తినీ సదా కాపాడుతూ కార్మిక వర్గానికీ, దేశానికీ శత్రువులైనవారిపట్ల అప్రమత్తతతో వ్యవహరించాలి.

(ఓ) పార్టీకి, కార్మికవర్గానికి, దేశానికి శత్రువులైనవారి దాడుల నుండి పార్టీ లక్ష్యాలను కాపాడుతూ ఎల్లప్పుడూ పార్టీని సమర్ధించాలి.

2. పైన ఉదహరించిన బాధ్యతలన్నింటినీ పార్టీ సభ్యులు పూర్తి నెరవేర్చేటట్లు వారి విధుల నిర్వహణలో సర్వవిధాల తోడ్పడడం పార్టీ సంస్థల కర్తవ్యం.

## నిబంధన-12

### పార్టీ సభ్యుల హక్కులు

1. పార్టీ సభ్యుల హక్కులు ఈ విధంగా వుంటాయి.

(అ) పార్టీ సంస్థలను, పార్టీ కమిటీలను ఎన్నుకునేందుకు, వాటికి ఎన్నికయ్యేందుకు.

(ఆ) పార్టీ విధానాన్ని, పార్టీ నిర్ణయాలను రూపొందించడంలో తోడ్పడటానికి గానూ చర్చలలో పాల్గొనడానికి.

(ఇ) పార్టీ సభ్యుడు తాను పార్టీలో నిర్వహించే పనిని గురించి సూచనలు చేయడానికి.

(ఈ) పార్టీ సమావేశాల్లో పార్టీ కమిటీలను గురించి, పార్టీ కార్యకర్తలను గురించి విమర్శలు చేయడానికి.

(ఉ) తనపై క్రమశిక్షణా చర్యను గైకొనుటకు పార్టీ యూనిట్‌లో చర్చజరుగుతున్నప్పుడు తన యూనిట్‌లో స్వయంగా హాజరై తన వాదనను చెప్పుకునేందుకు హక్కుంది.

(ఊ) ఏదైనా ఒక పార్టీ కమిటీ నిర్ణయంతో ఏ పార్టీ సభ్యుడైనా విభేదించినప్పుడు తన అభిప్రాయాన్ని తన పై కమిటీకి తెలియపర్చు హక్కు గలదు. ఆ అభిప్రాయ భేదం రాజకీయ భేదాభిప్రాయమైనప్పుడు కేంద్ర కమిటీ వరకూ పై కమిటీకి తెలియజేయవచ్చు. అయితే అటువంటి సందర్భాలన్నింటిలోనూ పార్టీ సభ్యుడు పార్టీ నిర్ణయాలను అమలు జరుపుతూ వుండాలి. భేదాభిప్రాయాలను ఆచరణ అనేపరీక్ష ద్వారానూ, సౌహార్ద్రపూరితమైన చర్చల ద్వారానూ పరిష్కారం చేసుకోవడానికి కృషిచేయాలి,

(ఎ) కేంద్రకమిటీతోసహా ఏ పై కమిటీ కైనాసరే ఏ స్టేట్‌మెంటునైనా, ఏ విజ్ఞాపననైనా, ఏ ఫిర్యాదునైనా పంపుకునేందుకు ప్రతిసభ్యునికి హక్కు వుంటుంది.

2. పార్టీ సభ్యులకు గల ఈ హక్కులన్నీ గౌరవించబడేటట్టు చూడడం పార్టీ సంస్థల, పార్టీ కార్యకర్తల విధి.

## నిబంధన-13

### కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు

1. కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల మీద పార్టీ నిర్మాణ స్వరూపం ఆధారపడి వుంటుంది. ఆ సూత్రాలననుసరించి పార్టీ అంతరంగిక జీవితం కొనసాగుతుంది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం సంపూర్ణమైన ఆంతరంగిక ప్రజాస్వామ్యం మీద ఆధారపడిన నాయకత్వమూ, కేంద్రీకృత నాయకత్వ సలహా సంప్రదింపులపై ప్రజాస్వామ్యం నిర్వహించడమూను.

పార్టీ నిర్మాణ స్వరూపంలో అనుసరించవలసిన కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు ఇలా వుంటాయి.

(అ) పై నుండి క్రిందవరకూ పార్టీ నాయకత్వ సంస్థలన్నీ ఎన్నిక కావాలి.

(ఆ) అధిక సంఖ్యాకుల ఆమోదం పొందిన నిర్ణయాలను అల్పసంఖ్యాకులు అమలు జరపాలి. పై పార్టీ కమిటీలు చేసిన నిర్ణయాలను, ఆదేశాలను

క్రింది పార్టీ యూనిట్లు అమలు జరపాలి. సమిష్టి అభిప్రాయానికి ప్రతివ్యక్తి లోబడి పనిచేయాలి. అన్ని పార్టీయూనిట్లూ పార్టీ మహాసభ, కేంద్రకమిటీ చేసిన నిర్ణయాలను మరియు ఆదేశాలను అమలు జరపాలి.

(ఇ) పై కమిటీలన్నీ తనకు క్రింద వున్న పార్టీ యూనిట్లకు వెంటనే నిర్ణీత వ్యవధుల్లో తమ కార్యకలాపాలను గురించి రిపోర్టు పంపాలి. అలాగే క్రింది కమిటీలన్నీ వెంటనే తమకు పై నున్న కమిటీలకు తమ కార్యకలాపాలను గురించి రిపోర్టులు పంపాలి.

(ఈ) పార్టీ కమిటీలు – ముఖ్యంగా నాయకత్వ కమిటీలు, దిగువ పార్టీ సంస్థలు – సాధారణ సభ్యులు వెలిబుచ్చే అభిప్రాయాలకు, విమర్శలకు చెవొగ్గాలి.

(ఉ) వ్యక్తిగత బాధ్యత, సమిష్టి నిర్ణయాలు, తనిఖీ అనే సూత్రాలపై ఆధారపడి అన్ని పార్టీ కమిటీలూ పనిచేయాలి.

(ఊ) అంతర్జాతీయ వ్యవహారాలకు, అఖిల భారత స్వభావం కలిగిన వ్యవహారాలకు లేదా ఒకటికన్నా హెచ్చు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలకు లేదా మొత్తం దేశానికంతటికీ ఒకే మాదిరి నిర్ణయాలు చేయవలసిన సమస్యలకు సంబంధించిన విషయాల మీద అఖిలభారత యూనిట్లే నిర్ణయాలను తీసుకుంటాయి. రాష్ట్ర, జిల్లా స్వభావం గల సమస్యల మీద అందుకు సంబంధించిన పార్టీ యూనిట్లే సాధారణంగా నిర్ణయాలు చేస్తాయి. కాని అలాంటి నిర్ణయాలు ఏ పరిస్థితుల్లో కూడా తమ కంటే పై కమిటీలు చేసిన నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండరాదు. ఏ రాష్ట్రానికైనా సంబంధించిన ఒక ప్రధాన సమస్యపైన కేంద్ర పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకోవలసి వచ్చినప్పుడు, అందుకు సంబంధించిన రాష్ట్ర పార్టీ యూనిట్‌తో సంప్రదించిన మీదనే చేయవలసి వుంటుంది. అలాగే రాష్ట్ర కమిటీ, జిల్లాలకు సంబంధించిన ప్రధాన సమస్యపై వాటిని సంప్రదించిన పిదపనే నిర్ణయాలను చేయాలి.

(ఎ) అఖిల భారత స్థాయిలో పార్టీ విధానానికి సంబంధించిన విషయాల మీద, అందులోనూ మొట్టమొదటిసారిగా పార్టీ దృక్పథాన్ని వెల్లడించవలసి వచ్చిన సందర్భంలో, అలాంటి పార్టీ విధానాన్ని ప్రకటించే హక్కు కేంద్ర నాయకత్వానికి మాత్రమేవుంటుంది. అయితే కేంద్ర నాయకత్వం పరిశీలన

కోసం దిగువ కమిటీలు సకాలంలో తమ అభిప్రాయాలను, సూచనలను పంపవచ్చు. అలా పంపాలి కూడా.

2. మొత్తం పార్టీ సభ్యులు సంపాదించిన అనుభవం మీద, ప్రజా ఉద్యమాల అనుభవం మీద ఆధారపడి పార్టీ ఆంతరంగిక జీవితంలో ఈక్రింది కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాలను మార్గదర్శకంగా అనుసరించాలి.

(అ) పార్టీకి, దాని విధానానికి, పనికి సంబంధించిన అన్ని విషయాలపై పార్టీ యూనిట్ లోపల స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా చర్చలు జరగాలి.

(ఆ) పార్టీ విధానాలను ప్రచారం చేసి, వాటిని అమలు జరపటంలో పార్టీ సభ్యులందరూ బాగా పాల్గొనేలా నిరంతర కృషి జరపాలి. వారు పార్టీ పనిలోనూ, పార్టీ జీవితంలోనూ మరింత శక్తిమంతంగానూ, ఉపయోగకరంగానూ పని చేసే విధంగా వారి సిద్ధాంత రాజకీయ స్థాయి పెంచేందుకూ, వారి సాధారణ విజ్ఞాన స్థాయిని అభివృద్ధి పరిచేందుకూ, నిరంతరం కృషి చేయాలి.

(ఇ) పార్టీ కమిటీలో తీవ్రమైన విభేదాలు తల ఎత్తినప్పుడు ఒక అంగీకారానికి రావడానికి అన్ని విధాలుగా ప్రయత్నించాలి. అది సాధ్యం కాని పక్షంలో పార్టీ అవసరాల, ప్రజా ఉద్యమాల అవసరాల దృష్ట్యా వెనువెంటనే ఒక నిర్ణయం చేయవలసిన అవసరం వుంటే తప్ప, మరికొన్ని చర్చల ద్వారా ఆ విభేదాలను పరిష్కరించుకొనే దృష్టితో నిర్ణయాన్ని తీసుకోవడాన్ని వాయిదా వేయాలి.

(ఈ) పై నుంచి క్రింది వరకూ అన్ని స్థాయిలలోనూ విమర్శననూ, ఆత్మవిమర్శననూ ప్రోత్సహించాలి. ముఖ్యంగా క్రింది నుండి విమర్శలు రావడానికి ప్రోత్సాహం ఇవ్వాలి.

(ఉ) నిరంకుశ పోకడలు పెరగకుండా అన్ని స్థాయిల్లోనూ ఎడతెగని పోరాటం జరగాలి.

(ఊ) పార్టీలో ఏ రూపంలోనూ ముఠాతత్వంగాని, ముఠాలు గట్టడం గాని సహించరాదు.

(ఎ) సౌహార్ద్ర సంబంధాలను, పరస్పర సహాయ భావాన్ని పెంపొందించడం ద్వారా పార్టీలో ఆత్మీయతను బలపరచుకోవాలి. కామ్రేడ్స్ పట్ల సానుభూతితో వ్యవహరించుతూ వారి తప్పులను సరిదిద్దాలి. పార్టీ సభ్యులనూ, వారి పనిని పరిశీలించేటప్పుడు చెదురుమదురుగా జరిగిన తప్పులను, ఘటనలను బట్టిగాక పార్టీ సేవలో వారి మొత్తం కృషిని దృష్టిలోకి తీసుకొని పరిశీలన జరపాలి.

## నిబంధన - 14

### అఖిల భారత పార్టీ మహాసభ

1. దేశం అంతటికీ సర్వోన్నతమైన పార్టీ నాయకత్వ సంస్థ అఖిల భారత పార్టీ మహాసభ.

(అ) సాధారణంగా పార్టీ మహాసభను మూడేండ్ల కొకసారి కేంద్రకమిటీ ఏర్పాటు చేయాలి.

(ఆ) తాను అవసరమని భావించే పక్షంలో కేంద్ర కమిటీ ప్రత్యేక పార్టీ మహాసభను తనకిష్టమొచ్చినప్పుడు జరపవచ్చు లేదా మొత్తం పార్టీ సభ్యత్వంలో మూడవ వంతుకు తగ్గని ప్రాతినిధ్యం గల రెండు లేక అంతకన్న ఎక్కువ రాష్ట్ర పార్టీ కమిటీలు డిమాండ్ చేసినప్పుడు కూడా పార్టీ ప్రత్యేక మహాసభను జరపాలి.

(ఇ) కేంద్ర కమిటీ ప్రత్యేకంగా సమావేశమై ప్రత్యేక పార్టీ మహాసభను లేదా పార్టీ మహాసభను గాని జరిపే తేదీని, స్థలాన్ని నిర్ణయం చేయవలసి వుంటుంది.

(ఈ) మామూలుగా జరిగే పార్టీ మహాసభకు రాష్ట్ర పార్టీ మహాసభల్లో ఎన్నికైన వారూ అఖిల భారత పార్టీ కేంద్రం అధీనంలో వున్న పార్టీ యూనిట్ల సమావేశాల్లో ఎన్నికైన వారూ ప్రతినిధులుగా వుంటారు.

(ఉ) ఆయా రాష్ట్రాలలో వున్న మొత్తం పార్టీ నాయకత్వాన నడిచే ప్రజా ఉద్యమాల బలమూ, ప్రజా సంఘాల బలమూ, పార్టీకున్న రాజకీయ ప్రాబల్యమూ ప్రాతిపదికపై మామూలుగా జరిగే మహాసభకు ప్రతినిధుల సంఖ్యను కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. ఇదే ప్రాతిపదికపై ప్రత్యేక మహాసభకు ప్రతినిధుల

సంఖ్యనూ, ఆ ప్రతినిధుల నెన్నుకొనే పద్ధతినీ కూడా కేంద్ర కమిటీయే నిర్ణయిస్తుంది.

(ఊ) అది ప్రత్యేక పార్టీ మహాసభ అయినా, మామూలు పార్టీ మహాసభ అయినా కేంద్ర కమిటీ సభ్యులు అందులో పూర్తి సభ్యులుగా పాల్గొనే హక్కును కలిగి వుంటారు.

2. మామూలుగా జరిగే పార్టీ మహాసభ విధులూ, అధికారాలూ ఈ క్రింది విధంగా వుంటాయి.

(అ) కేంద్ర కమిటీ సమర్పించే రాజకీయ మరియు నిర్మాణ నివేదికలను చర్చించి దానిపై చర్య తీసుకోవడం.

(ఆ) పార్టీ కార్యక్రమాన్ని, నిబంధనావళిని సవరించడం లేదా మార్పు చేయడం.

(ఇ) ప్రస్తుత పరిస్థితిపై పార్టీ విధానాన్ని నిర్ణయించడం

(ఈ) రహస్య బ్యాలెట్ ద్వారా కేంద్ర కమిటీని ఎన్నుకోవడం.

3. ప్రతినిధుల అర్హతలను పరిశీలించి, పార్టీ కాంగ్రెస్‌కు నివేదించే అర్హతల కమిటీని ఎన్నుకొంటుంది.

4. మహాసభ కార్యక్రమాన్ని నడిపేందుకు ఒక అధ్యక్ష వర్గాన్ని ఎన్నుకొంటుంది.

## నిబంధన - 15

### కేంద్ర కమిటీ

1. (అ) కేంద్ర కమిటీ సభ్యులను పార్టీ మహాసభ ఎన్నుకోవాలి. కేంద్ర కమిటీలో ఎంతమంది సభ్యులు వుండాలో పార్టీ మహాసభ నిర్ణయిస్తుంది.

(ఆ) రద్దవుతున్న కేంద్ర కమిటీ నూతన కమిటీలో వుండవలసిన సభ్యుల జాబితాను మహాసభ ముందు వుంచుతుంది.

(ఇ) ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి, కార్మికవర్గ విప్లవాత్మక దృక్పథంలో గాఢ విశ్వాసం కలిగి, మార్క్సిజం-లెనినిజం బాగా అధ్యయనం చేసిన సమర్థులైన నాయకులతో కేంద్ర కమిటీకి అభ్యర్థుల జాబితాను తయారు చేయాలి.

(ఈ) అలా ప్రతిపాదించిన జాబితాలో ఏ పేరుకైనా అభ్యంతరం చెప్పటానికి, మరో కొత్తపేరును గాని, పేర్లను గాని ప్రతిపాదించటానికి మహాసభకు చెందిన ఏ ప్రతినిధికైనా అధికారం వుంటుంది. అయితే ముందుగా ప్రతిపాదిత వ్యక్తి యొక్క అంగీకారాన్ని పొందాలి.

(ఉ) ప్రతిపాదిత వ్యక్తులలో ఎవరికైనా తమ పేరును ఉపసంహరించుకోవటానికి హక్కున్నది.

(ఊ) అలా ప్రతిపాదించిన పేర్ల జాబితాకు ప్రతినిధులు అదనంగా ప్రతిపాదించిన పేర్లను జత చేసి యీ జాబితాపై మహాసభలో ఓటింగు జరుగుతుంది. దానిపై సింగిల్ డిస్ట్రిబ్యూటర్ ఓటింగ్ (ఎన్నిక కావలసిన అభ్యర్థుల సంఖ్య ఎంత వుంటే అన్ని ఓట్లు ప్రతి ప్రతినిధికి వుంటాయి) పద్ధతి మీద రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరుగుతుంది. అదనపు నామినేషన్ ఏమీ లేనప్పుడు చేతులెత్తడం ద్వారా ప్రతినిధుల అంగీకారం తీసుకోబడుతుంది.

2. పార్టీ అఖిల భారత మహాసభకూ, మహాసభకూ మధ్యకాలంలో పార్టీ అత్యున్నతాధికార సంస్థగా కేంద్ర కమిటీ వుంటుంది.

3. నిబంధనావళిని అమలు జరపడానికి, పార్టీ మహాసభలో ఆమోదించిన రాజకీయ విధానాన్ని, నిర్ణయాలను అమలు జరపటానికి కేంద్ర కమిటీ బాధ్యత వహించుతుంది.

4. పార్టీ మొత్తానికి కేంద్ర కమిటీ ప్రాతినిధ్యం వహించుతుంది. పార్టీ మొత్తం పనిని నడిపించడానికి కూడా అది బాధ్యత వహించుతుంది. పార్టీ ఎదుర్కొనే ఏ సమస్యపైన అయినా పూర్తి అధికారంతో నిర్ణయాలను తీసుకొనే హక్కు కేంద్ర కమిటీకి వుంటుంది.

5. కేంద్ర కమిటీ తన సభ్యులలో నుండి ప్రధాన కార్యదర్శితో సహా ఒక పొలిట్‌బ్యూరోను ఎన్నుకొంటుంది. పొలిట్‌బ్యూరోలో ఎంతమంది సభ్యులు వుండాలో కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. కేంద్ర కమిటీ రెండు సమావేశాల మధ్య దాని పనిని పొలిట్‌బ్యూరో కొనసాగిస్తుంది. కేంద్ర కమిటీ రెండు సమావేశాల మధ్య రాజకీయ నిర్మాణ నిర్ణయాలను తీసుకొనే హక్కును పొలిట్‌బ్యూరో కలిగి వుంటుంది.

(అ) కేంద్ర కమిటీ తన సభ్యుల నుండి కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకుంటుంది. కార్యదర్శి వర్గ సభ్యుల సంఖ్యను కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. కార్యదర్శి

వర్గం పొలిట్‌బ్యూరో పర్యవేక్షణలో పార్టీ కేంద్రంలో రోజువారీ పనిని చూస్తుంది. కేంద్ర కమిటీ నిర్ణయాలను అమలు చేయడంలో పొలిట్‌బ్యూరోకి సహాయపడుతుంది.

6. రాష్ట్రకమిటీ కార్యదర్శుల ఎన్నిక, రాష్ట్ర పార్టీ పత్రికల సంపాదకుల ఎన్నిక కేంద్ర కమిటీ ఆమోదాన్ని పొందాలి.

7. (అ) తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం, దుష్ప్రవర్తన లేదా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు – ఈ నేరాలకు గాను కేంద్ర కమిటీ తన సభ్యులలో ఎవరినైనా కమిటీ నుండి తొలగించవచ్చు. అలా తొలగించటానికి హాజరైన కమిటీ సభ్యులలో మూడింట రెండు వంతుల మంది అందుకు ఓటు చేయవలసి వుంటుంది. ఏ సందర్భంలో అయినప్పటికీ మొత్తం కేంద్ర కమిటీ సభ్యులలో సగానికంటే ఎక్కువ మంది హాజరైన సమావేశంలో మాత్రమే అలా తొలగించడానికి హక్కు కలిగి వుంటారు.

(ఆ) కమిటీలో ఏర్పడే ఖాళీని మొత్తం సభ్యులలో సాధారణ మెజారిటీతో భర్తీ చేయవచ్చు.

(ఇ) కేంద్ర కమిటీలో ఒక సభ్యుడుగాని లేదా కొంతమంది సభ్యులుగాని అరెస్టు అయిన పక్షంలో వారి స్థానంలో అందుకు ప్రత్యామ్నాయంగా సభ్యులను కో–ఆప్టు చేసుకోవచ్చు. అలా కో–ఆప్టు చేసుకొన్న సభ్యులు అంతకుముందున్న సభ్యుల వలెనే పూర్తి హక్కులను కలిగి వుంటారు. అయితే అరెస్టు అయిన సభ్యులు విడుదలై తమ విధులను నిర్వహించడం ప్రారంభించగానే కో–ఆప్టు అయిన సభ్యులు తమ స్థానాలను ఖాళీ చేయవలసి వుంటుంది.

8. రెండు కేంద్ర కమిటీ సమావేశాల మధ్యకాలం మామూలుగా మూడు మాసాలకు మించరాదు. మొత్తం సభ్యులలో మూడింట ఒక వంతు ఎప్పుడు కోరితే అప్పుడు సమావేశం జరపాలి.

9. కేంద్ర కమిటీ రాజకీయ మరియు నిర్మాణ సమస్యలను, ప్రజా ఉద్యమాలకు సంబంధించిన సమస్యలను చర్చించి నిర్ణయాలు చేయాలి. రాష్ట్ర కమిటీలకు, ప్రజా సంస్థల అఖిల భారత పార్టీ ఫ్రాక్షన్‌లకు సలహాలిస్తూ వుండాలి.

10. పార్టీ సొమ్ముకు కేంద్ర కమిటీ బాధ్యత వహిస్తుంది. ఏడాదికొకసారి పొలిట్‌బ్యూరో సమర్పించే ఆదాయ–వ్యయపట్టికను ఆమోదించుతుంది.

11. పార్టీ మహాసభ జరిగినప్పుడల్లా కేంద్ర కమిటీ తన రాజకీయ, నిర్మాణ నివేదికను ఆ మహాసభకు సమర్పించాలి.

12. పార్టీ విప్లవ నాయకత్వాన్ని బలపర్చే ఉద్దేశంతోనూ రాష్ట్ర, జిల్లా సంస్థలపై అజమాయిషీ వుంచటానికి గాను కేంద్ర కమిటీ తన ప్రతినిధులనూ, ఆర్గనైజర్లనూ పంపుతుంది. వీరు ప్రతి దఫా కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరోలు గావించే ప్రత్యేక ఆదేశాలననుసరించి పని చేయవలసి వుంటుంది.

13. కేంద్ర కమిటీ అవసరమని తలచినప్పుడు కేంద్ర కమిటీ విస్తృత సమావేశాన్ని గాని, ప్లీనంనుగాని, కాన్ఫరెన్సును గాని పిలవవచ్చును. ఇటువంటి సమావేశాలకు ప్రతినిధులు ఏ ప్రాతిపదికపై హాజరు కావాలి. వారెలా ఎన్నికకావాలి అన్న విషయాలను కేంద్ర కమిటీయే నిర్ణయిస్తుంది.

14. అత్యవసర కాలాలలో గాని లేదా పెద్ద ఎత్తున అరెస్టులు జరిగినప్పుడు గాని కేంద్ర, రాష్ట్ర, జిల్లా కమిటీలు దృఢమైన చిన్న సంస్థలుగా నిర్మాణమవుతాయి. కేంద్ర కమిటీని అలా పునర్నిర్మించుటకు బైట మిగిలి వున్న పొలిట్‌బ్యూరో సభ్యులు పేర్ల జాబితాను తయారు చేస్తారు. లోపల, బయట వున్న కేంద్ర కమిటీ సభ్యులు ఆ పేర్లను ఆమోదించాలి. రాష్ట్ర, జిల్లా కమిటీల పునర్నిర్మాణమునకు గాను పేర్లను ఆయా కమిటీలకు చెంది అరెస్టు కాకుండా వున్న వారు తయారు చేస్తారు. వాటిని వాటిపై కమిటీలు ఆమోదించాలి. అవి తమ విద్యుక్త ధర్మాలనూ, బాధ్యతలనూ నెరవేర్చటానికిగాను అవసరమనుకున్న ఉపసంఘాలను ఏర్పరచవచ్చును. పునర్నిర్మితమైన కేంద్ర కమిటీ పార్టీ సంస్థల సంరక్షణార్థం కొత్త నిబంధనలను తయారు చేయుటకు అధికారం కలిగి యున్నది. అయితే, పరిస్థితి మామూలు స్థితికి వచ్చినప్పుడు ఎన్నికైన కమిటీలు పునరుద్ధరించబడతాయి.

15. ఏ ఒక్క వ్యక్తి మూడు పూర్తి పదవీ కాలాలకు మించి ప్రధాన కార్యదర్శి పదవిలో ఉండరాదు. పూర్తి పదవీకాలం అంటే రెండు మహాసభల మధ్య కాలం. ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే మూడు పూర్తి పదవీ కాలాలు పూర్తి చేసిన వ్యక్తి నాల్గవ దఫా కూడా నాల్గింట మూడువంతుల కేంద్ర కమిటీ సభ్యుల ఆమోదంతో ఎన్నిక కావచ్చు. ఎట్టి పరిస్థితులలోనూ ఆ వ్యక్తి నాల్గవ దఫాకి మించి ఎన్నిక కారాదు.

# నిబంధన-16

## రాష్ట్ర జిల్లా పార్టీ సంస్థలు

1. రాష్ట్రంలో లేదా జిల్లాలో ఆయా రాష్ట్ర, జిల్లా మహాసభయే అత్యున్నతమైన పార్టీ సంస్థ. ఆ మహాసభల్లో రాష్ట్ర కమిటీని లేదా జిల్లా కమిటీని ఎన్నుకుంటారు.

2. (అ) రాష్ట్ర లేదా జిల్లా పార్టీ కమిటీల నిర్మాణ స్వరూపం, వాటి హక్కులూ, విధులూ అఖిల భారత స్థాయిని, పైన నిర్ణయించిన నిబంధనలను పోలి వుంటాయి.

   అయితే వాటి విధులు రాష్ట్రానికి లేదా జిల్లా సమస్యలకే పరిమితమై వుంటాయి. అవసరాల రీత్యా ఆయా కమిటీల్లో సభ్యుల సంఖ్యను పై కమిటీ ఆమోదంతో పెంచుకోవచ్చు.

   (ఆ) ఆయా రాష్ట్రం లేదా జిల్లా కమిటీలు కార్యదర్శితో సహా ఒక కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకొంటాయి. కాని పై కమిటీ అనుమతించే పక్షంలో రాష్ట్ర లేక జిల్లా కమిటీ కార్యదర్శివర్గం అనేది లేకుండా వుండవచ్చు.

   (ఇ) ఏ పార్టీ సభ్యుడైనా క్రమశిక్షణను ఘోరంగా ఉల్లంఘించినా, నీతి బాహ్యంగా ప్రవర్తించినా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు జరిపినా అట్టి వానిని రాష్ట్ర కమిటీ లేక జిల్లా కమిటీ తన మొత్తం సభ్యులలోని అధిక సంఖ్యాకుల నిర్ణయంపై కమిటీల నుండి తొలగించుతుంది.

3. (అ) ఉద్యమ అవసరాలను బట్టి జిల్లా కమిటీ ప్రాంతాన్ని రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తుంది. అట్టి ప్రాంతం పరిపాలిత ప్రాంతానికే ఖచ్చితంగా కట్టుబడి వుండవలసిన అవసరం లేదు.

   (ఆ) ప్రాథమిక యూనిట్ (శాఖ)కు, జిల్లా లేక ప్రాంతీయ కమిటీకి మధ్య వుండవలసిన వివిధ పార్టీ సంస్థల నియామకాన్ని రాష్ట్ర కమిటీ నిర్ణయించవలసి వుంటుంది. ఆ సంస్థల స్వరూపాన్ని, వాటి విధులను గురించి కూడా అవసరమైన నిబంధనలను రాష్ట్ర కమిటీయే నిర్ణయిస్తుంది. కేంద్ర కమిటీ నిర్ణయించిన రూల్సుకు అనుగుణంగానే ఇది జరుగుతుంది.

4. ఏ ఒక్క వ్యక్తి మూడు పూర్తి పదవీ కాలాలకు మించి రాష్ట్రం / జిల్లా / ఇతర మధ్యంతర కమిటీలకు కార్యదర్శిగా ఉండరాదు. పూర్తి పదవీకాలం అంటే రెండు మహాసభల మధ్య కాలం. ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే మూడు పూర్తి పదవీ కాలాలు పూర్తి చేసిన వ్యక్తి కార్యదర్శిగా నాల్గవ దఫా కూడా

నాల్గింట మూడు వంతుల కమిటీ సభ్యుల ఆమోదంతో పాటు రాష్ట్ర కమిటీ ఆమోదంతో ఎన్నిక కావచ్చు. రాష్ట్ర కార్యదర్శిగా కూడా నాల్గవ దఫా ఎన్నిక కావాలంటే కేంద్ర కమిటీ ఆమోదంతో ఎన్నిక కావచ్చు.

## నిబంధన-17

### ప్రాథమిక యూనిట్

1. (అ) పార్టీ ప్రాథమిక యూనిట్‌గా పార్టీ శాఖ వుంటుంది. అది వృత్తిగానీ లేక ప్రాంతాన్ని గాని ఆధారం చేసుకొని ఏర్పాటవుతుంది.

   (ఆ) ఒక ఫ్యాక్టరీలోగాని, ఒక సంస్థలోగాని లేదా ఒక పరిశ్రమలోగాని ఉన్న పార్టీ సభ్యులను వారి వారి వృత్తులను బట్టి లేదా చేసే పనిని బట్టి శాఖలను ఏర్పాటు చేయాలి. ఆ విధంగా పార్టీ శాఖలు ఏర్పడినప్పుడు అలాంటి పార్టీ శాఖలోని సభ్యులు తాము నివసించే ప్రాంతాల్లోని పార్టీ శాఖల్లో అసోసియేట్ సభ్యులుగా ఉంటారు. లేదా ఆ ప్రాంతాల్లో సహాయ శాఖలుగా వ్యవహరించవచ్చు. వారు నివసించే ప్రాంతాల్లో వారికి అప్పజెప్పే పనులు ఫ్యాక్టరీలో లేదా వారు పని చేసే సంస్థల్లో పార్టీ శాఖ అప్పగించిన పనులకు ఆటంకం కలిగించే విధంగా ఉండరాదు.

   (ఇ) శాఖలోని సభ్యుల సంఖ్య పదిహేనుకు మించి ఉండరాదు. శాఖ పనులు, ఇతర విషయాలను గూర్చి రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తుంది.

2. తన ప్రాంతంలోగాని, తన రంగంలోగాని ఉండే కార్మిక, రైతు తదితర తరగతుల ప్రజానీకానికి, పార్టీ ఉన్నత కమిటీలకూ మధ్య సజీవ సంబంధంగా ఉండేది శాఖ. దాని కర్తవ్యాలు ఇవి :

   (అ) పై కమిటీ ఆదేశాలను అమలు జరుపుట.

   (ఆ) తన ఫ్యాక్టరీలోగానీ, ప్రాంతంలోగాని ఉండే ప్రజాసామాన్యం పార్టీ రాజకీయ, నిర్మాణ నిర్ణయాలను బలపర్చునట్లు చేయుట.

3. రోజువారీ కార్యక్రమాన్ని అమలు జరపటానికిగాను శాఖ తన కార్యదర్శిని ఎన్నుకుంటుంది. పై కమిటీ ఆ ఎన్నికను ధృవపర్చాలి.

## నిబంధన - 18

### కేంద్ర రాష్ట్ర కంట్రోలు కమీషనులు

1. అయిదుగురు సభ్యులకు మించని కేంద్ర కంట్రోలు కమిషన్‌ను పార్టీ మహాసభ నేరుగా ఎన్నుకొంటుంది. కేంద్ర కమిటీ ఎక్స్‌–అఫీషియో సభ్యుడుగా కేంద్ర కంట్రోలు కమిషన్ అధ్యక్షులు వుంటారు.

2. కంట్రోలు కమిషన్ చేపట్టే బాధ్యతలు :

   (అ) కేంద్ర కమిటీ లేదా పొలిట్‌బ్యూరో నివేదించిన క్రమశిక్షణా చర్యల కేసులు

   (ఆ) రాష్ట్ర కమిటీలు క్రమశిక్షణా చర్యలు చేపట్టినప్పుడు విజ్ఞప్తి చేసుకొన్న కేసులు

   (ఇ) పూర్తి స్థాయి పార్టీ సభ్యత్వం నుండి బహిష్కరణ, సస్పెన్షన్‌కు సంబంధించిన కేసులపైనా, పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించరాదన్న నిర్ణయాలపైనా, రాష్ట్ర కమిటీ లేదా రాష్ట్ర కంట్రోలు కమీషన్‌కు చేసుకున్న విజ్ఞప్తులను తిరస్కరించినప్పుడు

3. కేంద్ర కంట్రోలు కమీషన్ నిర్ణయమే అంతిమ నిర్ణయం. దీనికి అందరూ కట్టుబడి వుండాలి. కాని అసాధారణ కేసులలో కేంద్ర కంట్రోలు కమిషన్ నిర్ణయాలను నిలిపివేసే, సవరించే, తిరస్కరించే అధికారం కేంద్రకమిటీకి ఉంటుంది. అయితే ఆ నిర్ణయానికి హాజరయిన సభ్యుల్లో మూడింట రెండువంతులకు తగ్గని మెజారిటీ మద్దతు ఉండాలి. అలాంటి అన్ని నిర్ణయాలను తదుపరి ఆలిండియా పార్టీ మహాసభకు నివేదించాలి.

4. కంట్రోలు కమిషన్ పని విధానానికి సంబంధించిన సవివరమైన నిబంధనలకు కంట్రోలు కమిషన్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం కేంద్ర కమిటీ రూపొందిస్తుంది.

5. పార్టీ మహాసభల నడుమ కేంద్ర కంట్రోలు కమిషన్‌లో ఖాళీ ఏర్పడిన పక్షంలో దానిని భర్తీ చేసే హక్కు కేంద్ర కమిటీకి వుంది.

6. క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన కేసులను పరిశీలించేటందుకుగాను రాష్ట్ర మహాసభ, రాష్ట్ర కంట్రోలు కమిషన్‌ను ఎన్నుకొనవచ్చును. ఏదైనా రాష్ట్రానికి రాష్ట్ర కంట్రోలు కమిషన్ ఏర్పడినట్లయితే దాని పని విధానమూ, అధికారములు కేంద్ర కంట్రోలు కమిషన్‌ను పోలి ఉంటాయి. అయితే యివి తన రాష్ట్రానికి మాత్రమే పరిమితమై వుంటాయి.

# నిబంధన-19

## పార్టీ క్రమ శిక్షణ

1. పార్టీ ఐక్యతను సంరక్షించి బలోపేతం చేయడానికి, దాని బలాన్నీ, పోరాట పటిమను, ప్రతిష్టను పెంపొందించటానికి, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలను అమలు జరపడానికి క్రమశిక్షణ తప్పనిసరిగా అవసరం. పార్టీ క్రమశిక్షణను ఖచ్చితంగా అంటిపెట్టుకొని వుండకపోతే ప్రజలకు నాయకత్వం వహించి పోరాటాలలోకి, కార్యకలాపాలలోకి దించడం సాధ్యం కాదు. ప్రజల పట్ల తనకున్న బాధ్యతలను పార్టీ నిర్వర్తించలేదు.
2. పార్టీ లక్ష్యాలను, కార్యక్రమాన్ని, విధానాలను చైతన్యపూరితంగా ఆమోదించడం మీదనే క్రమశిక్షణ ఆధారపడి వుంటుంది. పార్టీ సభ్యులంతా పార్టీ నిర్మాణంలోగాని, ప్రజా జీవితంలోగాని వారికి గల స్థానాలతో నిమిత్తం లేకుండా పార్టీ క్రమశిక్షణకు సమముగానే బద్ధులవుతారు.
3. పార్టీ నిబంధనావళినీ, పార్టీ నిర్ణయాలను ఉల్లంఘించడం, కమ్యూనిస్టు పార్టీ సభ్యునికి తగని విధంగా ఏ పనినైనా చేయడం లేక వ్యవహరించడం, పార్టీ క్రమశిక్షణను భంగపరిచినట్లే అవుతుంది. అలాంటి వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొనబడతాయి.
4. క్రమశిక్షణా చర్యలనగా ? :
   (అ) మందలింపు.
   (ఆ) అభిశంసన.
   (ఇ) బహిరంగ అభిశంసన.
   (ఈ) పార్టీలోనున్న స్థానాల నుండి తొలగించడం.
   (ఉ) ఏడాదికి మించకుండా ఎంతకాలమైనా పార్టీ పూర్తి సభ్యత్వాన్నుండి తొలగించడం.
   (ఊ) బహిష్కరణ.
5. ఒక కామ్రేడ్ తప్పులను సరిదిద్దడానికి నచ్చచెప్పటం మొదలగు యితర పద్ధతులన్నీ విఫలమైన తరువాతనే సాధారణంగా క్రమశిక్షణా చర్యలు తీసుకొనబడతాయి. అలా క్రమశిక్షణా చర్యలు తీసుకున్న సందర్భాల్లో కూడా అందుకు సంబంధించిన కామ్రేడ్‌ను సరిదిద్దడానికి కృషి సాగుతూనే వుండాలి. పార్టీ ప్రయోజనాలనూ,

పార్టీ ప్రతిష్టనూ కాపాడుటకు అత్యవసర క్రమశిక్షణా చర్య తీసుకోవలసినంత తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘన జరిగితే వెనువెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోబడతాయి.

6. పార్టీ నుండి బహిష్కరణ అన్ని శిక్షణా చర్యలలో కల్లా అతి తీవ్రమైనది. అందువల్ల పార్టీనుండి బహిష్కరించే చర్యను తీసుకునేటప్పుడు అత్యంత జాగరూకతతోనూ, పరిశీలనతోనూ తీసుకోవాలి.

7. పై కమిటీ ధృవీకరణ లేకుండా పార్టీ పదవుల నుంచి తొలగించడం, విచారణ జరుగుతున్నప్పుడు మినహా పార్టీ సభ్యత్వం నుండి సస్పెండ్ చేయటం, పార్టీ నుంచి బహిష్కరించటం వంటి క్రమశిక్షణా చర్యలను అమలు చేయరాదు. బహిష్కరణ అయినట్లయితే పై కమిటీ ధృవీకరణ వచ్చేవరకు క్రమశిక్షణా చర్యకు గురైన పార్టీ సభ్యుని పార్టీ కార్యకలాపాలన్నింటి నుంచి దూరంగా వుంచటం జరుగుతుంది. బహిష్కరణను పై కమిటీ ధృవీకరించే వరకు బహిష్కృత సభ్యుడు సస్పెన్షన్‌లో వుంటాడు. పై కమిటీ తన నిర్ణయాన్ని ఆరుమాసాలలోగా తెలియజేయాలి.

8. ఏ కామ్రేడ్ మీదనైతే క్రమశిక్షణా చర్యను తీసుకోవాలన్న ప్రతిపాదనవచ్చిందో ఆ కామ్రేడ్‌కు అతనిపై మోపిన ఆరోపణలను, అందుకు సంబంధించిన తదితర వివరాలను తెలియజేయాలి. తాను ఏ యూనిట్‌లో సభ్యుడో ఆ యూనిట్ ముందు స్వయంగా హాజరై తన వాదనను చెప్పుకోవటానికి, తనపై చర్య తీసుకొనే యితర యూనిట్‌కు తన సమాధానమును దాఖలు చేసుకోవటానికి అతనికి లేక ఆమెకు హక్కు వున్నది.

9. ఒకరు రెండు పార్టీ యూనిట్లలో ఏకకాలంలో సభ్యుడుగా వున్నట్లయితే క్రింది యూనిట్ అతనిపై లేక ఆమెపై క్రమశిక్షణా చర్య తీసుకోమని సిఫార్సు చేయవచ్చును. కాని పై యూనిటు అంగీకరించేవరకు ఆ శిక్షణా చర్య అమల్లోకి రాదు.

10. సమ్మె విచ్ఛిన్నకులకూ, త్రాగుబోతులకూ, నైతికంగా అధోగతి పాలైన వారికి, పార్టీ విశ్వాసానికి ద్రోహం చేసిన వారికి, తీవ్రమైన ఆర్థిక అవకతవకలను చేసిన వారికి ఛార్జిషీట్లు ఇచ్చి వారు తమ సమాధానాన్ని పంపేలోగా తమ యూనిట్‌చే గాని లేక ఆపై పార్టీ సంస్థచేగాని వెనువెంటనే పార్టీ సభ్యత్వం నుండి సస్పెండు చేయడం, పార్టీలో వారికి గల అన్ని బాధ్యతాయుత స్థానాల నుండి తొలగించటం జరుగుతుంది. పార్టీ బాధ్యతలన్నింటి నుంచి తొలగింపు, సస్పెన్షన్ కాలాన్ని మూడు మాసాలకు మించి పొడిగించరాదు.

11. శిక్షణా చర్యను తీసుకొన్న అన్ని సందర్భాల్లోనూ అప్పీలు చేసుకొనే హక్కు ఉంటుంది.

12. ఎల్లప్పుడు అదే పనిగా పార్టీ నిర్ణయాలను, విధానాన్ని ధిక్కరిస్తూ, తీవ్రమైన ముఠాతత్వం కలిగి, పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించే ఏ క్రింది కమిటీనైనా రద్దు చేసి, కొత్త కమిటీలను ఏర్పరచుకోవటానికి లేదా శిక్షణా చర్యలను తీసుకోవటానికి, గాని, కేంద్ర, రాష్ట్ర, జిల్లా కమిటీలకు హక్కు ఉంది. అయితే తాము తీసుకున్న ప్రతి చర్యనూ, రాష్ట్ర, జిల్లా కమిటీలు వెనువెంటనే తమపై కమిటీలకు తెలియజేయాలి.

13. కొన్ని సాధారణ పరిస్థితులలో, మిక్కిలి తీవ్రమైన పార్టీ వ్యతిరేక చర్యలకు పూనుకొన్న పార్టీ సభ్యులను బహిష్కరించుటకుగాను పార్టీ కమిటీలు తమ విచక్షణను ఉపయోగించవచ్చు.

## నిబంధన-20

### ప్రజా సంస్థలకు ఎన్నికైన పార్టీ సభ్యులు

1. పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభకు లేదా స్థానిక పరిపాలనా సంస్థలకు ఎన్నికైన పార్టీ సభ్యులు ఒక పార్టీ గ్రూపుగా ఏర్పడి, అందుకు సంబంధించిన పార్టీ కమిటీ క్రింద, పార్టీ విధానాలకు, కార్యక్రమానికి, ఆదేశాలకు ఖచ్చితంగా అంటిపెట్టుకొని వుంటూ పని చేయాలి.

2. కమ్యూనిస్టు శాసనసభ్యులు అచంచల దీక్షతో ప్రజల ప్రయోజనాలను కాపాడాలి. శాసనసభ లోపల వారు చేసే పని ప్రజా ఉద్యమాన్ని ప్రతిబింబిస్తూ ఉండాలి. అక్కడ వారు పార్టీ విధానాలను బలపరుస్తూ వాటిని ప్రచారంలోకి తీసికొని రావాలి. కమ్యూనిస్టు శాసనసభ్యుల శాసనసభా కార్యక్రమాన్ని బయట జరిగే పార్టీ కార్యకలాపాలతోనూ, ప్రజా ఉద్యమాలతోనూ, సన్నిహిత మొనర్చుతూ మేళవింప చేయాలి. పార్టీని ప్రజా సంఘాలను నిర్మించడంలో తోడ్పడడం కూడా వారు విధిగా ఎంచుకోవాలి.

3. తమను ఎన్నుకొన్న ఓటర్లతోనూ, ప్రజానీకంతోనూ, కమ్యూనిస్టు శాసనసభ్యులు అత్యంత సన్నిహితమైన సంబంధాలను వుంచుకొంటూ ఉండాలి. తమ శాసనసభా కార్యక్రమాన్ని గురించి వారికి సక్రమంగా తెలియజేస్తూ వారి నుండి ఎప్పటికప్పుడు సూచనలను పొందుతూ వుండాలి.

4. కమ్యూనిస్టు శాసనసభ్యులు వ్యక్తిగతంగా అత్యంత నిజాయితీపరులుగా వుండాలి. నిరాడంబర జీవితాన్ని గడపాలి. ప్రజలతో వ్యవహరించేటప్పుడు వినయం కలిగి వుండాలి. స్వప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలనే మిన్నగా ఎంచుకోవాలి.
5. కమ్యూనిస్టు శాసనసభ్యులూ, కమ్యూనిస్టు స్థానిక సంస్థల సభ్యులూ తీసుకొనే జీతాలు, భత్యాలూ పార్టీ సొమ్ముగా భావించబడుతుంది. ఈ సభ్యుల జీతాలనూ, భత్యాలనూ అందుకు సంబంధించిన పార్టీ కమిటీలు నిర్ణయించుతాయి.
6. కార్పొరేషన్లకు, మున్సిపాల్టీలకు, బస్తీ లేక ఏరియాకమిటీలకు, జిల్లాపరిషత్తులకు, పంచాయతీ సమితులకూ, గ్రామ పంచాయతీలకు ఎన్నికైన పార్టీ సభ్యులు అందుకు సంబంధించిన పార్టీ కమిటీ లేదా పార్టీ శాఖ క్రింద పని చేయాలి. వారంతా తమను ఎన్నుకొన్న ఓటర్లతోనూ, ప్రజాసామాన్యంతోనూ సన్నిహితమైన దైనందిన సంబంధాలను పెట్టుకొంటూ తాము ఎన్నికైన సంస్థలలోవారి ప్రయోజనాలను కాపాడాలి. తమను ఎన్నుకొన్న ఓటర్లకు, ప్రజలకు తమ పనిని గురించి సక్రమంగా రిపోర్టులిస్తూ వారి సూచనలను, సలహాలను తీసుకోవాలి. స్థానిక సంస్థల్లో చేసే తమ పనిని బయట జరిగే ప్రజా కార్యక్రమాలతో జోడించాలి.
7. పార్లమెంటుకు, శాసనసభలకు, కేంద్ర పాలిత ప్రాంతాలలో కౌన్సిళ్ళకు జరిగే ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల పేర్లకు కేంద్ర కమిటీ ఆమోదాన్ని పొందాలి.

   కార్పొరేషన్‌లకు, మున్సిపాలిటీలకు, జిల్లా బోర్డులకు, స్థానిక బోర్డులకు పంచాయతీలకు పార్టీ అభ్యర్థులను నిలబెట్టే విషయమై అనుసరించదగిన నియమాలను రాష్ట్ర కమిటీలు తయారు చేయాలి.

## నిబంధన 20 అ

భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసాన్ని మరియు విధేయతను కలిగి ఉన్నది. చట్టం నిర్దేశించిన భారత రాజ్యాంగానికి, సోషలిజానికి, సెక్యులరిజానికి, ప్రజాస్వామ్యానికి మరియు భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమైక్యతను, సమగ్రతను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నది.

## నిబంధన - 21

### పార్టీ అంతరంగిక చర్చలు

1. పార్టీని సమైక్యపరచటానికై పార్టీ మొత్తం వివిధ సంస్థలలోనూ, పార్టీ విధానంపై స్వేచ్ఛగానూ, క్రమంగా చర్చలు జరపటం ఉపయోగకరమూ, అవసరం కూడా.

ఇది పార్టీ అంతరంగిక ప్రజాస్వామ్యం నుండి ఉదయించే పార్టీ సభ్యుల విడదీయరాని హక్కు. అయితే పార్టీ విధానానికి సంబంధించిన సమస్యలపై ఎడతెగని చర్చలు జరపడం పార్టీ ఆంతరంగిక ప్రజాస్వామ్యాన్ని ఘోరంగా దుర్వినియోగం చేయటమే అవుతుంది.

2. అఖిల భారత స్థాయిలో పార్టీ ఆంతరంగిక చర్చలను కేంద్రకమిటీ ఈ క్రింది సందర్భాలలో ఏర్పాటు చేస్తుంది.

   (అ) అవసరమని తాను తలచినప్పుడు

   (ఆ) పార్టీ విధానానికి సంబంధించి ఏదైనా ఒక ముఖ్య అంశంపైన కేంద్ర కమిటీలో తగినంత గట్టి మెజారిటీ లేనప్పుడు,

   (ఇ) అఖిల భారత స్థాయిలో ఆంతరంగిక చర్చలు జరపాలని పార్టీ మొత్తం సభ్యులలో మూడవ వంతుకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర కమిటీలు కోరినప్పుడు.

3. తాను స్వయంగాగాని లేక రాష్ట్రంలో వున్న పార్టీ సభ్యుల మొత్తంలో మూడవ వంతు ప్రాతినిధ్యం వహించే జిల్లా కమిటీలు కోరినప్పుడు గాని కేంద్ర కమిటీ అనుమతితో రాష్ట్ర కమిటీ తన రాష్ట్రానికి సంబంధించిన పార్టీ విధానాలలోని ఏదైనా ఒక ముఖ్య అంశాన్ని చర్చించుటకై పార్టీ అంతరంగిక చర్చను ప్రారంభించవచ్చు.

4. పార్టీ ఆంతరంగిక చర్చలు కేంద్ర కమిటీ పర్యవేక్షణలో జరగాలి. చర్చనీయాంశాలను అదే తయారు చేస్తుంది. ఈ చర్చను పర్యవేక్షించే కేంద్ర కమిటీయే ఆ చర్చను సాగించే పద్దతిని కూడా నిర్ణయిస్తుంది.

   రాష్ట్ర కమిటీ చర్చను ప్రారంభించినప్పుడు కేంద్ర కమిటీ అంగీకారంతో చర్చనీయాంశాలను తయారు చేస్తుంది. చర్చల పద్ధతిని నిర్ణయిస్తుంది.

## నిబంధన - 22

### పార్టీ మహాసభకు, ఇతర మహాసభలకు ముందు జరిగే సన్నాహక చర్చ

1. అఖిల భారత పార్టీ మహాసభ జరిగేనాటికి రెండు నెలల ముందుగానే పార్టీ యూనిట్లన్నీ చర్చించేందుకుగాను ముసాయిదా తీర్మానాన్ని కేంద్ర కమిటీ పంపిస్తుంది. కేంద్ర కమిటీ విడుదల చేసిన ముసాయిదా తీర్మానాన్ని వివిధ

భాషలలో తర్జుమా చేసి అన్ని పార్టీ శాఖలకు సాధ్యమైనంత తక్కువ కాలంలో అవసరమైన కాపీలను అందచేయవలసిన బాధ్యత రాష్ట్ర కమిటీలపై ఉన్నది. ఆ తీర్మానానికి ప్రతిపాదించిన సవరణలన్నింటినీ నేరుగా కేంద్ర కమిటీకి పంపాలి. కేంద్ర కమిటీ వాటిపై రిపోర్టు తయారు చేసి పార్టీ మహాసభ ముందు పెడుతుంది.

2. ప్రతిస్థాయిలోను ఆయా కమిటీలు సమర్పించిన నివేదికలు, తీర్మానాల ఆధారంగా మహాసభలు జరుగుతాయి.

## నిబంధన - 23

### ప్రజాసంఘాల్లో పని చేసే పార్టీ సభ్యులు

ప్రజాసంఘాల్లోనూ, ఆ సంఘాల కార్యనిర్వాహక వర్గాల్లోను పనిచేసే పార్టీ సభ్యులు అందుకు సంబంధించిన పార్టీ కమిటీ నాయకత్వాన ఫ్రాక్షన్ కమిటీలుగా ఏర్పడి పని చేయాలి. వారు తాము పనిచేసే ప్రజాసంఘాల ప్రజాపునాదిని, పోరాట పటిమను బలోపేతం చేయడానికి సదా కృషిని సాగించాలి.

## నిబంధన - 24

### బైలాస్

పార్టీ నిబంధనావళికి లోబడి కేంద్ర కమిటీ కొన్ని నియమాలను, కొన్ని నిబంధనలను (బైలాస్) తయారు చేయవచ్చు. రాష్ట్ర కమిటీ కూడా పార్టీ నిబంధనావళికి లోబడి కొన్ని నియమాలను, నిబంధనలను కేంద్ర కమిటీ అనుమతితో తయారు చేసుకోవచ్చు.

## నిబంధన - 25

### సవరణ

పార్టీ నిబంధనావళిని సవరించే అధికారం పార్టీ మహాసభకు మాత్రమే వుంది. నిబంధనావళిని సవరించడానికి చేసే ప్రతిపాదనల నోటీసును పార్టీ మహాసభ జరగడానికి రెండు నెలల ముందుగానే పంపాలి.

# పార్టీ నిబంధనావళి క్రింద రూల్స్

(1988 ఏప్రిల్ 8–10 తేదీలలో కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినవి)

ఆర్టికల్ 4, సెక్షన్ (10) సభ్యత్వం

ఒక శాఖ నుండి మరొక శాఖకు, ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి సభ్యత్వం బదిలీ గురించి :

**వివరణ :** ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి సభ్యత్వం బదిలీ కేంద్ర కమిటీ ద్వారానే జరుగుతున్నప్పటికీ అందుకై పేర్కొంటున్న వివరాలు సాధారణంగా సంపూర్ణంగా వుండటం లేదు. అందువల్ల రాష్ట్రాలు ఒక కామ్రేడ్ సభ్యత్వాన్ని ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి బదిలీ చేయమని కోరేటప్పుడు ఆ రాష్ట్రం ఈ క్రింది విషయాలను స్పష్టంగా పేర్కొనాలి. ప్రతి స్థాయిలో పార్టీ సభ్యుని రికార్డు సక్రమంగా వుంచడానికి అది అవసరం. అదేవిధంగా రాష్ట్రంలో బదిలీ చేయాలన్నా అదే వర్తిస్తుంది.

**రూల్స్ - సభ్యత్వం బదిలీ**

1. బదిలీ కాపీతోపాటు క్రింది వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలి.

| | |
|---|---|
| కామ్రేడ్ పేరు | : |
| వయస్సు | : |
| పార్టీలో చేరిన సంవత్సరం | : |
| ఆమె / అతడు ఏ శాఖకు చెందిన వారు ? | : |
| ఆమె / అతడు పని చేసిన ప్రజాసంఘం ? | : |
| నెలవారీ లెవీ మరియు ఎప్పటివరకు చెల్లించారు ? | : |
| ఏమైనా క్రమశిక్షణా చర్య తీసుకుంటే దాని రికార్డు | : |
| ఆమె / అతడు ఏ రాష్ట్రం నుండి బదిలీ కావాలి | : |

ఆమె / అతడు ఏ రాష్ట్రానికి బదిలీ కావాలి :

పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ సంవత్సరం :

ఆమె / అతనితో సంబంధం పెట్టుకోవాలంటే అవసరమైన చిరునామా :

## ఆగ్జిలరీ గ్రూపులు

(**వివరణ** : ప్రజాపోరాటాలలో సమరశీలంగా పాల్గొన్నవారిని ఆగ్జిలరీ గ్రూపులుగా ఏర్పాటుచేసి, వారు పార్టీ సభ్యులుగా తీసుకునే విధంగా చైతన్యాన్ని పెంచి శిక్షణ అందించాలని సాల్కియా ప్లీనం నిర్దేశించింది. దీనికోసం రూల్సులో చోటుకల్పించవలసి ఉంది.

1. ప్రజా ఉద్యమాల క్రమంలో సమరశీలురుగా ముందుకొచ్చి చురుగ్గాపాల్గొన్న వారిని, ప్రజాఉద్యమాలలోని వారిని ఆగ్జిలరీ గ్రూపులుగా సంఘటితపర్చడానికి పార్టీ శాఖలు చర్యలు తీసుకోవాలి. ఈ ఆగ్జిలరీ గ్రూపులు విశాలమైన పార్టీ సానుభూతిపరుల గ్రూపులుగా ఉంటాయి.

2. ఆగ్జిలరీ గ్రూపులోని వారు తగినంత సమయంలో పార్టీ కేండిడేట్ సభ్యులుగా చేరే విధంగా పార్టీ కార్యక్రమం గురించి, మౌలిక సూత్రాల గురించి విద్యావంతులను చేసి, శిక్షణ ఇచ్చేందుకు పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి.

### నిబంధన 6 క్రింద

#### పార్టీ సభ్యత్వ రికార్డులు

**రూలు :** సభ్యత్వ రికార్డులు పార్టీ జిల్లా కమిటీల వద్ద ఉంచాలని నిబంధనావళి చెబుతున్నది. రికార్డులలోని అంశాలపైన, సాధికార కాపీ ఇవ్వడానికి తుది అధికారం జిల్లా కమిటీకే ఉన్నప్పటికీ ఒక రాష్ట్రంలో ఆ రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లయితే తక్షణక్రింది స్థాయి / స్థానిక కమిటీకి రికార్డులను నిర్వహించే బాధ్యతను బదలాయించవచ్చు.

## నిబంధన7 క్రింద

### పార్టీ సభ్యత్వ తనిఖీ

(**వివరణ :** "సుదీర్ఘంగా, సరైన కారణం లేకుండా పార్టీ జీవితంలో, కార్యకలాపాలలో పాల్గొనడంలో విఫలమయినట్లయితే" పార్టీ సభ్యత్వం నుండి ఉపసంహరించవచ్చని క్లాజ్ (1) చెబుతున్నది. నిబంధనావళిలో పేర్కొనబడిన కారణాలు కాకుండా ఇష్టంవచ్చిన రీతిలో పార్టీసభ్యత్వం నుండి వైదొలగడం నుండి రక్షణకోసం దీన్ని చేర్చారు. అనుసరించవలసిన పద్ధతి గురించి కొన్ని రూల్సు అవసరం ఉంది)

**రూల్సు :**

(1) ఒక సభ్యుని పార్టీ సభ్యత్వం నుండి ఉపసంహరించాలని పార్టీ శాఖ భావించినట్లయితే ఆ సభ్యుడు లేదా సభ్యురాలు తన వైఖరిని వివరించడానికి అవకాశం ఇచ్చిన తర్వాతనే చేయాలి. ఆ శాఖ పార్టీ సభ్యుని ఉపసంహరించిన నిర్ణయాన్ని పై కమిటీకి లిఖిత పూర్వకంగా తెలియచేయాలి.

(2) పై కమిటీ సభ్యత్వాన్ని ధృవీకరించేటపుడు, నమోదు చేసుకునేటపుడు సభ్యత్వ ఉపసంహరణల జాబితాను పరిశీలించాలి, వాటిపై తన వైఖరిని నిర్దిష్టంగా స్పష్టం చేయాలి.

(3) సంబంధిత కమిటీ పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ నివేదికను పై కమిటీకి అందచేయాలి. దానిలో పార్టీ సభ్యత్వ నమోదు, ఉపసంహరణలు, బదిలీలు, సభ్యత్వం పొందిక వివరాలుండాలి.

(4) పార్టీ సభ్యత్వ పునరుద్ధరణకు సభ్యుడు ప్రతిఏటా సభ్యత్వ పునరుద్ధరణ ఫారంను పూర్తిచేయాలి. దానిలో వయసు, పార్టీలో చేరిన సంవత్సరం, ఆదాయం, పనిచేస్తున్న రంగం లాంటి ప్రాధమిక వివరాలుంటాయి.

(5) సభ్యత్వ రుసుం రశీదును సంబంధిత పార్టీ సభ్యునికి అందచేయాలి.

(6) పార్టీ సభ్యుని సభ్యత్వం ఉపసంహరణ గురించి ఆ నిర్ణయం ధృవీకరించబడిన 30 రోజుల లోగా ఆ పార్టీసభ్యునికి తెలియచేయాలి.

(7) పార్టీ సభ్యత్వం నుండి ఉపసంహరించబడిన నిర్ణయంపై సంబంధిత కామ్రేడ్ ఆ నిర్ణయం తనకు తెలియ చేయబడిన 30 రోజుల లోపు అప్పీలు చేసుకోవాలి.

## నిబంధన 9 క్రింద

### పార్టీ సభ్యత్వ రుసుము

**పునరుద్ధరణలు :** (వివరణ : వార్షిక సభ్యత్వ రుసుమును సభ్యుడు "ఆ సంవత్సరం మార్చి నెల చివరికల్లా" సంబంధిత బ్రాంచి లేదా యూనిట్ కార్యదర్శికి చెల్లించాలని నిబంధన 9, క్లాజ్ 1 చెబుతున్నది.

పార్టీ సభ్యత్వ రుసుము శాఖలకు మార్చి నెల చివరి వరకు చేరితే, దాన్ని జిల్లా/ రాష్ట్ర కమిటీలకు చేర్చడానికి సమయం పడుతుంది. అందుచేత కేంద్రకమిటీకి పూర్తి సభ్యత్వ రుసుము ఒక సమయానికి చేరడం లేదు. అది ఏప్రిల్ నుండి డిసెంబరు వరకు కూడ కొనసాగుతున్నది. కేంద్రానికి సభ్యత్వరుసుము చేరేందుకు కటాఫ్ తేదీని నిర్ణయించాలి.)

**రూల్సు :**

(1) పార్టీ సభ్యత్వ పునరుద్ధరణను మార్చి 31 కల్లా పూర్తిచేయాలి.

(2) రాష్ట్ర కమిటీలు పార్టీ సభ్యత్వ రుసుమును ప్రతి సంవత్సరం మే 31 కల్లా కేంద్రకమిటీకి జమచేయాలి.

(3) ఒక వేళ ఏ పరిస్థితిలోనయినా ఈ తేదీని పెంచాల్సి వస్తే అది కేంద్రకమిటీ / పొలిట్‌బ్యూరో మాత్రమే చేస్తాయి.

(4) ఒక సంవత్సరంలో కొత్తగా కేండిడేట్ సభ్యులుగా చేర్చుకున్నవారి రుసుమును ఆ సంవత్సరం చివరికి లేదా అంతకు ముందు జమచేయాలి.

**నోట్ :** కొత్త కేండిడేట్ సభ్యుల నమోదు (పునరుద్ధరణల తర్వాత) సంవత్సరం పొడవునా జరగవచ్చు. వారి సభ్యత్వ రుసుమును కేంద్రకమిటీకి విడిగా జమచేయాలి.

**నిబంధన 10 క్రింద :**

**పార్టీ లెవీ**

**రూల్సు :**

1. **పార్టీ సభ్యుల లెవీ రేట్లు :** పార్టీ సభ్యుల నుండి క్రింద విధంగా లెవీ వసూలు చేయాలని కేంద్రకమిటీ నిర్ణయించింది.

| ఆదాయం స్లాబ్ | లెవీ శాతం |
|---|---|
| 1,000 - అంతకన్నా తక్కువ | రు. 1 |
| 1,001 - 3,000 | 0.50% |
| 3,001 - 5,000 | 0.50% |
| 5,001 - 7,000 | 1.00% |
| 7,001 - 8,000 | 1.00% |
| 8,001 - 10,000 | 1.00% |
| 10,001 - 20,000 | 1.50% |
| 20,001 - 30,000 | 2.00% |
| 30,001 - 40,000 | 2.50% |
| 40,001 - 60,000 | 3.00% |
| 60,001 - అంతకన్నా ఎక్కువ | 4.00% |

2. ఒక సభ్యుడు లెవీని మూడునెలలు, లేదా సంవత్సరానికి చెల్లిస్తుంటే అతని లేదా ఆమె వార్షికాదాయాన్ని నెల ఆదాయంగా విభజించి దాని ప్రకారం పై రేట్ల ప్రకారం లెవీ లెక్కించి వసూలు చేయాలి.

3. దంపతుల్లో, కుటుంబ సభ్యుల్లో ఒకరు సంపాదిస్తూ అతడు లేదా ఆమె పార్టీ సభ్యులు కాకపోతే ఆ ఆదాయాన్ని లెవీ కోసం పరిగణనలోకి తీసుకోరాదు.

**నోట్ :**

1. ఉద్యోగుల, వేతనదారుల ఆదాయం అంటే డిఏ ఇతర అలవెన్స్‌లతో సహా గ్రాస్ ఆదాయం. ఇది కాకుండా సభ్యులు భూమి, వ్యాపారం, భవనాలు ద్వారా ఆదాయం పొందుతుంటే దానిని కూడా ంపరిగణనలోకి తీసుకోవాలి.
2. రైతుల ఆదాయం అంటే వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి మినహాయించి మిగిలిన మొత్తం.
3. ఒక వ్యక్తి ఉమ్మడి కుటుంబంలో ఉంటే అతని వాటా ఆదాయం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి.
4. అసాధారణ పరిస్థితులు, నిరుద్యోగం, కరువు, అనారోగ్యం లాంటి సందర్భాలలో మినహాయింపులు ఇవ్వాల్సివస్తే అది ఆ సంబంధిత రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకోవాలి.

**నోట్ :**

లోకల్, ఏరియా, జిల్లా, రాష్ట్రకమిటీల వాటాను సంబంధిత రాష్ట్రకమిటీ నిర్ణయిస్తుంది.

**నిబంధన 15 సెక్షను 10 క్రింద:**

**కేంద్రకమిటీ ఆర్థిక విషయాలు**

**రూల్సు :**

1. తన ఆస్తులను నిర్వహించడానికి ఒక ట్రస్టును నియమించుకునే అధికారం కేంద్రకమిటీకి ఈయబడింది.
2. పార్టీ కేంద్రం నిర్వహణకు అవసరమయ్యే పార్టీ ఫండు లేదా ఆ సందర్భాన్ని బట్టి స్పెషల్ పార్టీ ఫండు ఏ రాష్ట్రకమిటీ ఎంత చెల్లించాలో కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది.
3. పొలిట్‌బ్యూరో ఒక ఫైనాన్స్ సబ్‌కమిటీని ఏర్పాటు చేస్తుంది. అది సమావేశమై

   (అ) రు. 10 వేల వరకు ఆర్థిక విషయాలు, వ్యయంపై మాత్రమే అది నిర్ణయం తీసుకుంటుంది. అంతకు మించిన వాటిని పొలిట్‌బ్యూరోకు నివేదిస్తుంది.

(ఆ) కేంద్రకమిటీ, దాని వ్యవస్థల త్రైమాసిక లెక్కలను పొలిట్‌బ్యూరోకు ఫైనాన్స్ సబ్‌కమిటీ అందిస్తుంది.

(ఇ) పొలిట్ బ్యూరో ఆమోదించిన వార్షిక లెక్కలను ఫైనాన్స్ సబ్‌కమిటీ కేంద్రకమిటీ ఆమోదానికి (పార్టీ నిబంధనావళిలో పేర్కొన్న విధంగా) సమర్పిస్తుంది.

(ఈ) సబ్‌కమిటీలో ఒక సభ్యుడు పార్టీ ఆదాయ, వ్యయాల ఇన్‌చార్జీగా ఉంటాడు. ఆ తర్వాత వాటిని ఎకౌంట్స్ ఇన్‌చార్జికి ఫైనలేజేషన్, నమోదు కోసం పంపించబడతాయి.

(ఉ) పార్టీ పత్రికలు, ఇతర సంస్థల(ఏమైనా ఉంటే) అర్ధసంవత్సర లెక్కలు సబ్‌కమిటీకి సమర్పించాలి.

**నిబంధన 16, సబ్ క్లాజు 3(బి) ప్రకారం:**

**రాష్ట్ర మరియు జిల్లా పార్టీ మధ్యంతర కమిటీల ఏర్పాటు**

(**వివరణ :** "పార్టీ ప్రాధమిక శాఖ, జిల్లా కమిటీ, ఏరియా శాఖల మధ్య వివిధ పార్టీ అంగాలను ఏర్పాటుచేయడంపై రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. వాటి పొందిక, పనివిధానం లాంటి అంశాలకు సంబంధించిన నిబంధనలను రూపొందిస్తుంది." అని క్లాజ్ 3(బి) పేర్కొంటున్నది. ఇది కేంద్రకమిటీ రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా జరుగుతుంది.)

ప్రాధమిక శాఖ, జిల్లాకమిటీ లేదా ఏరియా కమిటీల మధ్య కమిటీల ఏర్పాటుపై రాష్ట్రకమిటీ క్రింది నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటుంది.

(అ) ఏర్పాటు చేయవలసిన కమిటీ పరిమాణాన్ని రాష్ట్రకమిటీ నిర్ణయిస్తుంది.

(ఆ) అలాంటి కమిటీని సంబంధిత స్థాయి మహాసభ ప్రతినిధులు ఎన్నుకుంటారు. ఆ కమిటీ కార్యదర్శిని, కార్యదర్శివర్గాన్ని ఎన్నుకోవాలి.

(ఇ) మధ్యంతర కమిటీ మహాసభకు ప్రతినిధులను ఎన్నుకునే పద్ధతిని రాష్ట్రకమిటీ నిర్ణయిస్తుంది.

(ఈ) మధ్యంతర కమిటీ (స్థానిక, ఏరియా, జోన్ మొదలైన) రాష్ట్రకమిటీ, జిల్లాకమిటీలు పేర్కొన్న బాధ్యతలన్నింటిని ఆ ప్రాంత పరిధికి పరిమితమయి నిర్వహిస్తుంది.

(ఉ) సమన్వయ అవసరాలకోసం, తాత్కాలికంగా ఏర్పాటుచేసిన, నామినేట్ చేసిన కమిటీలకు పూర్తిస్థాయిలో ఎన్నుకున్న కమిటీలకుండే అధికారాలుండవు. వాటిపనిని వాటిని నియమించిన కమిటీలు గైడ్ చేస్తాయి.

(ఊ) జిల్లామహాసభలకు, దాని దిగువ మహాసభలకు ప్రతినిధుల సంఖ్యను రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తుంది.

## నిబంధన 16: పార్టీ ఆర్థిక విషయాలు మరియు అకౌంట్స్

### కేంద్రకమిటీకి దిగువ కమిటీలు (రాష్ట్ర మరియు జిల్లా పార్టీ)

(**వివరణ :** కేంద్రకమిటీ ఆర్థిక విషయాలు లెక్కలకు రూపొందించిన నిబంధనల మాదిరి ఈ క్రింది నిబంధనలు ఎన్నికైన అన్ని క్రింది కమిటీలకు వర్తిస్తాయి.)

(అ) రాష్ట్ర స్థాయిలో (మరియు రాష్ట్రకమిటీ నిర్ణయించిన మధ్యంతర/ జిల్లా కమిటీల) ఫైనాన్స్ సబ్‌కమిటీలను సంబంధిత కమిటీ కార్యదర్శివర్గం ఏర్పాటు చేస్తుంది.

(ఆ) కార్యదర్శివర్గ తనిఖీ క్రింద డబ్బు విడుదల చేయడానికి, లెక్కలు నిర్వహించడానికి సబ్‌కమిటీ బాధ్యత వహిస్తుంది.

(ఇ) సబ్‌కమిటీ ఆరునెలల నివేదికను సంబంధిత కమిటీకి సమర్పిస్తుంది. ఆ స్టేట్‌మెంట్‌ను పై కమిటీకి పంపాలి.

(ఈ) వార్షిక లెక్కలను సబ్‌కమిటీ ఆడిట్ చేసి పార్టీకమిటీ ఆమోదం కోసం పంపుతుంది.

(ఉ) పార్టీ జిల్లాకమిటీ తన, తనకు దిగువన ఉన్న అన్ని కమిటీల లెక్కలను చార్టర్డ్ ఎకౌంటెంట్ చేత ఆడిట్ చేయించి కన్సాలిడేటెడ్ స్టేట్‌మెంట్‌ను ప్రతి సంవత్సరం జులై 31 లోగా రాష్ట్రకమిటీకి పంపాలి.

(ఊ) రాష్ట్రకమిటీ తన, తనకు దిగువ ఎన్నికయిన అన్ని కమిటీల లెక్కలను చార్టర్డ్ ఎకౌంటెంట్ చేత ఆడిట్‌చేయించి కన్సాలిడేటెడ్ స్టేట్‌మెంటును ప్రతి సంవత్సరం అగస్టు 31 లోగా కేంద్ర కమిటీకి పంపాలి.

## నిబంధన 18 క్రింద :

**కేంద్ర కంట్రోలు కమిషన్ పనిచేయడానికి రూల్స్:**

1. నిబంధన 18 ప్రకారం నివేదన, అప్పీలు అందినపుడు దానిపై దర్యాప్తుచేసి, నిర్ణయం తీసుకోవడానికి కేంద్ర కంట్రోలు కమిషన్ చర్యలు తీసుకోవాలి.
2. ఏ అప్పీలు అయినా బాధిత పార్టీ సభ్యుడు మాత్రమే చేసుకోవాలి.
3. సంబంధిత శాఖ, శాఖలను, వ్యక్తులను నేరుగా సంప్రదింపులు జరిపి విషయాన్ని పరిశీలించి వాస్తవాలను తెలుసుకుని, నిర్ణయాలు తీసుకునే హక్కు కంట్రోలు కమిషన్‌కు ఉంటుంది.
4. కేంద్రకంట్రోలు కమిషన్ సాధారణంగా మూడుమాసాలకొకసారి సమావేశమవుతుంది. కంట్రోలు కమిషన్ చైర్‌పర్సన్ 14 రోజులు ముందు నోటీసుతో సమావేశాన్ని పిలుస్తారు.
5. కమిటీలో మెజారిటీ సభ్యులు కోరంగా ఉంటారు. అందరు సభ్యులు, లేదా మెజారిటీ సభ్యులు ఆమోదించినపుడు మాత్రమే కంట్రోలు కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. తీసుకున్న నిర్ణయాన్ని హాజరు కాని సభ్యులకు తెలియచేయాలి.
6. చిన్న, చిన్న విషయాలపైన, సంక్లిష్టత లేని విషయాలపైన కంట్రోలు కమిషన్ సభ్యులతో సంప్రతింపుల ద్వారా నిర్ణయం తీసుకోవచ్చు.

7. కేంద్ర కంట్రోలు కమిషన్ తన నిర్ణయాన్ని ఫిర్యాదుదారుకు, సంబంధిత రాష్ట్రకమిటీకి తెలియచేయాలి. ఆ నిర్ణయాన్ని సంబంధిత కమిటీ వెంటనే అమలుచేయాలి.
8. కేంద్ర కంట్రోలు కమిషన్ తన కార్యకలాపాల, నిర్ణయాల కన్సాలిడేటెడ్ నివేదికను కనీసం ఏడాదికి ఒకసారి కేంద్ర కమిటీకి సమర్పించాలి.
9. ఈ రూల్సన్నీ రాష్ట్ర కంట్రోలు కమిషన్‌లకు (మార్చవలసిన దాన్ని మార్చుకొనే) వర్తిస్తాయి.

## కేంద్ర కంట్రోల్ కమిషన్ వ్యవహరించవలసిన తీరుపై రూల్స్

1. ఏదైనా ఒక అప్పీలు అందిన తరువాత కంట్రోల్ కమిషన్ కన్వీనర్ మిగిలిన సభ్యులకు ఆ వివాదం గురించి తెలియజేయాలి.
2. ఆ ప్రత్యేకమైన వివాదాన్ని పరిశీలించుటకు తక్షణ చర్యలను కన్వీనరే సూచిస్తాడు. దానికి సంబంధించి మిగిలిన కేంద్రకంట్రోల్ కమిషన్ సభ్యులు కూడా తమ ప్రతిపాదనలు పంపవచ్చు.
3. కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛార్జి షీటు గురించి సంబంధిత రాష్ట్ర కమిటీకి, ఫిర్యాదుదారులకు తెలియజేస్తుంది. సంబంధిత కమిటీల వద్దనుండి అవసరమైన సమాచారాన్ని కోరే హక్కు కేంద్ర కంట్రోల్ కమిషన్‌కు వుంది. ఆ కమిటీలు సమాచారాన్ని రెండు మాసాల లోపుగా పంపించాలి.

## కేంద్రకమిటీ నిబంధనా పద్ధతులు

అసాధారణ కేసులలో నిబంధన 18, సెక్షను 3 క్రింద తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు నిర్ణయాన్ని నిలిపివేయడానికి, సవరించడానికి, తిరస్కరించడానికి కేంద్రకమిటీ కంట్రోలు కమిషన్‌ను సంప్రతించవచ్చు.

## నిబంధన 19 క్రింద క్లాజ్ 11 :

1. పార్టీ సభ్యునిపై తీసుకున్న క్రమశిక్షణా చర్య నిర్ణయాన్ని సంబంధిత శాఖ ఆ సభ్యునికి 30 రోజుల లోగా లేదా దానికి నిబంధన 19, క్లాజ్ 7 ప్రకారం

తదుపరి పైకమిటీ ఆమోదం అవసరం అయితే, ఆమోదం లభించిన 30 రోజుల లోగా తెలియచేయాలి.

2. క్రమశిక్షణా చర్యను తెలియచేసిన తర్వాత ఆరు మాసాల లోపు సంబంధిత సభ్యుడు అప్పీలు చేసుకోవచ్చు.

**ఆర్టికల్ 19లో క్లాజ్ 13 :**

**పార్టీ క్రమశిక్షణ**

"తీవ్రమైన" పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే విచారణ లేకుండా బహిష్కరించబడతాడు. సభ్యుడు శత్రువుల ఏజెంటు, గూఢచారి అని కనుగొన్నప్పుడు. సభ్యుని కార్యకలాపాలు పార్టీ ప్రయోజనాలను ఫణంగా పెట్టడంలాంటి తీవ్రమైన ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే దీనిని వర్తింపజేయాలి.

**ఆర్టికల్ 20 :**

**ఎన్నికైన సంస్థలో పార్టీ సభ్యుల రూల్స్**

1. సి.పి.ఎం.కు చెందిన ప్రతి పార్లమెంట్ సభ్యుడు కేంద్రకమిటీ నిర్ణయించినవిధంగా దానికి లెవీ చెల్లించాలి.

2. ఈ లెవీలో పొలిట్‌బ్యూరో నిర్ణయించినవిధంగా రాష్ట్ర కమిటీలకు (ఆ సభ్యుడు చెందిన రాష్ట్రానికి) చెందవలసిన లెవీ శాతం మొత్తాన్ని ప్రతి నెలా ఆ రాష్ట్ర కమిటీకి జమచేస్తారు.

   **వివరణ :** ఆర్టికల్ 20 సబ్ క్లాజు (5) ప్రకారం పార్టీకి చెందిన పార్లమెంటు, శాసనసభ్యుల, స్థానికసంస్థలలోని సభ్యుల వేతనాలు పార్టీ ధనంగానే పరిగణించబడతాయి. ఇంతకుముందు ఎం.పి.లకు ఎం.ఎల్.ఎ.లకు పెన్షన్‌లనేవి లేవు. ఇప్పుడు వచ్చినాయి కాబట్టి క్రింది రూలు రూపొందింది.

3. పార్టీకి చెందిన ఎం.పి.ల, ఎం.ఎల్.ఎ.ల స్థానికసంస్థల సభ్యుల వేతనాలు, అలవెన్స్‌లలో, పెన్షన్‌లు ఏమైనావుంటే అవి కూడా అందులో భాగమౌతాయి.

**ఆర్టికల్ 22 :**

**పార్టీ మహాసభల సన్నాహక చర్చలు**

1. గత మహాసభనుండి ప్రస్తుత మహాసభవరకు జరిగిన కార్యకలాపాల నివేదికను చర్చించేందుకు, సమీక్షించేందుకు, గత మహాసభలో రూపొందించిన పార్టీ పంథాను అమలుచేయడానికి సంబంధించిన రాజకీయ, నిర్మాణ సమస్యలను చర్చించేందుకు యీ పార్టీ మహాసభ వేదికను ఉపయోగించుకోవాలి. నిబంధనావళి పేర్కొన్నవిధంగా మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానంపై చర్చ విడిగా జరపాలి.

**ఆర్టికల్ 23 :**

**ప్రజాసంఘాల్లో పనిచేస్తున్న పార్టీ సభ్యులు**

1. పార్టీ కేంద్ర, రాష్ట్ర మరియు జిల్లా కమిటీలు వివిధ ప్రజాసంఘాలకు సబ్ కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చు. సబ్ కమిటీలలో సంబంధిత కమిటీల సభ్యులను, ప్రజాసంఘాలలో పార్టీ సభ్యులను తగువిధంగా మార్గదర్శకత్వం వహించగలరని భావించిన యితర పార్టీ సభ్యులను చేర్చుకోవచ్చు. ఏ ప్రజాసంఘానికి చెందిన సబ్‌కమిటీ సభ్యులు ఆ ప్రజాసంఘానికి సంబంధించిన సమస్యలపై ప్రత్యేక అధ్యయనం చేస్తారు. పార్టీ నిర్మాణాన్ని తనిఖీ చేస్తారు. వివిధ ప్రజాసంఘాలలో పార్టీ యూనిట్లుగాగాని, ఫ్రాక్షన్ కమిటీగాగాని వున్న పార్టీ సభ్యుల కార్యకలాపాలకు సబ్ కమిటీ మార్గదర్శకత్వం వహించి సమన్వయం చేస్తుంది. పార్టీ విధానాన్ని అనుసరించి అమలుపరచేలా చూస్తుంది.
2. ఒక ప్రజాసంఘంలో పనిచేస్తున్న మొత్తం పార్టీ సభ్యులు లేదా వివిధస్థాయిల్లో ఎన్నికయిన సంస్థల్లోని పార్టీసభ్యులు ఫ్రాక్షన్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత పార్టీ కమిటీ మార్గదర్శక నిర్ణయాలకు అనుగుణంగా ఫ్రాక్షన్ పనిచేయాలి.
3. ఒక ప్రజాసంఘంలో వివిధ స్థాయిల్లో అధికసంఖ్యలో పార్టీ సభ్యులు పనిచేస్తుంటే ఫ్రాక్షన్ సభ్యులనుండి ఫ్రాక్షన్ కమిటీలను ఏర్పాటుచేయాలి. ఫ్రాక్షన్ కమిటీని సంబంధిత పార్టీ కమిటీ ఏర్పాటుచేస్తుంది. ఈ కమిటీలలో సంబంధిత పార్టీ

కమిటీకి చెందిన సభ్యులతోపాటు తగినంత పరిపూర్ణత, ప్రజా ఉద్యమాల అనుభవం కలిగివున్నారని పార్టీ కమిటీ భావించినవారితో ఫ్రాక్షన్ కమిటీ యేర్పాటు చేయాలి.

4. ఈ విధంగా ఏర్పాటయిన ఫ్రాక్షన్ కమిటీ ఆ ప్రజాసంఘం జనరల్ కౌన్సిల్, కార్యవర్గాలలో సంబంధిత పార్టీ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయాలి. ఆ ప్రజాసంఘంలో పార్టీ కమిటీ నిర్ణయించిన అంశాలను అమలుపరచేందుకై ఫ్రాక్షన్ కమిటీ తగు చర్యలు తీసుకోవాలి.